ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
కడప
: fb.com/vaartha Digital
Published from Kadapa, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
13-10-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 252 పేజీలు: 10+4 వెల: 6.50

అమెరికా బెదిరింపులకు భయపడం : చైనా 5లో

ప్రధాని మోడీకి ట్రంప్ ఫోన్

# కల్తీ మద్యంపై 'సిట్'

● ఏలూరు రేంజ్ ఐజి అశోక్ కుమార్ నాయకత్వంలో ఏర్పాటు ● బాధ్యులెంతటివారైనా వదలం● కల్తీ మద్యంతో చనిపోయారని బిచ్చగాళ్లపై తప్పుడు ప్రచారం ● ఎపి ఎక్సైజ్ సురక్షా యాప్‌ను ఆవిష్కరించిన సిఎం చంద్రబాబు



ఆదివారం విజయవాడలో 'ఎపి ఎక్సైజ్ సురక్షా యాప్'ను ఆవిష్కరిస్తు సిఎం చంద్రబాబు

**విజయవాడ, అక్టోబర్ 12 ప్రభాతవార్త ప్రతినిధి:** నకిలీ మద్యానికి చెక్ పెట్టేందుకు 'ఎపి ఎక్సైజ్ సురక్ష' యాప్ తెచ్చామని సిఎం నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. గత పాలకులు ఎక్సైజ్ శాఖను సర్వనాశనం చేశారని.. ఇప్పుడు దాన్ని గాడిలోపెట్టినా.. వారసత్వంగా వచ్చిన సమస్యలను కూడా అధిగమించేందుకు టెక్నాలజీ వినియోగంతో యాప్ రూపొందించినట్టు సిఎం వెల్లడించారు. అలాగే కల్తీ మద్యంపై దర్యాప్తునకు ఐదుగురు అధికారులతో సిట్ ఏర్పాటు చేసినట్టు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఆదివారం క్యాంప్ కార్యాలయంలో 'ఏపీ ఎక్సైజ్ సురక్ష' యాప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో యాప్ పనితీరును వివరించడంతోపాటు కల్తీ మద్యం కట్టడికి తీసుకుంటున్న చర్యలు.. మద్యం విషయంలో కొందరు చేస్తున్న కుట్రలను సిఎం వివరించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ..."కూటమి ప్రభుత్వానికి వారసత్వంగా వచ్చిన సమస్యల్లో నకిలీ మద్యం ఒకటి. గత ప్రభుత్వం నకిలీ మద్యాన్ని ఏరులై పారించింది.. వ్యవస్థీకృతం చేసింది. వాణిజ్య పంటలా గత పాలకులు గంజాయిని పండించారు.. గంజాయి సరఫరా చేశారు. గత ప్రభుత్వంలోని పెద్దలు... తమ మనుషులకు చెందిన కంపెనీల బ్రాండ్లనే అమ్మారు. బలవంతంగా డిస్టలరీలు హ్యాండోవర్ చేసుకున్నారు.. ఓ నేర సామ్రాజ్యాన్ని సృష్టించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎక్సైజ్ వ్యవస్థను గాడిలో పెట్టాం.. బెస్ట్ పాలసీ తెచ్చాం. గత ప్రభుత్వంలో జరిగిన మద్యం దోపిడీపై సిట్ వేశాం.. విచారణ జరగుతోంది. గతంలో పొరుగు రాష్ట్రాల నుంచి మద్యం మన రాష్ట్రానికి వచ్చేది. గత పాలనలో నాణ్యమైన మద్యం లేకపోవడం, ధరలు విపరీతంగా ఉండడంతో పొరుగు రాష్ట్రాల నుంచి మద్యందిగుమతిఅయ్యేది. ఇప్పుడు అలాంటివన్నీ కంట్రోల్లోపెట్టాం. అయినా మద్యం విషయంలో ఇంకా కొందరు కుట్ర పూరి >>2

## నకిలీ మద్యం వ్యవహారం
# కాణిపాకంలో ప్రమాణానికి జగన్ సిద్ధమా?
### మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



**కడప, అక్టోబరు 12, ప్రభాతవార్త బ్యూరో :** మీరు తప్పులు చేసి ఆ తప్పులను కప్పిపుచ్చుకునేందుకే మాపై ఆరోపణలు చేస్తున్నారు,నకిలీ మద్యంలో మేము భాగస్వామ్యం అయి ఉంటే ఆ దేవుడే మమ్మల్ని చూసుకుంటాడు, రండి కాణిపాకం వెళ్లి వినాయకుని వద్ద ప్రమాణం చేద్దామని వైఎస్సార్సీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డికి రాష్ట్ర రవాణా క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి హోదాలో ఉన్న జగన్మోహన్ రెడ్డి మీటింగ్ పెట్టి పెద్దస్క్రీన్ ఏర్పాటుచేసి మానాయకుడు చంద్రబాబు నాయుడు, మా యువ నాయకుడు నారా లోకేష్, మంత్రిగా ఉన్న నాపైన విమర్శలు చేయడం సిగ్గు చేటు అన్నారు. లిక్కర్ స్కాంలో పక్కాగా దొరికిన జగన్ మా పార్టీ అధినేతపై విమర్శలు చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ధ్వజమెత్తారు. జగన్మోహన్ రెడ్డికి నేను ఛాలెంజ్ విసురుతున్నా దమ్ముంటే కాణిపాకం వెళ్లి వినాయకుని వద్ద ప్రమాణం చేసేందుకు వస్తారా అన్నారు.ఏ రోజైనా, ఏ విషయంలోనైనా మా పార్టీలో ఉన్న నాయకులు చిన్న తప్పు చేసినా మా ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటారు, మొలకల చెరువు ఘటనలో కూడా రాష్ట్ర ఎక్సైజ్ చట్ట పరిధిలో ఎవరు తప్పు చేసినా వారిని తీసుకొచ్చి శిక్షిస్తాం అని స్పష్టం చేశారు.
అందులో భాగంగానే టాస్క్ ఫోర్స్ పని చేస్తోందనీ తెలిపారు. తప్పు చేసిన వారందరినీ విచారించి జైలుకు పంపడం జరిగిందని పేర్కొన్నారు.మీ ప్రభుత్వంలో ఇలాంటి పరిస్థితులు లేవనెత్తి ఉండి ఉంటే మీరు ఇలాచేసిఉంటారాఅని ప్రశ్నించారు. వైఎస్సార్సీ హాయంలో ఒక దళిత >>2

## చీరాల వాడరేవు తీరంలో విషాదం
### సముద్రంలో ఐదుగురు గల్లంతు

**చీరాల, అక్టోబరు 12, ప్రభాతవార్త:** చీరాల మండలం వాడరేవు తీరంలో విషాదం నెలకొంది. సముద్రంలో స్నానానికి దిగిన ఐదుగురు అలల తాకిడికి గల్లంతయ్యారు. వారిలో ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. సెలవు రోజుల్లో సరదాగా గడిపేందుకు సందర్శకులు సూర్యలంక బీచ్‌తో పాటు, వాడరేవు సముద్ర తీరానికి వస్తుంటారు. ఈ క్రమంలో అమరావతిలోని విట్ యూనివర్సిటీ నుంచి కొందరు విద్యార్థులు బృందంగా వాడరేవు వచ్చారు. వారిలో సాకేత్, సాయి మణిదీప్, జీవన్ సాత్విక్‌లు అలల తాకిడి. కొట్టుకుపోయారు. స్థానికంగా ఉన్న మత్స్యకారులు, గజ ఈతగాళ్ల వారిని కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. గల్లంతైన కాసేపటికి మృతదేహాలు ఒడ్డుకు కొట్టుకొచ్చాయి. మరో విద్యార్థి సోమేష్తో పాటు చీరాలకు చెందిన గౌతమ్ సముద్రంలో గల్లంతయ్యారు. వీరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

# ఎపి ఆర్థిక రాజధానిగా విశాఖ

## 2047 నాటికి ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి
## హైదరాబాద్‌కు 30 యేళ్లు పడితే విశాఖకు పదేళ్లు చాలు
## అతిపెద్ద ఎఫ్‌డిఐ ఈ ప్రాంతానికే
## ఎఐ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేసిన మంత్రి లోకేష్



ఆదివారం విశాఖలో మొదటి ఎఐ డేటాసెంటర్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రి నారా లోకేష్

**విశాఖపట్నం, అక్టోబరు 12, ప్రభాతవార్త:** ఎపి ఆర్థిక రాజధానిగా విశాఖ పట్నాన్ని తీర్చిదిద్దుతామని, 2047 నాటికి విశాఖ ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా మారుతుందని విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. విశాఖలో మొదటి ఎఐ ఎడ్జ్ డేటా సెంటర్, ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌కు శంకుస్థాపన అనంతరం రిషికొండలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. ఇక్కడున్న ఐటీ ప్రొఫెషనల్స్‌కు, సిఇఒలకు నాహృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. నిజాయతీగా చెప్పాలంటే.. 1990ల్లో పలు ఐటీ సంస్థలు హైదరాబాద్‌కు వచ్చినప్పుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సైబర్ టవర్స్‌ను నిర్మించారు. దీనివల్ల అనేక సంస్థలు హైదరాబాద్‌కు వచ్చాయి. హైదరాబాద్ అభివృద్ధికి 30 యేళ్లు పైనే పట్టింది. విశాఖకు పదేళ్లకు మించి పట్టదు. అది మా కమిట్‌మెంట్. కంపెనీలు తీసుకు రావడం వెనుక ఉన్న శ్రమను ప్రజలు గుర్తించాలి.
రాజు గారిని మొదటిసారిగా 2017లో కాలిఫోర్నియాలో కలిశాను. ఆ సమయంలోనే మొదలైంది ఈ ప్రయాణం. ఆయనను విశాఖ, ఎపికి తీసుకువచ్చేందుకు నాకు 8 ఏళ్ల సమయం పట్టింది. పెట్టుబడుల కోసం ఇప్పుడు మనం ఇతర రాష్ట్రాలతోనే కాదు.. ఇతర దేశాలతో పోటీ పడుతున్నాం. ఈకష్టాన్ని ప్రజలు కూడా అర్థం చేసుకున్నారు. ఎపి ఆర్థిక రాజధానిగా విశాఖపట్నంకు ఈ పెట్టుబడులు ఒక్కరోజులో రాలేదు. మంతెన రామరాజు, ఎన్ఆర్ఐ టిడిపి నేత సాగర్ దొడ్డపనేని, కాటంనేని భాస్కర్ ఈ ప్రాజెక్ట్‌ను విశాఖపట్నానికి తీసుకురావడంలో ఎంతో కీలకపాత్ర పోషించారు. ఈ ప్రాజెక్ట్ వెనుక ఎంతో మంది >>2

## సిఎం చంద్రబాబుకు ప్రధాని అభినందనలు

**విజయవాడ అక్టోబరు 11,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రధాని నరేంద్ర మోదీ సీఎం చంద్రబాబుకు ఫోన్ చేశారు. సీఎంగా 15 యేళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు. దూరదృష్టి, నిబద్ధత, విలువల వల్లే చంద్రబాబు రాజకీయ జీవితం విజయవంతమైందని మోదీ అన్నారు. ఇరువురు సీఎంలుగా ఉన్నప్పుడు అనేక సందర్భాల్లో కలిసి పనిచేశామని నాటి సంగతులను మోదీ గుర్తు చేసుకున్నారు. ఎపి అభ్యున్నతికి చంద్రబాబు చేస్తున్న కృషి కొనసాగాలన్నారు.ప్రజా సంక్షేమ బాటలో సిఎం చంద్రబాబు అంకితభావంతో చేస్తున్న కృషి మరింత ఫలప్రదం కావాలని ప్రధాని ఆకాంక్షించారు. దీనికి స్పందించిన సీఎం చంద్రబాబు... ప్రధాని మోదీ సహకారంతో స్వర్ణాంధ్ర లక్ష్యాన్ని సాధిస్తామని చెప్పారు. ప్రధాని నాయకత్వంలో వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా పని చేస్తామని సిఎం చంద్రబాబు మోడీతో అన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా, ఆ తర్వాత ప్రధానిగా మోదీ 25 ఏళ్లుగా దేశానికి సేవలందిస్తున్నారని చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని ట్వీట్ చేయగా ధన్యవాదాలు తెలుపుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ట్వీట్ చేశారు.

## రుషికొండ ప్యాలెస్‌ను ఏం చేద్దాం!
### ప్రజాభిప్రాయం కోరిన పర్యాటక శాఖ

**విజయవాడ,అక్టోబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** విశాఖపట్నంలో వైఎస్సార్సీ హయాంలో నిర్మించిన రుషికొండ ప్యాలెస్‌లను వినియోగంలోకి తేవడానికి ఎపి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆ భవనాలను ఎలా వినియోగిస్తే బాగుంటుందో తెలపాలంటూ ప్రజల నుంచి సలహాలు, సూచనలను పర్యాటకశాఖ ఆహ్వానించింది. ఈ మేరకు టూరిజం అథారిటీ సిఇఒ ఆమ్రపాలి తెలిపారు. సూచనలను సంబంధిత ఇమెయిల్‌కు మెయిల్ చేయాలని పర్యాటక శాఖ సూచించింది. ఈ నెల 17 న జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆమ్రపాలి ప్రకటించారు. ఆయా సంస్థలు కూడా సూచనలు చేయవచ్చునని తెలిపారు. పౌరులు, సంస్థల సూచనలపై మంత్రుల బృందం సమీక్షిస్తుందని చెప్పారు. తర్వాత ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుందని ఆమ్రపాలి వివరించారు.



ఆదివారం న్యూఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న ఆఫ్ఘాన్ విదేశాంగ మంత్రి అమీర్‌ఖాన్ ముత్తాఖీ

# మా కంట్రోల్ లోనే అఫ్ఘాన్ ఎంబసీ

## భారత్‌తో సుస్థిర బంధాన్నే కోరుతున్నాం
## మా గడ్డపై టిటిపి స్థావరాలు లేవు
## దాడి కుట్రలు చేస్తే గుణపాఠం చెబుతాం
### అఫ్ఘాన్ విదేశాంగ మంత్రి అమీర్‌ఖాన్ ముత్తాఖీ

**న్యూఢిల్లీ, అక్టోబరు 12:** భారత్‌లో పర్యటిస్తున్న ఆఫ్ఘనిస్థాన్ విదేశాంగమంత్రి అమీర్ ఖాన్ ముత్తాఖీ మీడియా మీట్‌లో న్యూఢిల్లీలోని ఆఫ్ఘన్ రాయబార కార్యాలయం పూర్తిగా తమనియంత్రణలోనే ఉందని స్పష్టం చేశారు. ఆదివారం ఆయన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తన ముందు, వెనుక ఇస్లామిక్ ఎమిరేట్ (తాలిబన్) జెండాను ప్రదర్శించి మాట్లాడారు. భారత్ ఇంకా అధికారికంగా తాలిబన్ ప్రభుత్వాన్ని గుర్తించనప్పటికీ, ఎంబసీలో పాత జెండానే కొనసాగుతున్నప్పటికీ ఆయన ఈ ప్రకటన చేయడం గమనార్హం. ఇది మా జెండా. దీని నీడలోనే మేం జిహాద్ చేశాం.
ఈ ఎంబసీ నూటికి నూరు శాతం మాదే. ఇక్కడ పనిచేస్తున్న వారంతా మాతోనే ఉన్నారని ముత్తాఖీ తేల్చిచెప్పారు. గతంలో మహిళా జర్నలిస్టులను అనుమతించలేదని విమర్శలు రావడంతో, ఈసారి ఆదివారం సమావేశానికి మహిళా జర్నలిస్టులతో సహా పెద్దసంఖ్యలో మీడియా >>2

## సముద్రంలో దూకి ప్రాణాలు కాపాడి..
### నలుగురు యువకులను రక్షించిన ఇద్దరు కానిస్టేబుళ్లు

**విజయవాడ, అక్టోబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** శాంతి భద్రతల పరిరక్షణనే తమ విధి కాదు, సామాజిక సేవ తమ డ్యూటీనే అని పోలీసులు పలు సందర్భాల్లో నిరూపించుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇద్దరు కానిస్టేబుళ్లు ఆ సాహసం చేశారు. సముద్రంలో కొట్టుకుని పోతున్న నలుగురు యువకులను ప్రాణాలకు తెగించి కాపాడారు. దీంతో పోలీసుల ధైర్య సాహసాలను బీచ్‌లో ఉన్నవారు కొనియాడారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని మంగినపూడి బీచ్‌లో ఇద్దరు కానిస్టేబుల్స్ తమ ప్రాణాలకు తెగించి నలుగురు యువకులను కాపాడారు. కపిలేశ్వరానికి చెందిన యువకులు అబ్దుల్ అసిఫ్, ఎస్‌కే ఆర్షాద్, ఎస్‌కే సికిందర్, షరీఫ్ ఆదివారం ఉదయం బీచ్‌కు వచ్చారు. బీచ్‌లో >>2

## ఎన్డీయేలో కుదిరిన సీట్ల సర్దుబాటు
### బిజెపి, జెడియు 101 స్థానాల చొప్పున పోటీ 5లో

# వికసిత్ భారత్‌లో మనం టాప్

అత్యుత్తమ రాజధానిగా అమరావతి అభివృద్ధి

మహిళలకు వర్క్ ఫ్రం హోం విధానానికి చర్యలు

175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఇ పార్కులు

డిజిటల్ గవర్నెన్స్‌లో ఎఐ టెక్నాలజీ: సిఎం చంద్రబాబు



**విజయవాడ, అక్టోబరు 12, ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచంలో అత్యుత్తమ రాజధానిగా అమరావతిని నిలిపేందుకు చేపట్టిన ప్రతి కార్యాచరణ ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతుందని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. స్వర్ణాంధ్ర విజన్ 2047తో 2029 నాటికి రాష్ట్రంలో పేదరికం లేకుండా చేయడమే లక్ష్యంగా ఉన్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. పి4తో ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు బలంగా సంకల్పించామని అన్నారు. వికసిత్ భారత్ 2047 సాకారంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముందుందని పేర్కొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ 4వ నుంచి త్వరలో 3వ స్థానానికి వెళ్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌తో ప్రతి కుటుంబానికి అందుతున్నలబ్ధిని రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్‌గా ట్రాక్ చేస్తోందన్నారు. వన్ ఫ్యామిలీవన్ ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమంతో నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల పెంపునకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రతికుటుంబం నుంచి పారిశ్రామికవేత్త వచ్చేలా పాలసీలు తీసుకొచ్చామని, 175 నియోజకవర్గాల్లో 175 ఎంఎస్ఎంఇ పార్కులు, వన్ డిస్ట్రిక్ట్ వన్ పార్క్‌ను ప్రవేశపెడుతున్నామని వివరించారు.
రాష్ట్రంలో టెక్నాలజీ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలనుకూడా సిఎం చంద్రబాబు సమావేశంలో వివరించారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా విశాఖపట్నంను అభివృద్ధి చేస్తున్నామని, విశాఖ మోడల్‌ను అమరావతి, తిరుపతి, కర్నూలుకు విస్తరించేలా కేంద్రం సహకరించాలని కోరారు. డిజిటల్‌గవర్నెన్సులో గూగుల్ ఎఐ టెక్నాలజీ వినియోగిస్తున్నామన్నారు. ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ బెనిఫిట్ డిజిటల్ పాస్‌బుక్ క్రియేట్ చేస్తున్నామని వివరించారు. టాటా ఇన్నోవేషన్ హబ్, ఎఐఆధారిత పాలనతో రాష్ట్రం స్టార్టప్‌లకు, ఉద్యోగ సృష్టికి మార్గదర్శ >>2

# ఇక చలికూడా ఎక్కువే



## లా నినా ఎఫెక్ట్‌తో వణికిపోనున్న జనం

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** లా నినా కారణంగా ఈ ఏడాది భారత్‌లో తీవ్రమైన చలికాలం రాబోతుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఉత్తరాది రాష్ట్రాలతో పాటు అనేక దక్షిణ, పశ్చిమాది రాష్ట్రాలలో ఈ ఏడాది వర్షాకాలంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవడంతో రాబోయే చలికాలంలో చలి తీవ్రత ఎక్కువగా వుండే వీలుందని వారంటున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో ఇప్పటికే ఉష్ణోగ్రతలు 20 డిగ్రీల కంటే తక్కువగా వుండడాన్ని వాతావరణ శాఖ అధికారులు ఉదహరిస్తున్నారు. దీంతోపాటు శీతల పరిస్థితులకు కారణమయ్యే లా నినా ఇప్పటికే పలుచోట్ల ప్రవేశం >>2



'ఢిల్లీ హాఫ్ మారథాన్'లోని విజేతలతో ముఖ్యమంత్రి రేఖాగుప్తా, మంత్రి ఆశీష్ సూద్

# మా కంట్రోల్ లోనే అఫ్ఘాన్ ఎంబసీ

>> ప్రతినిధులను అనుమతించారు. భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో జరిపిన చర్చలు ఫలవంతంగా, నిర్మాణాత్మకంగా సాగాయని ముత్తాఖీ తెలిపారు. వాణిజ్యం, ఆర్థిక వ్యవస్థ, ఆరోగ్యం, విమాన సర్వీసులు, అభివృద్ధి ప్రాజెక్టులపై చర్చించాం. కాబూల్‌లోని భారత రాయబార కార్యాలయాన్ని అప్‌గ్రేడ్ చేసేందుకు కూడా భారత్ నిర్ణయించిందని ఆయన వెల్లడించారు. ఢిల్లీకాబూల్, ముంబై-కందహార్, అమృత్‌సర్-ఆఫ్ఘనిస్థాన్ మధ్య కొత్త విమాన సర్వీసులను ప్రారంభించే ప్రణాళికలను ముత్తాఖీ ప్రకటించారు. ఇరు దేశాల మధ్య ఉమ్మడి వాణిజ్య కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు, ఖనిజాలు, వ్యవసాయం, క్రీడల రంగాల్లో సహకారంపై కూడా చర్చలు జరిపినట్లు తెలిపారు. ఆఫ్ఘన్ సరుకు కోసం అటారీ-వాఘా సరిహద్దును తెరవాలని భారత్‌ను కోరినట్లు ఆయన ధృవీకరించారు. మహిళల హక్కులపై అడిగిన ప్రశ్నకు, ఇస్లాంలో స్త్రీ, పురుషులు అనే తేడా లేకుండా అందరి హక్కులు రక్షణ ఉంది. మేం విద్యకు వ్యతిరేకం కాదు. విద్య హరామ్ కాదని ముత్తాఖీ అన్నారు. ఆఫ్ఘనిస్థాన్‌లో బాలికలతో సహా కోటి మందికి పైగా విద్యార్థులు పాఠశాలలకు వెళుతున్నారని, కేవలం కొన్ని నిర్దిష్ట ప్రాంతాల్లోనే ఆంక్షలున్నాయని పేర్కొన్నారు. పాకిస్థాన్‌విషయంలో ముత్తాఖీ కఠినస్వరంతో మాట్లాడారు. "మేం శాంతియుత సంబంధాలనే కోరుకుంటాం. కానీ సంబంధాలు దెబ్బతింటే, భద్రతను ఎలా కాపాడుకోవాలో మాకు కూడా తెలుసని హెచ్చరించారు. ఆఫ్ఘనిస్థాన్‌ను నిందించే బదులు పాకిస్థాన్ తమ చెక్‌పోస్టులను అదుపులో పెట్టుకోవాలని సూచించారు.



పాట్నాలో ఆదివారం ఓటరు చైతన్య సైకిల్ ర్యాలో పాల్గొన్న యువకులు

# చలికూడా ఎక్కువే

>> చదం కూడా చలి తీవ్రతను పెంచనుందని వారు చెబుతున్నారు. భారత వాతావరణ శాఖ (ఐఎండి) అంచనా ప్రకారం 2025 చివరి నాటికి లా నినా మరింత అభివృద్ధి చెందే అవకాశం వుంది. ఇది 71 శాతంగా వుండే వీలుందని వాతావరణ శాఖ అధికారులు అంటున్నారు. దీని వల్ల సాధారణం కంటే తక్కువ ఉష్ణోగ్రతలు, భారీ హిమపాతం, మంచు ఉత్తరాది రాష్ట్రాలలో సంభవించే వీలుందని, దీని కారణంగా దేశంలోని ఇతర ప్రాంతాలలో చలి తీవ్రత పెరిగే వీలుందని వారంటున్నారు. ఈ అసహజ వాతావరణ మార్పులు గడచిన ఆరేళ్లలో ఐదవసారి ఏర్పడుతుందని వారంటున్నారు. అయితే భారత్ వంటి ఉష్ణ మండల దేశంలో లా నినా బలంగా ఎక్కువ కాలం వుంటుందని నిపుణులు చెబుతున్నారు. యుఎస్ నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ (ఎన్ఓఎఎ) అంచనా ప్రకారం గత సెప్టెంబర్ నెలాఖరులోనే లా నినా మొదలయ్యింది. ఈ లా నినా డిసెంబర్‌లో మరింత పెరిగి వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలాఖరు వరకు వుండే వీలుంది.

**లా నినా అంటే ఏమిటి?**

ఇదిలావుండగా లా నినా అనేది ఒక రకమైన వాతావరణ మార్పు. దీనిని ఎల్ నినో సదరన్ ఆసిలేషన్ (ఈఎన్ఎస్ఓ) అని పిలుస్తారు. దీనిలో సెం ట్రల్ అండ్ ఈస్టర్న్ పసిఫిక్ మహా సముద్రంలోని నీటి ఉష్ణోగ్రతలు భారీగా మార్పు చెందుతాయి, ఈ కారణంగా వాతావరణంలో ఒక్కసారిగా మా ర్పులు సంభవిస్తాయి. ఈ ఈఎన్ఎస్ఓ ప్రపంచ వాతావరణాన్ని ప్రభావితం చేస్తుంది. ఇక ఈఎన్ఎస్ఓ మూడు రకాలుగా వుంటుంది. వెచ్చగా, చ ల్లగా, మామూలుగా వుంటాయి. ఇవి రెండు నుంచి ఏడేళ్లలో మళ్లీ మళ్లీ వస్తుంటాయని నిపుణులు చెబుతున్నారు. మామూలు సమయంలో పసిఫి క్ మహా సముద్రం తూర్పు వైపు (దక్షిణ అమెరికా దగ్గర) పడమర వైపు (ఫిలిప్పీన్స్, ఇండోనేషియా దగ్గర) కంటే చల్లగా వుంటుంది. సాధారణంగా గాలులు భూమధ్య రేఖ వెంబడి పశ్చిమ దిశగా వీస్తాయి. వెచ్చని నీటిని ఆసియా వైపు నెట్టివేసే దక్షిణ అమెరికా సమీపంలో చల్లగా వుండే నీటిని పై కి లేపుతాయి. లా నినా సమయంలో ఈ గాలులు బలంగా పెరుగుతాయి. తూర్పు పసిఫిక్‌లో మరింత వెచ్చని నీటిని పశ్చిమానికి నెట్టివేసే చల్లటి నీటిని పైకి లాగుతాయి. దీంతో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సగటు కంటే కనీసం 0.5 డిగ్రీల నుంచి రెండు డిగ్రీల వరకు తగ్గుతాయి. ఇక ఎల్ నినో సమయంలో గాలులు బలహీనంగా వుంటాయి. దీంతో వెచ్చని నీరు దక్షిణ అమెరికా తీరం నుంచి ఎక్కువగా మారదు. అయితే తూర్పు పసిఫి క్ సాధారణం కంటే వేడిగా మారుతుంది. లా నినా సమయంలో దీనికి పూర్తి వ్యతిరేకంగా జరుగుతుంది. చలి గాలులు మరింత బలంగా వీస్తాయి. పశ్చిమ పసిఫిక్‌కు ఎక్కువ నీటిని నెట్టివేస్తాయి. భారత్‌లో ఎల్ నినో వస్తే వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పడతాయి. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఇక లా నినా ప్రభావంతో భారత్‌లోని చాలా ప్రాంతాలలో చలి తీవ్రత పెరిగే వీలుందని వాతావరణ శాఖ అధికారులతో పాటు నిపుణులు చెబుతున్నారు.

# 200 మంది తాలిబన్లను హతమార్చాం: పాక్ మిలటరీ

## 58 మంది పాక్ సైనికులను మట్టుబెట్టాం: అఫ్ఘాన్ మంత్రి



**ఇస్లామాబాద్, అక్టోబరు 12:** అఫ్ఘాన్ రాజధాని కాబూల్‌లో జరిపిన పాకిస్థాన్‌సైన్యం ఆపరేషన్‌తో రెండుదేశాల సరిహద్దుల్లో భారీ ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. ఇప్పటివరకూ జరిగిన దాడులు ప్రతిదాడుల్లో 23 మంది పాకిస్తాన్‌సైనికులు చనిపోగా సుమారు 200 మందికిపైగా తాలిబన్ అనుబంధ సంఘాల ఉగ్రవాదులు చనిపోయినట్లు పాకిస్తాన్ ఆర్మీ ప్రకటించింది. పాకిస్తాన్ ఆఫ్ఘనిస్తాన్ సరిహద్దుల్లోనిచెక్‌పోస్టులన్నింటిపైనా దాడులుచేసామని అఫ్ఘాన్ మంత్రి అమీర్‌ఖాన్ ముత్తాకీ ప్రకటించిన సంగతి తెలిఇందే. పాకిస్తాన్ ఆర్మీ మాత్రం 19 ఆఫ్ఘన్ మిలిటరీ పోస్టులు, ఉగ్రవాద స్థావరాలను ధ్వంసంచేసామని ప్రకటించుకుంది. ఆఫ్ఘన్ దళాలు సరిహద్దుల్లో అప్రకటిత దాడులు రిపాయని పాక్ చెపుతుంటే ఆఫ్ఘనిస్తాన్ మాత్రం తాము 58 మంది పాకిస్తానీ సైనికులను హతమార్చామని, మరో 30 మందికి తీవ్ర గాయాలు కూడా అయినట్లు ప్రకటించింది. పాక్ ఆర్మీ తన ప్రకటనలో ఈనెల 11,12 తేదీల రాత్రివేళలో ఆఫ్ఘన్ తాలిబన్, తెహ్రీక్ ఎ తాలిబన్ పాకిస్తాన్ రెండూ సంయుక్తంగా పాకిస్తాన్‌పై అప్రకటిత దాడులుచేసినట్లు వెల్లడించారు. పిరికి పందల కార్యాచరణగా ఈ దాడులుచేసాయని, సరిహద్దుల్లో కాల్పులకు తెగబడిందని, భౌతికదాడులకు దిగిందని, ఫ్రాంటియర్ ప్రాంతాల్లో ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ జుగుప్సాకరంగా వ్యవహరిస్తోందని ఇరువురూ ఒకరిపై ఒకరు ఆరోపణలకు దిగారు. తాలిబన్ శక్తులకు, ఖ్వార్జీ టిటిపి ఉగ్రవాదులకు గుణపాఠం చెప్పామన్నారు. 23 మంది పాకిస్తానీ సైనికుల ఉచనిపోయారని, 29 మంది తీవ్ర గాయాలపాలయ్యారని వెల్లడించింది. అంతేకాకుండా 200 మంది తాలిబన్ అనుబంధ ఉగ్రవాదులను మట్టుబెట్టామని మరో 21 మందిని తమ అధీనంలోకి తీసుకున్నట్లు ప్రకటించింది. పాక్ దాడుల్లో ఆఫ్ఘన్‌వైపు ఉన్న ఉగ్రస్థావరాలన్నింటినీ నిర్వీర్యం చేసామని పాక్‌ప్రకటించుకుంది. సామాన్య పౌరులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పాక్ అన్ని చర్యలు తీసుకుందన్నారు. దౌత్యపరంగాను, చర్చలపరంగా నిర్మాణాత్మక బంధానికే తాము ప్రాధాన్యత ఇస్తామని, ఆఫ్ఘన్ గడ్డపైనుంచి పాక్‌కు వ్యతిరేకంగా ఎలాంటి ఉగ్రచర్యలను, విద్రోహచర్యలను తాము ఉపేక్షించేదిలేదని పాక్ ఆర్మీ ప్రకటించింది. పాక్ అద్యక్షుడు ఆసిఫ్ ఆలి జర్దారీ, ప్రధాని షెహబాజ్‌షరీఫ్‌లు కూడా ఈ దాడులపై స్పందించారు. పాకిస్తాన్ సార్వభౌమత్వంపై దాడిని ఎట్టిపరిస్థితుల్లోను అంగీకరించమని ఆర్మీ సరైన రీతిలో స్పందించిందని ప్రశంసలు కురిపించారు. సరిహద్దుల్లో ఉన్న అనేక ఆఫ్ఘన్ పోస్టులను రాత్రికిరాత్రే ధ్వంసంచేసిందన్నారు. పాక్ వ్యతిరేక శక్తులపై చర్యలు తీసుకోవాలని, విదేశీ గడ్డపైనుంచి పాక్‌పై దాడులుచేస్తామంటే ఉపేక్షించేదిలేదని జర్దారి తాలిబన్‌ప్రభుత్వానికి విజ్ఞప్తిచేసారు.

# పాప్‌స్టార్‌తో కెనడా మాజీ ప్రధాని ట్రూడో డేటింగ్!

**టొరంటో, అక్టోబరు 12:** కెనడా మాజీ ప్రధాని జస్టిన్ ట్రూడో(53)కు సంబంధించిన విడియో ఇపుడు సోషల్‌మీడియాలో వైరల్ అవుతోంది. ఆయన పాప్ స్టార్ పెర్రీకి ముద్దులు పెడుతున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కెనడా మాజీ ప్రధాని జస్టిన్ ట్రూడో (53) పదవిలో లేనప్పటికీ ఏదో ఒక అంశంతో తరచూ వార్తల్లో నిలుస్తుంటారు. ఇటీవల వరల్డ్ ఫేమస్ పాప్ సింగర్ కేటీ పెర్రీ(40) తో ట్రూడో డేటింగ్‌లో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. వాటిని నిజం చేస్తూ..తాజాగా వారిద్దరు ముద్దులు పెట్టుకున్న ఫొటోలు బయటకు వచ్చాయి. కాలిఫోర్నియాలోని శాంటా బార్బరాలో ఓ బోటులో వారిద్దరు కిస్ చేసుకుంటూ కనిపించారు. ఇక వైరల్ అవుతోన్న ఫొటోలను చూసినట్లు అయితే పెర్రీ నల్లటి స్విమ్ సూట్‌లో ఉండగా షర్ట్ లేకుండా ట్రూడో ఉన్నారు. అంతేకాక వారిద్దరూ కౌగిలించుకుంటున్నారు. ట్రూడో పెర్రీ చెంపకు ముద్దు పెడుతున్నట్లు ఆ పిక్స్‌లో కనిపిస్తుంది. ఈ సన్నివేశాలను ఓ ప్రత్యక్ష సాక్షిచూసి సోషల్ మీడియాలో పోస్టుచేసాడు. తొలుత ట్రూడో, పెర్రీ ఉన్న బోటును దూరంగా చూసి దగ్గర వెళ్లిన తరువాత తాను ధృవీకరించుకున్నట్లు సదరు వ్యక్తి పేర్కొన్నారు. మొత్తంగా వారిద్దరి డేటింగ్ పుకార్లకు ఈ ఫొటోలు బలాన్ని చేకూరుస్తున్నాయి. గతంలో జూలై 28న మోంట్రియాల్‌లోని ప్రముఖ రెస్టారెంట్లో వీరిద్దరూ కలిసి డిన్నర్ చేశారు. అందుకు సంబంధించిన చిత్రాలు వెలుగులోకి రావడంతో వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారనే తొలుత వార్తలు వచ్చాయి. పెర్రీ, యాక్టర్ ఓర్లాండో బ్లూమ్ తో ఏడేళ్లు కలిసి జీవించింది. అంతేకాక నిశ్చితార్థం కూడా జరిగింది. అయితే వివిధ కారణాలతో ఈ ఏడాది జూన్‌లో వారి నిశ్చితార్థం రద్దైంది.

# జగన్ సిద్ధమా?

>> డ్రైవర్‌ను చంపిన ఎమ్మెల్సీని ఈరోజు మీ వెంట పెట్టుకుని తిరుగుతూ? ఆరోజు అతని పై ఏమైనా చర్యలు తీసుకున్నారా అని ప్రశ్నించారు. నెల్లూరు జిల్లాలో ఒక మహిళా శాసన సభ్యురాలిని, ఒక మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే అసభ్యకరంగా మాట్లాడిన ఘటనను రాష్ట్రం తోపాటు భారతదేశ వ్యాప్తంగా వ్యతిరేకిస్తే ఘటన జరిగిన ఒక నెలకే వాళ్ల ఇంటికి వెళ్లి ఆయనతో విందు చేసుకొని వెళ్లావా సిగ్గు లేదా అన్నారు. మీ దగ్గర రౌడీలను, ఖూనీ కోరులను, మాఫియాను పెట్టుకొని తప్పులు చేసేది మీరని, మేము చిత్తశుద్ధితో పనిచేస్తూ ఏదైనా సమస్యలు వచ్చినప్పుడు చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. సర్పంచ్ స్థాయి నుంచి మాజీ ముఖ్యమంత్రి స్థాయి నాయకుడు వరకు ఎప్పుడో పాత ఫోటోలు పెట్టి ట్యాగులు చేస్తూ సోషల్ మీడియాలో మాపై పోస్టులు పెడుతున్నారని, మద్యం స్కాముకు సంబంధించిన డబ్బు మేము వాడిన, మా అకౌంట్‌లోకి జమ అయిన, మేము తప్పు చేసినామని తెలిసినా కూడా దేనికైనా సిద్ధమని చెప్పారు. తప్పు చేసేది మీరు నెట్టేది వేరే వారి పైనా, లిక్కర్, రెవెన్యూ, ఇసుక, మైన్ రంగంలో జగన్ పాత్ర ఉందని సిట్ దర్యాప్తులో తేలిందని గుర్తు చేశారు. మేము తప్పు చేసి ఉంటే మా ప్రభుత్వం పెట్టుకొని మేము ఆదిలోనే అణిచివేసే వారిమి కదా అన్నారు. మెడికల్ కాలేజీల పైన కోటి సంతకాలు అంట.. మీరు కోటి సంతకాలు పెట్టించాలంటే మీకు ఎలక్షన్లో వచ్చిన ఓట్లే కోటి ఉన్నాయని ఎద్దేవా చేశారు. జగన్మోహన్ రెడ్డి, ఆయన్ను, ఆయన పార్టీని ప్రజలు ఎక్కడ మరిచిపోతారో అనే భ్రమలో నేడు ఏదో ఒక కార్యక్రమం పెట్టుకుంటుకొని ప్రజల్లోకి వస్తున్నారని మంత్రి విమర్శించారు.

# ప్రాణాలు కాపాడి..

>> స్నానం చేస్తుండగా అలల ఉధృతికి వారు గందరగోళానికి గురయ్యారు. వారిని గమనించిన కానిస్టేబుల్స్ నాంచారయ్య, శేఖర్ హుటాహుటిన నీటిలోకి వెళ్లి.. వారిని ప్రాణాలతో ఒడ్డుకుచేర్చారు. వీరిద్దరి సాహసంతో నలుగురు యువకులు ప్రాణాలతో బయటపడ్డారు. కానిస్టేబుళ్ల మానవతా హృదయాన్ని, ధైర్య సాహసాలను పలువురు ప్రశంసిస్తున్నారు.

## వారం - వర్జ్యం

13-10-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, కృష్ణపక్షం
సప్తమి ఉ. 11.29
ఆరుద్ర ఉ. 12.30
వర్జ్యం : రా. 12.14-1.48
దు.ము. 12.18-ము. 1.05,
2) ము. 2.40-3.27
రాహుకాలం - ఉ. 7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** జీవిత భాగస్వామి ద్వారా ధనలాభం పొందుతారు. ప్రయాణాలు.

**వృషభం:** సంక్షేమ సంఘాల వలన లాభపడతారు. వ్యాపారాలు సానుకూలంగా ఉంటాయి.

**మిథునం:**వ్యాపార విస్తరణకు నిపుణులతో చర్చించి కార్యాచరణలో కొంత అభివృద్ధిని సాధిస్తారు.

**కర్కాటకం:**చాలా కాలంగా పరిష్కారము కాని కుటుంబ సమస్యలు పరిష్కారమవుతాయి.

**సింహం:**వృత్తి ఉద్యోగాలలో ఎక్కువ శ్రద్ధ కనబరచి అనుకూల ఫలితాలు సాధిస్తారు.

**కన్య :** మీ క్రింది స్థాయి ఉద్యోగులు మీపై కొండెములు చెప్పడం మీకు తలనొప్పిగా మారుతుంది.

**తుల :** ఉత్తర ప్రత్యుత్తరములకు, ప్రకటనలకు వారితో సంబంధ బాంధవ్యములు పెంచుకొనులకు అనుకూలం.

**వృశ్చికం:**విచారణలు, సంప్రదింపులు, సంభాషణలు, సందర్శనాలు అనుకులిస్తాయి.

**ధనుస్సు:** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారమవుతాయి.

**మకరం:** ఇంటా బయటా ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే.

**కుంభం:** ఆప్తుల నుండి సహాయ సహకారాలు అందుకుంటారు.

**మీనం :** సన్నిహితుల సహాయ సహకారాలతో ఇంటియందు శుభకార్యం నిర్వహిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఎపి ఆర్థిక రాజధానిగా విశాఖ

>> కృషి ఉంది. గ్రేటర్ విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ 2047 నాటికి ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా మారుతుంది. విశాఖపట్నం ఎపికి ఆర్థిక రాజధాని. ఇది మా అజెండా. ఒకే రాష్ట్రంఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ మా విధానం. ప్రజలు ఆ విధంగానే ఎన్నికల్లో తీర్పు ఇచ్చారు. 94 శాతం సీట్లతో విజయం సాధించాం. సమర్థ పాలనకు, ఉద్యోగాల సృష్టికి, విశాఖను ఆర్థిక రాజధానిగా చేయడానికి ప్రజలు స్పష్టమైన మెజార్టీ ఇచ్చారు. విశాఖ ప్రజలు ఎప్పుడూ టిడిపితోనే ఉన్నారు. ఈ నగరంపై నాకు ప్రత్యేకమైన ప్రేమ ఉంది. 2019లో రాష్ట్రంలో, ఇతర ప్రాంతాల్లో మేం ఓడిపోయినా విశాఖ ప్రజలు మాత్రం మాతోనే ఉన్నారు. విశాఖ ప్రజలు ధైర్యవంతులు. 2014 సమయంలో హుద్‌హుద్ విపత్తు వచ్చినప్పుడు నగరం తీవ్రంగా నష్టపోయింది. అప్పుడు విశాఖ ప్రజలు నగర పునరుద్ధరణకు చంద్రబాబునాయుడు గారికి ఎంతో మద్దతుగా నిలిచారు. ఆసమయంలో ప్రధాని మోడీ గారు కూడా నష్టాన్ని స్వయంగాచూశారు. ఇంత విధ్వంసం తర్వాత కూడా ప్రజలు చిరునవ్వుతో చేతులు ఊపుతూ స్వాగతం పలికారు. అది విశాఖ ప్రజల స్ఫూర్తి. భారతదేశ చరిత్రలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి విశాఖపట్నానికే వస్తోంది. గత 17 నెలల్లో ఎపికి వచ్చిన 120 బిలియన్ డాలర్ల పెట్టుబడుల్లో 50 శాతం కంటే ఎక్కువగా గ్రేటర్ విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్‌కు వచ్చాయి. దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ విశాఖకు వస్తోంది. భారతదేశ చరిత్రలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి విశాఖపట్నానికే వస్తోంది. దీనివల్ల శక్తివంతమైన ఎకోసిస్టమ్ అభివృద్ధి చెందుతుంది. సూపర్‌సిక్స్ హామీల్లో చెప్పినట్లుగా 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే మా ప్రధానలక్ష్యం. విశాఖలో 5 లక్షల ఐటీ ఉద్యోగాలు కల్పిస్తాం. ఎపిలో డబుల్ ఇంజన్ సర్కార్ బుల్లెట్ రైలులా దూసుకెళ్తోంది. టిసిఎస్‌కు 99 పైసలకే భూమి కేటాయించారని కొంతమంది నన్ను విమర్శించారు. కొంతమంది కోర్టుకుకూడా వెళ్లారు. నేను ఇక్కడ రాజకీయాలు మాట్లాడదలుచుకోలేదు. ఆ పార్టీ ఏం చేసిందో అందరికీ తెలుసు. ఆ నిర్ణయం వల్ల కాగ్నిజెంట్, యాక్సెంచర్, సత్వా, గూగుల్ వంటి సంస్థలు విశాఖకు వచ్చాయి. ఒక విధాన నిర్ణయం ఎన్నో మార్పులకు కారణమైంది. విశాఖకు ఇది ఎంతో కీలక సమయం. ఏపీ ఆర్థిక అజెండాకు ప్రధాని నరేంద్ర మోడీ సహకరిస్తున్నారు. కేంద్రం చేపట్టే ఆర్థిక సంస్కరణల్లో ఎపికి ప్రాధాన్యం ఇస్తున్నారు. విశాఖలో 3 లక్షలమంది యోగాంధ్ర నిర్వహించి గిన్నీస్ బుక్ వరల్డ్ రికార్డ్ సృష్టించాం. ఇది చూసి ప్రధాని గారు ఆశ్చర్యపోయారు. ఇదీ విశాఖ ప్రజల నిబద్ధత. ఎపిలో డబుల్‌ఇంజన్ సర్కార్‌వల్ల విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోగలిగాం. కేంద్రం స్టీల్ ప్లాంట్‌కు రూ.11వేల కోట్ల సాయం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం రూ.3వేల కోట్లు అందించింది. మూడు ఫర్నేస్‌లు ఇప్పుడు పని చేస్తున్నాయి. వంద శాతం సామర్థంతో నడిపి ప్లాంట్‌ను లాభదాయకంగా మారేలా చేస్తాం. నిధులు అడగాల్సిన అవసరం రాకూడదు. ఇదే మా లక్ష్యం. రూ.14వేల కోట్ల సాయం ద్వారా విశాఖ స్టీల్ ప్లాంట్‌ను రక్షించడమే కాదు.. అభివృద్ధి దిశగా తీసుకెళ్తాం.

ఇది కేవలం ఎపి ఆర్థిక వ్యవస్థకు మాత్రమే కాదు.. భారత్ ఆర్థిక వ్యవస్థకూ దోహదం చేస్తుంది. రైల్వే జోన్ సాధించాం, స్టీల్ ప్లాంట్ ను కాపాడుకున్నాం. ఇప్పుడు టీసీఎస్, కాగ్నిజెంట్, యాక్సెంచర్ వంటి ఐటీ కంపెనీలు వస్తున్నాయి. వచ్చే మూడు నెలల్లో విశాఖకు మరిన్ని పెట్టుబడులు వస్తాయి. ఏ ఒక్క పెట్టుబడి పొరుగు రాష్ట్రాలకు వెళ్లకూడదనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. ఇది తొలి అడుగు మాత్రమే. మొత్తం ఎకో సిస్టమ్ రావాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఫీ ఛైర్మన్ రాజు వేగేశ్న, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్స్ హర్షా రామ్, రాజేష్ తిరుమల రాజు, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, ఎమ్మెల్యే పెన్మత్స విష్ణుకుమార్ రాజు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, ఐటీ కమ్యూనికేషన్ అండ్ ఎలక్ట్రానిక్స్ సెక్రటరీ కాటంనేని భాస్కర్, ఎపిఐఐసి ఎండీ అభిషిక్త్ కిషోర్, ఇతర ఉన్నతాధికారులు ఎన్.యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# కల్తీ మద్యంపై 'సిట్'

>> తంగా వ్యవహరిస్తున్నారు. నేరాలు చేయడం... ఎదుటి వారిపై ఆ నేరాల్ని మోపి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు." అని సిఎం అన్నారు.

**షాకింగ్ వాస్తవాలు తెలుస్తున్నాయి...**

ములకలచెరువు నకిలీ మద్యం కేసులో ఇప్పటివరకు 23 మంది నిందితులను గుర్తించాం. వీరిలో 16 మందిని అరెస్ట్ చేశారు. ఇబ్రహీంపట్నం కేసులో 12 మంది నిందితులను గుర్తించగా ఏడుగురిని అరెస్టు చేశారు. 4 పీటీ వారెంట్లు నమోదు చేశారు. ఈ కేసు మూలాల్లోకి పోతే షాకింగ్ వాస్తవాలు బయటకు వస్తున్నాయి. దీనిపై మరింత విచారణ కోసం ఐదుగురు సభ్యులతో సిట్ వేస్తున్నాం. సిట్ విచారణలో అన్ని నిజాలు బయటకు వస్తాయి... ఎవరూ తప్పించుకోలేరు. ఆఫ్రికాలో నకిలీ మద్యం తయారు చేయడానికి అలవాటు పడ్డారు... ఇక్కడ అమలు చేయాలని చూస్తున్నారు. ఈ కల్తీ మద్యం వెనుక ఎవ్వరున్నా చర్యలు తీసుకుంటాం...రాజీపడే ప్రసక్తే లేదు. మా పార్టీ వాళ్లపై ఆరోపణలు ఉన్నా.. సస్పెండ్ చేశాం. కుట్రల్లో భాగంగా శవ రాజకీయాలు చేస్తున్నారు. తండ్రి చనిపోతే శవ రాజకీయం చేశారు. గత ప్రభుత్వంలో కల్తీ మద్యం తాగి జంగారెడ్డిగూడెంలో 27 మంది చనిపోతే ఎంక్వైరీ వేయలేదు. ఇలాంటి వాళ్లు ఇప్పుడు శవ రాజకీయాలు చేసి రాష్ట్రంలో అలజడి సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. గత ప్రభుత్వంలో నాసిరకం మద్యం వల్ల చాలా మంది ఆరోగ్యాలు దెబ్బతిన్నాయి. ఏలూరులో ఒకరు చనిపోయారని చెబితే నేను అలెర్ట్ అయ్యాను.. పరీక్షలు చేయించాను. అనారోగ్య కారణాల వల్ల చనిపోయిన వాళ్లని కూడా కల్తీ మద్యంతో చనిపోయారని కుట్రలు పన్నుతున్నారు." అని ముఖ్యమంత్రి అన్నారు.

**తప్పు చేసిన వాళ్లను వదిలిపెట్టం**

కూటమి ప్రభుత్వం ప్రజల కోసం పని చేస్తుంది. ఎక్కడా, ఎవ్వరితోనూ మేం లాలూచీ పడం.. తప్పుచేస్తే తన మన బేధంచూడం. వ్యాపారం చేసుకోవాలంటే చేయొచ్చు. కానీ ఒళ్లు దగ్గర పెట్టుకుని పద్ధతిగా వ్యాపారాలు చేసుకోవాలి. తప్పుడు ప్రచారాలు చేసిన వారి ఆటలు ఇక సాగనివ్వం. వాస్తవాలుంటే చర్యలు తీసుకుంటాం.. కావాలని దుష్ప్రచారంచేస్తే వదిలి పెట్టం. ఎక్సైజ్ శాఖ సిబ్బంది కూడా సరిగా పనిచేయాలి. ఎక్సైజ్ అధికారులు కానీ.. సిబ్బందికానీ నిర్లక్ష్యంతో ఉంటే చర్యలు తప్పవు. తప్పు చేసిన వాళ్లు ఆఫీసర్లు కావచ్చు.. రాజకీయ నేతలు కావచ్చు కచ్చితంగా చర్యలు ఉంటాయి. గతంలో ఓ బార్‌లో నకిలీ మద్యంతో మనుషుల ప్రాణాలు తీసినవారికి ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చి గెలిపించారు.. కానీ మేం ఆరోపణలు రాగానే పార్టీ నుంచి సస్పెండ్ చేశాం. కరడు గట్టిన నేరస్తులు నేరాలుఘోరాలు చేసినా ధైర్యంగా అబద్దాలు చెప్పగలరు. వీక్ స్పాట్స్, వీక్ పర్సన్స్‌ను ఎంచుకుని కుట్రలు పన్నుతున్నారు... అందుకే జాగ్రత్తగా ఉండాలనిచెబుతున్నా. గతంలో ఎవ్వరైనా ప్రభుత్వాన్ని ప్రశ్నించారా? నాటి పాలకులు ప్రశ్నించే అవకాశమిచ్చారా? కానీ మేం ప్రశ్నలను ఆహ్వానిస్తాం. ఏమైనా లోటుపాట్లుఉంటే సరిదిద్దుకుంటాం"అని సిఎం చెప్పారు.

**సిట్ దర్యాప్తుతో మరిన్ని వాస్తవాలు**

"నకిలీ మద్యం కట్టడికి టెక్నాలజీ వినియోగించుకుంటున్నాం... అందుకే యాప్ తెచ్చాం. బార్ కోడ్ స్కాన్ చేస్తే ఆ మద్యం బాటిల్‌కు సంబంధించిన అన్ని వివరాలు వస్తాయి. రిటైల్ షాపుల్లో కూడా స్కాన్ చేసిన తర్వాతే మద్యం అమ్మాలనే విధానాన్ని తెస్తున్నాం. వినియోగదారులు కూడా మద్యం బాటిళ్ల వివరాలను యాప్ ద్వారా చెక్ చేసుకోవచ్చు. మద్యం తయారీ తేదీ, టైమ్, బ్యాచ్ నెంబరు ఇలా అన్ని వివరాలు ఉంటాయి. ట్రెసబులిటీ, సర్టిఫికేషన్ కూడా ఉంటుంది. ఓ షాపునకు సరఫరా చేసిన మద్యం... వేరే షాపులో అమ్మడానికి కూడా వీల్లేదు. బెల్ట్ షాపులనేవి లేకుండా ఉండేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుంది. ఈ యాప్ రేపట్నుంచే వినియోగదారులకు అందుబాటులోకి వస్తుంది. నకిలీ మద్యం కేసుపై దర్యాప్తు వేగవంతం చేసేందుకు, మరింత లోతుగా విచారణ జరిపేందుకు సిట్‌తో దర్యాప్తు చేయిస్తున్నాం. ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్, ప్రొహిబిషన్‌ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ, ఐపీఎస్ అధికారులు కె చక్రవర్తి, టి శ్రీనివాసరావు, మల్లికా గార్గ్ సిట్ దర్యాప్తు బృందంలో ఉంటారు. సిట్ దర్యాప్తుతో వాస్తవాలు వెలుగులోకి వస్తాయి." అని ముఖ్యమంత్రి అన్నారు.

**విశాఖ పెట్టుబడుల సదస్సుకు ప్రధానిని ఆహ్వానిస్తాం**

"14వ తేదీన చారిత్రక ఒప్పందం కుదుర్చుకోబోతున్నాం. నా రాజకీయ జీవితంలో ఇది అపూర్వ ఘట్టం. గూగుల్‌తో ఒప్పందం కుదుర్చుకుంటున్నాం. రాష్ట్రం విధ్వంసానికి గురైంది. ఇప్పుడు బ్రాండ్‌ను తిరిగి పునర్ నిర్మించాం. గూగుల్ సంస్థ పెద్ద ఎత్తున పెట్టుబడులు తీసుకురాబోతోంది. దేశంలో అతి పెద్ద డేటా హబ్‌గా విశాఖ మారబోతోంది. ఓవైపు డేటా సెంటర్, మరోవైపు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కరిక్యులమ్ రూపొందిస్తున్నాం. ఎప్పుడైనా ఈ స్థాయిలో పెట్టుబడులు వస్తాయని ఊహించామా? పరిశ్రమలకు కొందరు అడ్డుపడుతున్నారు... ఇది మంచిది కాదు. పెట్టుబడులు రాకుండా చేయడం... బెదిరించడం అనేది కొందరికి ఫ్యాషన్‌గా మారింది. నవంబరులో జరిగే పెట్టుబడుల సదస్సుకు ప్రధాని మోడీని ఆహ్వానిస్తాం." అని ముఖ్యమంత్రి వెల్లడించారు.

# వికసిత్ భారత్‌లో మనం టాప్

>> కంగా మారిందని అభిప్రాయపడ్డారు.

**జిడిపి, పాపులేషన్ మేనేజ్‌మెంట్, టెక్నాలజీపై చర్చ**

పెట్టుబడులు, తయారీ, ఎగుమతులు, ఉద్యోగ సృష్టి వంటి అంశాలపై దృష్టి పెట్టి, పిపిపి ప్రాజెక్టు లకు కేంద్రం వయబిలిటీ గ్యాఫ్ ఫండింగ్‌కు మద్ద తుగా ఉండటంతో జిడిపి వృద్ధికి దోహదపడు తుందని సిఎం అన్నారు. పాపులేషన్ మేనేజ్ మెంట్‌తో దేశంలో వృద్ధులశాతాన్ని తగ్గించుకునే అవకాశం ఉందన్నారు. ఈఉద్దేశంతోనే స్థానిక ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన రద్దు, మాతృత్వ సెలవులు పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. దేశా నికి స్వాతంత్ర్యం సిద్ధించి వందేళ్లు పూర్తి చేసుకునే నాటికి దేశలక్ష్యాలకు అనుగుణంగా.. మార్గదర్శ కత్వం వహించేలా ఎపి ముందుండి నడవడానికి సిద్ధంగా ఉందని పునరుద్ఘాటించారు. వికసిత భారత్ 2047కి ఆంధ్రప్రదేశ్ వాటాగా 2047 కల్లా 2.4 లక్షలకోట్ల డాలర్ల జిఎస్‌డిపి సమకూర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సిఎం చంద్రబాబు వెల్లడించారు. ఇందుకోసం చతుర్ముఖ వ్యూహం అనుసరించనున్నట్లు నీతిఆయోగ్ 10వపాలకమండలి సమావేశంలో వివరించామన్నారు. తూర్పుతీరాన్ని ఆధారంగా చేసుకొని రాష్ట్రాన్ని ఆగ్నేయాసియా ముఖద్వారంగా మారుస్తామని ప్రకటించారు. ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయాలని గమ్యంగా పెట్టుకున్నట్లు సిఎం పేర్కొన్నారు.

నైపుణ్యవంతమైన మానవ వనరులు ఎపి ప్రధాన బలమని సిఎం వెల్లడించారు. దేశంలో అందరి కంటే ముందు సాంకేతికతను అందిపుచ్చుకోవడం ద్వారా తెలుగు సమాజం ప్రపంచ వ్యాప్తంగా ప్రభావం చూపుతోందని ఆనందం వ్యక్తం చేశారు. దాన్ని మరింతగా పెంపొందించేందుకు ఆంధ్రప్రదేశ్‌లో ప్రపంచస్థాయి ఐటి హబ్‌లు, పటిష్ఠమైన డిజిటల్ మౌలిక వసతులు కల్పించి స్టార్టప్స్ సంస్కృతిని ప్రోత్సహించ బోతున్నట్లు వివరించారు. ఎపిని అమరావతి, తిరుపతి, కర్నూలు ఓర్వకల్లు, గోదావరి జోన్లుగా విభజించి ప్రాంతీయంగా అభివృద్ధి చేయబోతున్నట్లు సిఎం తెలిపారు. రాష్ట్రంలో అతి పెద్ద నగరమైన విశాఖను ఆర్థిక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి మాస్టర్‌ప్లాన్ తయారు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం అమరావతిలో క్వాంటం వ్యాలీ, ఓర్వకల్లులో డ్రోన్ సిటీ, విశాఖపట్నంలో మెడ్‌టెక్ జోన్లు అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. వీటికి తోడు విశాఖ చెన్నై, హైదరాబాద్ బెంగళూరు, చెన్నై బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్లలో పారిశ్రామిక నగరాల అభివృద్ధికి శ్రీకారం చుట్టినట్లు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్‌లో అత్యధిక సంఖ్యలో బ్లూ, వైట్‌కాలర్ జాబ్‌లు సృష్టించి ప్రత్యక్షంగా, పరోక్షంగా పనిచేసే వాతావరణాన్ని కల్పిస్తున్నట్లు చెప్పారు. మోడీ 11 యేళ్లపాలన దేశానికి బలమైన పునాదులు వేసిదంటూ ప్రధాని నాయకత్వ పటిమను చంద్రబాబు ప్రశంసించారు. జన్‌ధన్ ఆధార్ మొబైల్, స్వచ్ఛభారత్, జల్‌జీవన్ మిషన్, జిఎస్టీ అమలు, మేకిన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్, స్టార్టప్, స్టాండప్ ఇండియా, పిఎం గతిశక్తి, నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పైప్‌లైన్, స్కిల్ ఇండియా కార్యక్రమాలు భారత్‌ను ప్రబలమైన ఆర్థిక శక్తిగా నిలిపేందుకు దోహదం చేశాయని వివరించారు. రాష్ట్రంలో మహిళలకు వర్క్ ఫ్రమ్ హోం విధానాన్ని ప్రారంభించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు,మహిళలకు వివిధ రంగాల్లో ఉపాధి కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు.ఒక కుటుంబానికి ఆదాయ వనరులను సృష్టించే దిశలో మహిళల పడే శ్రమ ప్రశంసనీయమన్నారు.వర్క్ ఫ్రమ్ హోం పట్ల ఆసక్తి ఉన్న వారిని ప్రభుత్వం గుర్తించి ప్రోత్సహిస్తోందన్నారు సైన్స్ రంగంలో విజయాలు సాధిస్తున్న మహిళలకు అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో స్టెమ్ కోర్సుల పట్ల ఆసక్తి చూపించే మహిళలను ప్రోత్సాహిస్తామన్నామని స్పష్టం చేశారు. స్టెమ్ కోర్సులు చేస్తున్న మహిళలకు శుభాకాంక్షలు సిఎం తెలిపారు. కోవిడ్ అనంతర పరిణామాలు, అందుబాటులో ఉన్న సాంకేతికత వర్క్ ఫ్రమ్ హోమ్ ప్రాముఖ్యతను పెంచాయని గుర్తు చేశారు.రిమోట్ వర్క్, కోవర్కింగ్ స్పేస్, నైబర్ హుడ్ వర్క్ స్పేస్ వంటి కాన్సెప్ట్‌లు అనువైన ఉత్పాదక వాతావరణాన్ని సృష్టిస్తాయని అన్నారు. ఇవి వ్యాపారులు, ఉద్యోగులకు సమర్థవంతమైన ఫలితాలు అందిస్తాయని అభిప్రాయపడ్డారు. ఇలాంటి కార్యక్రమాలు మెరుగైన పని, జీవిత సమతుల్యతను సాధించడంలో సహాయపడతాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ఐటి, జిసిసి పాలసీ 4.0 ఆ దిశగా గేమ్ ఛేంజర్ కానుందని చంద్రబాబు వెల్లడించారు. పేదరిక నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ పబ్లిక్ పీపుల్స్ పార్ట్‌నర్‌షిప్ (పి4) కార్యక్రమాన్ని ప్రారంభించింది. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారిని గుర్తించి వారి అభ్యున్నతికి దాతల ద్వారా సహాయ సహకారాలు అందించే విధంగా చర్యలు తీసుకోనున్నారు. ఎంపిక చేసిన కుటుంబాల్లో పిల్లలకు నాణ్యమైన విద్య అందించడం, ఉద్యోగ, ఉపాధి కోసం ప్రత్యేక శిక్షణ ఇప్పించడం, నివాస ప్రాంతాల్లో, ఇంటి ఆవరణలో జీవనానికి వీలుగా మౌలిక వసతులు కల్పించడం, ఆదాయ పరంగా నిలదొక్కుకునేందుకు అవసరమైన ఆర్థిక సాయం అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పేదలను ఆదుకునేందుకు ముందుకొచ్చే మార్గదర్శకులకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చే దిశగా ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రతి నగరం, పట్టణం, మండలంలో ఐటీ కార్యాలయాల ఏర్పాటుకు శ్రీకారం చుడుతున్నామన్నారు. అందుకు తగ్గ ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు వివరించారు. అట్టడుగు స్థాయిలో ఉపాధిని సృష్టించేందుకు ఐటి, జిసిసి సంస్థలకు మద్దతు ఇస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాలు ఎక్కువ శ్రామికశక్తి భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తాయని తాను విశ్వసిస్తున్నట్లు చంద్రబాబు వెల్లడించారు. 2047 స్వర్ణాంధ్ర సాధన ద్వారా వికసిత భారత్ లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేస్తామని సిఎం చంద్రబాబు తెలిపారు.

# విశాఖ ఎకనమిక్ రీజియన్‌ను బలోపేతం చేయాలి




### 10 లక్షల కోట్ల పెట్టుబడుల్లో సగం విశాఖ రీజియన్‌కే..

### మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి

### టిసిఎస్, కాగ్నిజెంట్‌లకు 99పైసలకే భూమి కేటాయింపు తప్పా అని సూటిగా ప్రశ్నిస్తున్నా

### విశాఖ కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి నారా లోకేష్

**విశాఖపట్నం, ప్రభాతవార్త:** విశాఖకు పెద్దఎత్తున పెట్టుబడులు వస్తున్న నేపథ్యంలో విశాఖ ఎకనామిక్ రీజియన్ ను బలపేతం చేయాల్సిన అవసరం ఉందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. విశాఖ రీజియన్ లో కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, ఎకో సిస్టమ్ పై ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో విశాఖ కలెక్టర్ కార్యాలయంలో మంత్రి సమీక్షించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల మంత్రి మాట్లాడుతూ.. విశాఖలో సిఫీ ఆధ్వర్యంలో డేటా సెంటర్ కు శంకుస్థాపన చేశాం. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత విశాఖలో పెట్టుబడులు, అభివృద్ధి విషయంలో వేగంగా పరిగెడుతున్నాం. టీసీఎస్, కాగ్నిజెంట్ విషయంలో ఇప్పటికే కమిట్ మెంట్ అయింది. ఏఎన్ఎస్ఆర్ సత్వా, యాక్సెంచర్, గూగుల్, సిఫీ, ఆర్సెల్లర్ మిట్టల్ తో పాటు ఫార్మాలో సుమారు 5 కంపెనీలు పెట్టుబడులు పెట్టనున్నాయి. సుమారు 10 లక్షల కోట్ల పెటుబడులకు మేం ఒప్పందాలు చేసుకున్నాం. ఇందులో 50శాతం గ్రేటర్ విశాఖ ఎకనామిక్ రీజియన్‌కు వస్తున్నాయి. అభివృద్ధి పట్ల ప్రజాప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనం. అన్ని ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. విశాఖ ఎకనామిక్ రీజియన్ ను బలపేతం చేయాల్సిన అవసరం ఉంది నవంబర్ 14, 15 సీఐఐ భాగస్వామ్య సదస్సును కూడా విశాఖలో నిర్వహిస్తున్నాం. ఇందుకు కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నాం. రాబోయే రోజుల్లో విశాఖకు, ఏపీకి పెద్ద ప్రకటనలు వస్తాయి. అందులో ఎలాంటి సందేహం లేదు. విశాఖ ఎకనామిక్ రీజియన్ ను బలపేతం చేయాలి. ఏపీ 2.4 ట్రిలియన్ డాలర్ ఎకానమీ అవ్వాలంటే అందులో గ్రేటర్ విశాఖ రీజియన్ కనీసం 1 ట్రిలియన్ డాలర్ ఎకానమీ అవ్వాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. మేం ప్యాలెస్‌లు కట్టేందుకు విశాఖకు రాలేదు. ప్రజలకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించేలా పెట్టుబడులు తీసుకురావాలి, వాటిని గ్రౌండ్ చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. వైసీపీ ఐదేళ్లలో తీసుకురాలేని పరిశ్రమలను మేం 16 నెలల్లోనే తీసుకువచ్చాంనవంబర్ లో టీసీఎస్ సంస్థ ప్రారంభం కానుంది. కాగ్నిజెంట్ సీఈవో కూడా నవంబర్ లో వస్తున్నారు. వారి కొత్త ప్రాజెక్ట్ కు శంకుస్థాపన చేస్తున్నాం. డిసెంబర్‌లో వారి డెవలప్ మెంట్ సెంటర్ కూడా ప్రారంభించబోతున్నారు. గూగుల్ విషయానికి వస్తే రేపు ఢిల్లీకి వెళ్లి పెద్దఎత్తున ప్రకటన చేయబోతున్నాం. 99పైసలకే ఎకరా భూమి కేటాయిస్తున్నారని నాపైఆరోపణలు చేస్తున్నారు. టీసీఎస్, కాగ్నిజెంట్‌కు 99 పైసలకే భూమి ఇవ్వడం తప్పా అని నేను వారిని సూటిగా ప్రశ్నిస్తున్నాను. వైసీపీ ఐదేళ్లలో తీసుకురాలేని పరిశ్రమలను మేం 16 నెలల్లోనే తీసుకువచ్చాం. అది మా చిత్తశుద్ధి. ప్రతి సంస్థను మేం గ్రౌండ్ చేస్తాం. నాలుగు జిల్లాల కలెక్టర్లతో సమీక్షించాం. గ్రేటర్ ఎకనామిక్ రీజియన్‌కు కావాల్సిన ఎకో సిస్టమ్ పై చర్చిం చాం. రోడ్లు, ప్రభుత్వ భూముల వివరాలపై చర్చించాం. విశాఖలో రాబోయే ఐదేళ్లలో ఐటీ రంగంలో ఐదు లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. ఇది చేయాలంటే సమగ్ర ప్రణాళిక అవసరం. ఆ దిశగా మేం పనిచేస్తున్నాం. ఒకే రాష్ట్రంఒకే రాజధాని. అభివృద్ధి వికేంద్రీకరణ నినాదంతో నాడు మీ ముందుకు వచ్చాం. 94 శాతం సీట్లతో మమ్మల్ని గెలిపించారు. దానిని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మాపై ఉంది. అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెద్దుల బండిలా ముందుకు తీసుకెళ్తాం. అన్ని ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేసి యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. వైసీపీ అరాచకాలను ప్రజల ముందు ఎండగడతాం. నకిలీ మద్యం విషయంలో కూడా చాలా పెద్ద తతంగం ఉంది. హోం వర్క్ జరుగుతోంది. ప్రజాకోర్టులో వారిని దోషిగా నిలబెడతామన్నారు.

# తిరుమల సమాచారం

## 25న తిరుమలలో పెద్దశేషవాహన సేవ

**తిరుమల,అక్టోబరు 12ప్రభాతవార్తప్రతినిధి:** కార్తీకమాసంలో వచ్చే నాగులచవితి పర్వదినం తరువాత నాల్గవరోజు ఏడుకొండల వేంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తులు శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామి పెద్దశేషవాహనంపై ఊరేగడం పరిపాటి. ఈనెల 25వతేదీ శనివారం పెద్దశేషవాహనసేవ జరగనుంది. సాధారణంగా వార్షిక బ్రహ్మోత్సవాల్లో తొలిరోజు రాత్రి తొలివాహనంగా ఏడుతలల శేషునిపై మలయప్పస్వామి అధిరోహించి ఆలయ మాఢవీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షిస్తారు. మళ్ళీ నాగులచవితి పర్వదినాన మాత్రమే పెద్దశేషవాహనసేవ జరుగుతుంది. శ్రీనివాసుడు శేషాద్రిపై కొలువుదీరాడు. ఆయన పానుపు శేషుడు. అందుకే ఉత్సవాల్లో శేషుడికి ప్రాధా న్యమిస్తూ పెద్దశేషవాహనంపై ఊరేగుతారు. మన శరీరంగా మూలాధారం నుండి సహస్రారం వరకు సర్పాకారంలో ఉన్న కుండలీశక్తిని జాగృతం చేయమని బోధించడమే ఈ ఊరే గింపు అర్థం. దాసభక్తికి మారురూపంగా నిలిచే తన ప్రియ భక్తుడైన ఆదిశేషుడిపై 25వతేదీ రాత్రి 7గంటలకు తిరువీధుల్లో విహరిస్తారు.





## తిరుమలేశుని సేవలో న్యాయమూర్తులు

**తిరుమల,అక్టోబరు12ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని ఆదివారం ఉదయం నైవేద్యవిరామ సమయంలో పలువురు న్యాయమూర్తులు కుటుంబంతో కలసి దర్శనం చేసుకున్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్, జస్టిస్ శ్యామ్‌సుందర్, ముంబై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అద్వాయ్ ఎం. ఛేతన, ఛత్తీస్‌ఘర్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శరద్‌కుమార్‌గుప్త, తమిళనాడు గవర్నర్ సతీమణి లక్ష్మీరవి కుటుంబసభ్యులతో కలసి వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. రంగనాయకులు మండపంలో వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

## భగవంతుని ఆశీస్సులతో అందరూ సంతోషంగా ఉండాలి

### గాయని డాక్టర్ శోభారాజ్

**తిరుమల,అక్టోబరు 12ప్రభాతవార్తప్రతినిధి:** భగవంతుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నట్లు ప్రముఖ గాయని డాక్టర్ శోభారాజ్ తెలిపారు. రెండవ శనివారం సాయంత్రం ఆమె తిరుమలలోని నాదనీరాజనం వేదికపై అన్నమయ్యసంకీర్తనలు ఆలపించడం ఆనవాయితీ. ఆదివారం ఉదయం ఆమె విఐపి బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకున్నారు.



ఆలయ అధికారులు ఆమెకు దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## డోన్-గుంటూరు రైలును గుంతకల్లు-విజయవాడ మధ్య నడపాలి

### రైల్వేశాఖకు సీమాంధ్రుల వినతి

**గుంతకల్లు రైల్వే, అక్టోబరు 12, ప్రభాతవార్త:** దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు, గుంటూరు డివిజన్ లలో తిరుగుతున్న ఎక్స్ ప్రెస్ రైలు సర్వీసులను రాయలసీమ ప్రజల/ప్రయాణీకుల సౌకర్యార్థం గుంతకల్లుగుంటూరు/విజయవాడ మధ్య నడపాలని రైల్వే వినియోగదారులు కోరుతున్నారు. ప్రస్తుతం గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలోని డోన్ నుంచి గుంటూరు వెళ్ళే నెంబర్ 17227 ఎక్స్ ప్రెస్ రైలు ప్రతిరోజు ఉదయం 0630 గంటలకు డోన్ నుండి బయలు దేరి మధ్యాహ్నం 0200 గంటలకు గుంటూరు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో మరుసటి రోజు గుంటూరు నుంచి డోన్ కు బయలుదేరే నెంబర్ 17228 ఎక్స్ ప్రెస్ రైలు సర్వీసు ప్రతి రోజు మధ్యాహ్నం 0100 గంటలకు గుంటూరు నుంచి బయలుదేరి రాత్రి 0845 గంటలకు డోన్ చేరుకుంటుంది. ఈరైలు ఫార్మేషన్ రేక్ రాత్రి 0845 నుంచి తరువాతి రోజు ఉదయం 0630 గంటల వరకు దాదాపు పదిగంటల పాటు డోన్ లో వృధాగా ఉంచడం కంటే, డోన్ నుండి కేవలం 68 కిలోమీటర్ల దూరంలోని గుంతకల్లు వరకు పొడిగిస్తే ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లావాసులు తమ తమ అవసరాల నిమిత్తం రాష్ట్ర రాజధాని అమరావతికి వెళ్ళి వచ్చేందుకు సౌకర్యంగా, అనుకూలంగా ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు. గుంతకల్లుగుంటూరు/విజయవాడ మధ్య కొత్తగా రైలు ప్రవేశ పెట్టాలనే డిమాండ్ చాలా కాలంగా ఉంది. ఈనేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం 17228/27 రైలు సర్వీసులను గుంతకల్లు గుంటూరువిజయవాడ లేదా గుంతకల్లుగుంటూరు మధ్య నడిపితే రైల్వేకు రెవెన్యూ రాబడి పెరుగడంతోపాటు ప్రయాణీకులకు ఉపయోగకరంగాను ఉంటుందని రైల్వే వినియోగదారులు తెలిపారు.

## కల్తీ మద్యం స్కామ్‌పై సిబిఐ విచారణ జరపాలి

### మంత్రి రవీంద్రను పదవి నుంచి తొలగించాలి: మాజీ మంత్రి రోజా డిమాండ్

**పుత్తూరు (చిత్తూరు జిల్లా), అక్టోబరు 12 ప్రభాతవార్త:** అన్నమయ్య జిల్లా ములకలచెరువు మండలంలో బయటపడిన కల్తీ మద్యం స్కామ్‌ను సిబిఐతో విచారణ చేయించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పర్యాటక శాఖ మాజీ మంత్రి ఆర్.కె.రోజా డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబు, ఎక్సైజ్ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనాలను విచారించాలన్నారు. ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్రను మంత్రి పదవి నుంచి సస్పెండ్ చేయాలన్నారు. ఆదివారం చిత్తూరు జిల్లా నగరి పట్టణంలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కల్తీ మద్యం స్కామ్ సిఎం చంద్రబాబుకు, షాడో సిఎంగా వ్యవహరిస్తున్న లోకేష్‌కు తెలీకుండా జరగదన్నారు. కల్తీ మద్యం స్కామ్‌కు పాల్పడింది వైకాపాకు చెందిన వారని ఆరోపిస్తున్న నేపథ్యంలో గత 16 నెలలుగా కల్తీ మద్యం తయారుచేస్తుంటే కూటమి ప్రభుత్వం నిద్రపోతోందా అని ప్రశ్నించారు. స్వయంగా ఎక్సైజ్ శాఖాధికారులే పత్రికా సమావేశంలో కూటమి ప్రభుత్వ హయాంలోనే కల్తీ మద్యం తయారీ ప్రారంభమైందని చెప్పిన విషయాన్ని మంత్రి కొల్లు రవీంద్రకు తెలీదా అని నిలదీశారు. టిడిపి నుంచి తంబళ్లపల్లి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రోజా

ఎమ్మెల్యేగా పోటీ చేసిన జయచంద్రారెడ్డిని వైకాపా కోవర్ట్ అని ఆరోపించి సస్పెండ్ చేసి చేతులు దులుపుకో వాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ స్కామ్‌లో నిందితుడిగా వున్న జనార్ధనరావు వైకాపాకు చెందిన వ్యక్తిగా ప్రచారం చేస్తున్నారన్నారు. తప్పుడు పనులు చేసి దొరికిపోతే వైకాపా అని చెప్పడం, దొరక్కపోతే టిడిపిలోనే కొనసాగుతున్న వారి నుంచి ముడుపులు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ స్కామ్‌కు మూలకారకుడైన సురేంద్రనాయుడుకు చంద్రబాబుకు సంబంధం వుందన్నారు. 2014 నుంచి 19 సంవత్సరాల మధ్య హత్య కేసులో 2006లో జీవిత కాల శిక్ష పడి జైలులో వున్న సురేంద్రనాయుడుకు అప్పట్లో ముఖ్యమంత్రిగా వున్న చంద్రబాబునాయుడు క్షమాభిక్ష పెట్టి జైలు నుంచి విడుదల చేశారని తెలిపారు. ప్రస్తుత కల్తీ మద్యం స్కామ్‌లో ఆ సురేంద్రనాయుడు పాత్ర స్పష్టంగా వున్నట్టు ఆధారాలు వున్నాయని తెలిపారు. చంద్రబాబు నేరస్తులకు ఆశ్రయమిచ్చి వారిని స్కామ్‌లకు ఇన్‌ఛార్జ్‌గా పెట్టగా వచ్చే కలెక్షన్ డబ్బు విజయవాడలో కరకట్ట ఇంటికి చేరుతోందా లేదా హైదరాబార్‌కు చేరుతోందో సిబిఐ తేల్చాలని డిమాండ్ చేశారు. ఈ కల్తీ మద్యం స్కామ్‌పై రాష్ట్ర ప్రభుత్వం కమిటీ వేస్తే ఒరిగేదేమీ వుండదన్నారు. గతంలో నారాయణ కాలేజీల్లో జరిగిన మరణాలు, గోదావరి పుష్కరాలు, ఇటీవల తిరుపతి తొక్కిసలాట ప్రమాదలపై వేసిన కమిటీలు చంద్రబాబు రాసిచ్చిన స్క్రిప్ట్‌నే నివేదికగా ఇచ్చాయని తెలిపారు. కల్తీ మద్యం వల్ల రాష్ట్రంలో నేరాలు, రోడ్డు ప్రమాదాలు పెరిగిపోయాయని తెలిపారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన గత ఏడాదిలో గంజాయి, అక్రమ మద్యం కేసులు 21 శాతం వరకూ పెరిగాయని ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయన్నారు. మహిళలపై అత్యాచారాలు, గృహ హింస వంటి నేరాలు 10 శాతం పెరిగాయన్నారు. కల్తీ మద్యం వల్ల ఎంతో మంది మహిళల తాళిబొట్లు తెగిపోయాయని, ఇది చిన్నపాటి నేరం కాదని, అందువల్ల దీనిపై సిబిఐతో విచారణ చేయించి దోషులు ఎంత పెద్దవారైనా వారిని శిక్షించాలని ప్రధాన మంత్రి నరేంద్రమోడిని కోరారు.

## అన్నపర్రు ఘటన పునరావృతం కాకుండా చర్యలు: మంత్రి సవిత

### ఇటువంటివి జరిగితే అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని మంత్రి హెచ్చరిక

**విజయవాడ,అక్టోబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** అన్నపర్రు బీసీ హాస్టల్ లాంటి ఘటన రాష్ట్రంలో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి సవిత ఆదేశించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో నిరంతరం అప్రమత్తంగా ఉండేలా వార్డెన్లను ఆదేశించాలన్నారు. డీబీసీడబ్ల్యూవోలు తమ పరిధిలో హాస్టళ్లను నిరంతం పర్యవేక్షించాలన్నారు. హాస్టళ్లలో వార్డెన్లు ఉండేలా చూడాలని, బయట ఆహారం హాస్టళ్లోకి రాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులను సొంత బిడ్డల్లా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని టెలీ కాన్ఫరెన్స్ లో మంత్రి సవిత స్పష్టం చేశారు. జీజీహెచ్ లో చికిత్స పొందుతున్న అన్నపర్రు బీసీ హాస్టల్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వారి ఆరోగ్యం పూర్తిగా మెరుగయ్యేకే డిశ్చార్జి చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. అన్నపర్రు బీసీ హాస్టల్ విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులపై బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున, జీజీహెచ్ సూపరింటెండెంట్ ఎస్.వి.వి.రమణతో మంత్రి సవిత తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న విద్యార్థ ఆరోగ్య పరిస్థితి గురించి



జీజీహెచ్ సూపరింటెండెంట్ ఎస్.వి.వి.రమణను అడిగి తెలుసుకున్నారు. 60 మంది విద్యార్థులు వాంతులు, విరేచనాలతో ఆసుపత్రికి చేరగా, ప్రస్తుతం 24 మంది మాత్రమే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, ఒక విద్యార్థి ఐసీయూలో చికిత్స అందజేస్తున్నామని జీజీహెచ్ సూపరింటెండెంట్ ఎస్.వి.వి.రమణ తెలిపారు. ఆ విద్యార్థి ఇంతకుముందు నుంచే కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధడుతుండడంతో ఐసీయూలో వైద్యమందిస్తున్నామన్నారు. మరో ఇద్దరు విద్యార్థులు పెదనందిపాడు కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన తాత్కాలిక వైద్య శిబిరంలో చికిత్స పొందుతున్నారన్నారు. మిగిలిన విద్యార్థులను ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశామన్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత స్పందిస్తూ, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఆ విద్యార్థుల ఆరోగ్యం పూర్తిగా కుదుటపడిన తరవాతే ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేయాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యంపై గంటకు గంటకూ అప్ డేట్ ఇవ్వాలని స్పష్టంచేశారు. ఐసీయూలో చికిత్స పొందుతున్న విద్యార్థిని తక్షణమే ఎయిమ్స్ కు తరలించాలని మంత్రి సవిత ఆదేశించారు డిశ్చార్జి అయిన విద్యార్థులతో పాటు హాస్టల్ లో ఉన్న మిగిలిన విద్యార్థులను వైద్యుల పర్యవేక్షణలో ఉంచాలని బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణను, డైరెక్టర్ మల్లికార్జునను మంత్రి సవిత ఆదేశించారు. హాస్టల్ లో పరిశుభ్రతతపై తీసుకున్న చర్యలు గురించి డీబీసీడబ్ల్యూవో మయూరిని అడిగి తెలుసుకున్నారు. వేడి చల్లార్చిన నీటితో పాటు తాజా ఆహారమే వారికి అందివ్వాలన్నారు. హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, దోమలు వృద్ధి చెందకుండా బ్లీచింగ్ చల్లాని స్పష్టం చేశారు. హాస్టల్ పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్లకు వెళ్లదలుచుకున్న విద్యా ర్థులను వారి తల్లిదండ్రులను పిలిచి వారితో పంపించాలన్నారు.

## సామాన్యభక్తులకు ఊరటగా వెంకటాద్రి నిలయం

### విశాలమైన హాళ్లు, వేడినీళ్ల సదుపాయంతో భక్తులు సంతృప్తి

**తిరుమల,అక్టోబరు 12ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ వైకుంఠం తిరుమలలో పెరటాసి మాసం రద్దీ విపరీతంగా ఉంది. అనూహ్యంగా పెరిగిన భక్తులతో 40వేలమందికి మాత్రమే వసతి సదుపాయం కల్పించే అవకాశం ఉన్నా గతనెలలో అధునాతన సౌకర్యాలతో ప్రారంభమైన పిఎసి-5(వెంకటాద్రినిల యం)యాత్రికుల వసతిసముదాయం ఐదువేలమందికి విశ్రాంతినిచ్చేందుకు, బస చేసేందుకు సౌకర్యవంతంగా ఉందని సామాన్యభక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తిరుమలలో ఆర్టీసి బాలాజీ బస్టాండ్‌కు సమీపంలోనే ఉన్న వెంకటాద్రినిలయంలో ఒకేసారి నాలుగువేలమంది భక్తులు ఉండేందుకు వీలుంది. అదనంగా మరో వెయ్యిమం దివరకు భక్తులకు లాకర్లు, డార్మిటరీలు ఉన్నాయి. 16 డార్మిటరీలు, 2,400 లాకర్లు, 24గం టలూ వేడినీటి సదుపాయంతో గత వారంరోజులుగా యాత్రికులకు అదనంగా వసతి దొరికింది. 1,400 మంది భక్తులు ఒకేసారి అన్నప్రసాదాలు స్వీకరిస్తు న్నారు. కల్యాణకట్ట కూడా ఇందులోనే ఉండటంతో సామాన్యభక్తులు అధికంగా వెంకటాద్రినిలయంలోనే ఉంటున్నారు. సాదారణంగా వేసవిసెలవుల్లో ,దసరా సెలవుల్లో ఉండే భక్తుల తాకిడి తరహాలోనే పెరటాసి మాసం నాల్గవవారంలో కనిపిస్తోంది. గత నాలుగు రోజులుగా కొండపై 1.30లక్షలమంది భక్తులు ఉన్నారు. శనివారం రాత్రి వరకు 85వేలమంది భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించారు.

ఆదివారం సాయంత్రం కూడా విపరీతంగా భక్తుల రద్దీ కొనసాగుతోంది. వెంకన్న దర్శనానికి 24గంటలు సమయం నిరీక్షణ తప్పడంలేదు. సాయంత్రం తిరుమలలో జోరువాన కురిసినా భక్తులు మాత్రం చలించలేదు. దేవుని దర్శనం ఎప్పుడు చేసుకుంటామా అనే తాపత్రయంతో కదులుతున్నారు.

## తిరుపతిలో డ్రగ్స్ ఇంజక్షన్స్ కలకలం

### పట్టుబడిన యువకులు

**తిరుపతి,అక్టోబరు 12ప్రభాతవార్తప్రతినిధి:** ప్రశాంతవాతావరణం ఉండే తిరుపతి నగరంలో మళ్ళీ డ్రగ్స్ కలకలం రేపుతోంది. ఇప్పటికే డ్రగ్స్‌ను ఇంజక్షన్‌రూపంలో తీసుకుంటున్న యువత రెండు చోట్ల పట్టుబడగా తాజాగా ఆదివారం మధ్యాహ్నం తిరుపతి చెన్నారెడ్డికాల నీలోని ఇరిగేషన్ కార్యాలయం వెనుక పాడుబడిన ఇంట్లో యువకులు మత్తు ఇంజక్షన్స్ వేసుకుంటూ పోలీసులకు పట్టుబడటం సంచలనంగా మారింది. డ్రోన్ కెమెరాల నిఘాతో ఈ వ్యవహారం కనుగొనగా ఆ భవనాన్ని పోలీసులు చుట్టుముట్టారు. లోపల ఇద్దరు యువకులు డ్రగ్స్ తీసుకుంటూ దొరికిపోయారు. వారివద్ద ఉన్న డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ఇద్దరు యువకులు వైద్యవిద్యార్థులుగా తెలుస్తోంది. తిరుపతిలో డ్రగ్స్ వినియోగం చాపక్రిందనీరులా పాకుతోందని జనం ఆందోళన చెందుతున్నారు.

## నేటి నుంచి బీహార్ ప్రత్యేక రైళ్లు దారి మళ్లింపు

**గుంతకల్లు రైల్వే, అక్టోబరు 12, ప్రభాత వార్త:** దక్షిణ మధ్య రైల్వేలో రైళ్ళనిర్వహణ కారాణాలవల్ల దానాపూర్ బెంగళూరుదానాపూర్ మధ్యతిరిగే పలురైలుసర్వీసులను ప్రత్యామ్నాయ మార్గాలమీదుగా మళ్లించినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. ఈనెల 13న సోమవారం దానాపూర్ నుంచి బెంగళూరుకు బయలుదేరే నెంబర్ 03251 ప్రత్యేక సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్ ను సికింద్రాబాద్, గుంతకల్లు మీదుగా, ఈనెల 15న బుధవారం బెంగళూరు నుంచి దానాపూర్ కు బయలుదేరే నెంబర్ 03252 ప్రత్యేక సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్ ను గుంతకల్లు, సికింద్రాబాద్ ల మీదుగా, ఈనెల 14 మంగళవారం దానాపూర్ నుంచి బెంగళూరుకు బయలుదేరే నెంబర్ 03259 ప్రత్యేక సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను సికింద్రాబాద్, గుంతకల్లు మీదుగా, ఈనెల 16న గురువారం బెంగళూరు నుంచి దానాపూర్ కు బయలుదేరే నెంబర్ 03260 ప్రత్యేక సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్ రైలును గుంతకల్లు, సికింద్రాబాద్‌ల మీదుగా మళ్లించారు.

## భువనేశ్వరికి అంతర్జాతీయ అవార్డు అందరికీ గర్వకారణం

### హోంమంత్రి వంగలపూడి అనిత



**విజయవాడ,అక్టోబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** అత్యంత ప్రతిష్టాత్మక డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ అవార్డుకు ఎంపికైన సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరిని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనితని అభినందించారు. ఈ మేరకు సామాజిక సేవలో సామాన్యులకు విశేష సేవలందిస్తూ సమున్నత శిఖరాలకు చేరుతున్న మా నారా భువనేశ్వరి అమ్మకు అభినందనలు అంటూ ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత ట్వీట్ చేసారు.

ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్- 2025 సంవత్సరానికి అందించే డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ అవార్డుకు మీరు ఎంపిక కావడం ఎంతో సంతోషం..ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా తలసేయమియా బాధితుల సంక్షేమం కోసం కృషి చేస్తూనే,మరెన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ సామాజిక సాధికారతకు పాటుపడుతున్న వ్యక్తిగా మీకు ఇంతటి అత్యున్నత గౌరవం దక్కడం తెలుగు మహిళలుగా మా అందరికీ గర్వకా రణమన్నారు.మీ స్ఫూర్తితో మరెంతోమంది సమాజసేవ వైపు అడుగులేస్తూ సమ సమాజ స్థాపనకు కృషి చేయడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మీరు మరిన్ని ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరుకుంటూహోం మంత్రి వంగలపూడి అనిత హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## తిరుమలలో లోకల్‌పుష్ప

### అటవీశాఖ అదుపులో స్మగ్లర్

**తిరుమల,అక్టోబరు 12ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలంకొండల్లో విస్తారమైన ఎర్రచందనం వృక్షాలననరుకుతున్న ఓ లోకల్ పుష్పను టిటిడి అటవీశాఖ గుర్తించి పట్టుకుంది. అతను ఏకంగా పాపవినాశనం మార్గంలోని అడవిలో జపాలికి సమీపంలో ఎర్రచందనం వృక్షాన్ని నరికివేశాడు. దుంగలు చేస్తుండగా బీట్‌లో ఉన్న సిబ్బంది గమనించి పై అధికారులకు సమాచారం అందించాడు. అయితే అతనిని అదుపులోకి తీసుకున్న అటవీశాఖ సిబ్బంది అధునాతన రంపం,గొడ్డలి,కత్తిని స్వాధీనం చేసుకున్నారు. నరికివేసిన చెట్టు చందనపు చెట్టుగా తెలుస్తున్నా ఎర్రచందనం కోసం అతను అడవిలోకి వచ్చినట్లు చెబుతున్నారు. తిరుపతి జిల్లా చంద్రగిరి కొట్టాలవాసి రాజశేఖర్‌గాతెలుస్తోందని, పూర్తి వివరాలు రాబడుతున్నట్లు అటవీ శాఖ వర్గాలుతెలిపాయి.కాగా అతని వెనుకసూత్రధారి ఎవరనేదితేల్చుతామని చెబుతున్నారు.



## కాంగ్రెస్‌పై ప్రజల్లో ఆదరణ పెరుగుతోంది

### ఎఐసిసి కార్యదర్శిగణేశ్‌కుమార్ యాదవ్

**తిరుపతి,అక్టోబరు 12ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు రాష్ట్రాల్లోనే గాక దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీపట్ల ప్రజాదరణ పెరుగుతోందని ఏఐసిసి కార్యదర్శి గణేశ్‌కుమార్‌యాదవ్, పిసిసి వర్కింగ్ అధ్యక్షుడు షేక్‌మస్తాన్‌వల్లీ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ప్రజలను నిలువునా మోసం చేసిందని, గత వైసిపి ప్రభుత్వం ధోరణినే కూటమి అవలం భిస్తోందని విమర్శించారు. ఎన్నికలకు ముందు కూట మిప్రభుత్వం సూపర్‌సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని దుయ్యబట్టారు. ఆదివారం మధ్యాహ్నం తిరుపతిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో తిరుపతి జిల్లాకమిటీ, తిరుపతి నగర కమిటీల నాయకులతో ఏఐసిసి కార్యదర్శి గణేశ్‌కుమార్ యాదవ్, పిసిసి వర్కింగ్ అధ్యక్షుడు షేక్‌మస్తాన్‌వల్లీ సుదీర్ఘంగా సమావేశమయ్యారు. పార్టీలో సీనియర్, జూనియర్ నేతలు, కార్యకర్తల వ్యక్తిగత అభిప్రాయా లను, ఎదరవుతున్న సమస్యలను, ప్రజల ఇబ్బం దులును,కూటమి ప్రభుత్వంపై ప్రజావ్యతిరేకతపై లోతుగా సమీక్షించారు. కేంద్రమాజీ మంత్రి, కాం గ్రెస్‌పార్టీ సీనియర్‌నాయకుడు డాక్టర్ చింతామోహన్, పిసిసి ఉపాధ్యక్షుడు దొడ్డారెడ్డి రాంభూపాల్‌రెడ్డి, తిరుపతి సిటీ అధ్యక్షుడు గౌడపేర చిట్టిబాబు, జిల్లా అధ్యక్షుడు బాలగురవంబాబు,



కాంగ్రెస్‌పార్టీ నాయకులు వెంకట నరసింహులు, పి.కమలమ్మ,వివిధ నియోజకవర్గాల నాయకులు పాల్గొన్నారు. అనంతరం ముఖ్య అతిధులుగా విచ్చేసిన ఆ ఇద్దరు నాయకులు మాట్లా డుతూ గ్రామ,మండల స్థాయిలో ప్రజలు సమస్యలు తెలుసుకునేలా పార్టీ నాయకులు పనిచేయాలన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసుకోవాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు అభిమానులు కలిసి పనిచేసి విజచసాధన దిశగా కంకణబద్దులై పనిచేయా లన్నారు. ఓట్‌చోరీపై ప్రజల సంతకాల సేకరణ కార్యక్రమం ఈనెల 15వ తేదీలోపు పూర్తిచేయాలని సూచించారు. దేశరాజకీయాల్లో పెనుమార్పులు సంభవిస్తు న్నాయని, దీని ప్రభావం ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఉంటుందని వివరించారు. 2029లోకేంద్రంలో రాహుల్‌గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి తీసుకు రావడమే లక్ష్యమని నిర్ధేశం చేశారు.

వార్త

జీవితంలో విజయం సాధించడానికి మనిషికి తెలివి తేటలు ఉండీ అవకాశాలు వచ్చినంత మాత్రాన చాలదు. ఏకాగ్రత, లక్ష్యశుద్ధి అవసరం.

-సి.డబ్ల్యు.వెండెైట్

# ధన ధాన్య సమృద్ధికి కొత్త యోచన

ఈ దేశానికి కావల్సింది ఆహార భద్రతేకాదు. అహరహం శ్రమించి దానిని పండించే రైతుకు ఆదాయ భరోసా కూడా అవసరమే. ఇందుకోసం ప్రభుత్వాలు ఎంతగా సంకల్పించినా ఎక్కడో అక్కడ వెనుకబాటుతనం వల్ల సఫలీకృతం కాలేకపోతోంది. వ్యవసాయ క్షేత్రంలో దిగగానే రైతుకు పెట్టుబడితోపాటు నేల స్వభావం, సాగు సౌలభ్యం, మంచి విత్తనం, పెట్టుబడి, మార్కెటింగ్ వంటి అన్ని అంశాలు ఎదురౌతాయి. కొన్నిఅంశాల్లో ఇప్పటికే అందుబాటులో ఉన్న సౌకర్యాలు అక్కరకొస్తాయి. మరికొన్ని వేధిస్తుంటాయి.దారి దొరకదు. అప్పుడే రైతు డీలాపడతాడు.వీటి విషయంలో రైతు ప్రభుత్వాల మీదనే ఆధారపడాల్సివస్తుంది. ఒకవేళప్రకృతి బీభత్సాలు కలవరపెట్టినా ప్రభుత్వాలే ఆదుకోవాలి. ప్రస్తుతం సాధారణ పరిస్థితుల్లో వ్యవసాయానికి రైతుకు ఏమేమి కావాలో తెలుసుకొని అందించేందుకు పూర్వ పరిస్థితులకు భిన్నంగా రైతునాదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రైతు విస్తృత ప్రయోజనాలు కాపాడలేని ఎన్ని పథకాలున్నా అవి నిరర్థకమే. వ్యవసాయ రంగాన్ని పునస్పంఘటితం చేయడానికి తాజాగా 'ప్రధాన మంత్రి ధన ధాన్య కృషియోజన' పథకాన్ని ప్రధాని నరేంద్రమోడీ ప్రారంభించారు. రైతుకు నేరుగా ఆర్థిక, సాంకేతిక మద్దతు అందించగలిగితే రైతు కొంత తేలిక పడతాడనే ఆలోచన కావొచ్చు.ఈపథకాన్ని ప్రయోగాత్మకంగా దేశమంతటా 100జిల్లాలో అమలుకు సంకల్పించింది. ముందుగా ఆయా జిల్లాలకు ఈపథక ప్రయోజనాలు, పర్యవసానాలు, చేకూరిన లబ్ధివంటి అన్ని అంశాలను క్రోడీకరించుకుని దశల వారీగా మిగిలిన జిల్లాలకు విస్తరించాలన్నది కేంద్రప్రభుత్వ లక్ష్యం. రైతు సాగు సుసంపన్నం కావాలంటే ఏమేమీ కావాలో తెలియనిది కాదు. చేసేది సంప్రదాయ వ్యవసాయమైనా, సేంద్రియ వ్యవసాయమైనా ఏ ఇతర పరిపక్వత కలిగిన వ్యవసాయానికైనా కావాల్సిన ఉత్పాదకత వనరులన్నీ సర్వసాధారణమైవే.కానీ వాటిని సమాకూర్చుకునే అంశాలు మాత్రం దేనికైనా సమానంగా ఉంటాయి. ఎవరెన్ని చెప్పినా సాగు విధానాల సక్రమ అమలు, నిర్వహణ పర్యవేక్షణకు గ్రామ సీమలో చేపట్టడమే మేలని ఎంచి కేంద్రప్రభుత్వం జిల్లాకు 4గ్రామాలను ఎంపిక చేసుకుని అందులోనే ఈ ప్రక్షాళన కార్యక్రమాలను అమలు చేయతలపెట్టింది. ఈ పథకంలో భాగంగా ఆ ప్రాంతాల్లోని రైతులకు నేరుగానగదు సాయం, పెట్టుబడి ఖర్చుల్ని అందిస్తుంది. వారిని సతాయించకుండా ఎప్పటికప్పుడు రైతు అవసరం మేరకు విత్తనాలు, ఎరువులు, తదనుకూలంగా సాంకేతిక పరిజ్ఞానం అందిస్తుంది. దీనివలన మంచి దిగుబడి రాబట్టువచ్చు. మార్కెటింగ్ సౌకర్యాలు ఏర్పరిచి, గోదాములు, రవాణా సౌకర్యాన్ని అభివృద్ధి చేసుకోగలిగితే మంచి ఆదాయం లభిస్తుంది. తొలిదశలో ఈరకం సాగు సంస్కరణలు రైతుల్లోకి వెళ్తాయి. ఇవన్నీ పాత అంశాలుగానే కనబడుతున్నా ఆధునిక సాగుసంస్కరణలతో వ్యవసాయాన్ని మరింత వేగవంతం చేసుకోవాల్సిందే.దీంతో వ్యవసాయ ఉత్పాదకత పెరిగి దేశంలో ఆహారభద్రత ఏర్పడ్తుంది. దేశ ఆర్థిక వ్యవస్థకు స్థిరత్వం ఏర్పడ్తుంది.దాదాపు 24వేల కోట్లరూపాయల నిధులతో కనీసం ఆరు సంవత్సరాలపాటు అమలులో ఉండే పథకానికి రూపకల్పన చేశారు. తొలిదశలో తక్కువ పంట దిగుబడి, క్రెడిట్పొందడంలో సంక్లిష్టత ఉన్న సాగువృద్ధి కనిపించని జిల్లాలనే ఎంపిక చేయడం విశిష్టం. అన్నీ బాగున్న జిల్లాలనే మోడల్ జిల్లాలుగా ఎంపిక చేయకుండా నిర్దిష్ట లోపాలున్న జిల్లాలను ఎంపికచేయడం స్వాగతించదగిన విషయం. సుమారు 1.7కోట్ల రైతులు దేశం మొత్తంమీద ఈపథకం లబ్ధిదారులౌతారు. వారి అనుభవాలు,ఆర్థిక లబ్ధిప్రయోజనాల ఆసరాగా దేశంలోని అందరు రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనం కల్పించే విధంగా విస్తరిస్తారు. ఉత్పాదకత పెంపు, పంట విలిదీకరణ, స్టోరేజి వసతుల అభివృద్ధి, క్రెడిట్ సౌకర్యం పెంపు, నీటివసతుల సమీకరణ వంటి అంశాలు ఈపథకంలో ప్రముఖంగా చోటు చేసుకుంటాయి.నాణ్యత కలిగిన విత్తనాలు, కల్తీలేని ఎరువులు, వ్యవసాయ పరికరాలు, సాగుశిక్షణ సౌకర్యాలు కల్పించడం వలన ఉత్పాదకత పెరుగుతుంది. సాగు ఖర్చుతగ్గించడం కోసం ఆధునిక యంత్ర పరికరాలు, నీటి వనరులు, సబ్సిడీలను తక్కువ వ్యయంతో అందించడం వంటివి ప్రభుత్వమే పర్యవేక్షిస్తుంది. స్మార్ట్ ఫార్మింగ్ సెన్సర్లు, డ్రోన్ సర్వేలు వంటి ఆధునిక వ్యవ సాయ సాంకేతికతను రైతుకు చేరువ చేస్తుంది. వ్యవసాయ ప్రాసెసింగ్,వడపోత కేంద్రాలు, ట్రాన్స్పోర్టేషన్ వలన గ్రామీణ ఉపాధికిఆస్కారమిస్తుంది. ఇవన్నీ ప్రణాళిక బద్ధంగా అమలు జరిగితే రైతు ఉత్పాదకత తద్వారా ఆదాయం పెరిగి కొనుగోలు శక్తి కలిగి గ్రామీణ మార్కెట్ అభివృద్ధి వీలవుతుంది. కోల్డ్‌స్టోరేజీ, మార్కెట్ యార్డుల వంటి సౌకర్యాలు మెరుగుపడతాయి. లక్ష్యాల సాధనలో వ్యవసాయ సంబంధిత ప్రభుత్వశాఖల చిత్తశుద్ధి మాత్రమే ఈ పథకం విజయవంతం చేయగలుగుతుంది.ఈ పథకం కింద నిర్దేశించబడిన అన్నివనరులు, వసతులు లక్ష్యాల ను క్రమపద్ధతిలో సమన్వయపరుచుకుంటేనే సత్ఫలితాలు వస్తాయి.పంట దిగుబడులు 15 నుంచి 30శాతం పెంపు, రైతుల వార్షికఆదాయం 20 నుంచి 40శాతం పెరుగుతుందని అంచనా. 25 శాతం మేరకు నీటివనరుల సమర్థ వినియోగం,60శాతం మేరకు గ్రామీణ ఉపాధి సృష్టి రైతు ఉత్పత్తుల మార్కెటింగ్ సౌకర్యం పెంపువంటి లక్ష్యాలు ఘనంగానే రూపొందించారు. ఇవన్నీ సానుకూలపడాలంటే ప్రభుత్వశాఖల సమన్వయం, పథకం అమలులో చిత్తశుద్ధి అవసరం.

మంచి జీవితం అనే సిద్ధాంతాన్ని అనుకరించాలనే గాని, చెడు జీవితాన్ని కాదు. ధర్మపరాయణ సంపన్నులు ఈ జన్మలోనూ, రాబోయే జన్మలోనూ సుఖంలో ఉండగలరు.



గౌతమ బుద్ధుడు

చదవడం వల్ల ప్రయోజనం ఏమిటంటే నలుమూలల నుంచి వచ్చే విజ్ఞానాన్ని అంగీకరించడం, దాని నుండి గుణపాఠాలు నేర్చుకోవడం.



మహాత్మా గాంధీ

## ప్రజావాక్కు



### వైద్య కళాశాలల విస్తరణ అవసరం

వైద్య విద్యను,ఆరోగ్యసేవలను సామాన్య ప్రజలకు మరింత చేరువ చేయడంలో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ప్రభుత్వ వైద్యకళాశాలల విస్తరణ అవసరంగా మారింది. ప్రస్తుతం లభ్యమవుతున్న గణాంకాల ప్రకారం రెండు తెలుగురాష్ట్రాలలో ప్రైవేటు వైద్యకళాశాలల సంఖ్య ప్రభుత్వ కళాశాలలకంటే ఎక్కువగా ఉంది. అయినప్పటికీ విద్యార్థులపెరుగుతున్న డిమాండ్‌కి, జనాభాకు తగిన వైద్యుల నిష్పత్తి దృష్ట్యా ఈ సంఖ్య పరిమితంగా ఉంది. అధిక శాతం వైద్య సీట్లు ప్రైవేట్ లేదా మేనేజ్‌మెంట్ కోటాలో ఉండటంవల్ల మెరిట్ ఉన్న ప్పటికీ ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు ఎంబీబీఎస్ సీటు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలు విద్యా, సామాజిక రీత్యా అనేక ప్రయోజనాలను అందిస్తాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### పంట పొలాల్లో కరెంట్ పోల్స్

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని గ్రామాలలో పంట పొలాల్లో మధ్యలోమెయిన్ లైన్ కరెంటుపోల్స్ ప్రమాదకరంగా వుండి వంగి ఉన్నాయి.అసలే ఇది వానాకాలం. ఈ సమయంలో ప్రమాదవశాత్తు భారీ వర్షానికి గాని, ఈదురు గాలులకు గాని వైర్లు తెగి, నేల మీద పడితే మనుషుల, పశువుల ప్రాణాలుపోయే ప్రమాదంలేకపోలేదు. గతంలో ఎంతోమంది మృత్యువాత పడ్డారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు తక్షణమే స్పం దించాలి.

- కె. సతీష్ రెడ్డి, భూపాల్‌పల్లి జిల్లా

### అక్రమ కట్టడాలను నిర్మూలించాలి

రాష్ట్ర ప్రభుత్వం గతంలో ప్రభుత్వ ఆర్థిక సహకారంతో పేద ప్రజలకు పంచిన ఇళ్ల స్థలాలలో కబ్జాదారులు కన్ను వేసి చాలాగజాలు ఆక్రమించుకోవడం జరుగుతుంది. అక్రమకట్టడాలు నిర్మించడం జరుగుతుంది.కాలనీలలో కొన్ని ఇండ్లస్థలాలు కొనుగోలు అమ్మకాలు జరిగాయి. ప్రభుత్వ రెవెన్యూ రికార్డులలో ఎవరికి ఎంత భూమి ఎంత ఇంటి స్థలం ఉందో రికార్డులుచూపుతున్నాయి.కానీ కబ్జాదారులు ఇళ్ల స్థలాల అక్రమణకు పాల్పడుతున్నారు.రాష్ట్ర రెవిన్యూ శాఖ ఇంటి స్థలాల కొలతలు,సరిహద్దులు, వంటి విషయాలను పరిశీలించి వివాదాలు లేకుండా చూడాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్‌జిల్లా

### మహువ లడ్డూను ప్రోత్సహించిన మోడీ

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మహువ లడ్డూ గురించి ప్రస్తావించడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. మహువ పువ్వులతో తయారు చేసే ఈ లడ్డూ గ్రామీణ, ఆదివాసీ ప్రాంతాల సంప్రదాయ వంటకం. మోదీ గారి ప్రోత్సాహం వల్ల ఈ స్థానిక వంటకం జాతీయ స్థాయిలో ప్రాచుర్యం పొందుతోంది. మహువ లడ్డూను ప్రోత్సహించడం ద్వారా గ్రామీణ మహిళా సంఘాలు, స్వయం సహాయ సమూహాలకు కొత్త ఆర్థిక అవకాశాలు లభిస్తున్నాయి.స్థానికంగా లభించే పర్యావరణహిత పదార్థాలతో తయారయ్యే ఈలడ్డూ ఆరోగ్యానికి కూడా మేలుకలిగించేది. ఇలాంటి సంప్రదాయ వంటకాలను ప్రోత్సహించడం ద్వారా మన దేశపు సాంస్కృతిక వారసత్వం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలాన్ని అందిస్తుంది. మోడీ గారి ప్రోత్సాహం వల్ల మహువ లడ్డూ ఒక సాధారణ వంటకం నుంచి భారతీయ సంప్రదాయానికి, గ్రామీణ గౌరవానికి ప్రతీకగా నిలిచింది.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### ఉత్పత్తులను పెంచాలి

ప్రధాని నరేంద్రమోడీ ఇవ్వాళ ప్రారంభించబోయే రెండు వ్యవసాయ పథకాలు చాలా ముఖ్యమైనవి. దేశంలోని 100 తక్కువ సాగు విస్తీరణం తక్కువ ఉత్పాదకత తక్కువ ఉత్పత్తి ఉన్న జిల్లాలను గుర్తించి స్వయం సమృద్ధం అయ్యే విధంగా ప్రోత్సహించడం దీనిలో తెలంగాణ నుండి జనగామ నాగర్ కర్నూల్ నారాయణ పేట గద్వాల్ లాంటి జిల్లాలు ఉన్నాయి. ఇకపోతే వీటి కింద నీటి వనరుల కల్పన, నీటిని నిల్వ చేయడం ద్వారా పంటల ఉత్పాదకతకు, ఉత్పత్తికి ప్రోత్సాహం అందించడం ద్వారా కరువు నేలలను సిరులు పండే నేలలుగా మార్చే ప్రయత్నం జరుగుతుంది.

- భారత అవినాష్, జనగామ

### కల్తీలకు అడ్డుకట్ట వేయాలి

ప్రస్తుతం మార్కెట్‌లో దొరుకుతున్న నిత్యావసర వస్తు వుల ఆహార పదార్థాల కల్తీ, నకిలీ సరుకులకు ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలి. ముఖ్యంగా ఆహారపదార్థాలు కృత్రి మంగా తయారు చేయడం జరుగుతుండడంవిచారకరం. ప్లాస్టిక్ బియ్యం, ప్లాస్టిక్ గుడ్లు ,కృత్రిమ మాంసం,నల్ల బియ్యం తదితర కృత్రిమ నిత్యావసర ఆహార పదార్థాల కల్తీలకు అడ్డుకట్ట వేయాలి.లేదంటే ప్రజల ఆరోగ్యంపై వీటి ప్రభావం పడుతుంది.

-డి చాంద్ బాషా, కర్నూలు

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ప్రకృతి వైపరీత్యాలే ప్రపంచ సవాళ్లు

*మానవ స్వార్థ ప్రయోజనాల ఫలితంగా ఏర్పడుతున్న విపత్తులను అరికట్టడం కొంతవరకు మన చేతుల్లోనే ఉంది. అలాగే ప్రకృతి సంబంధిత విపత్తుల వలన జరిగే ప్రాణ,ఆస్తినష్టాలను కనీస స్థాయికి తగ్గించడం కూడా సుసాధ్యమే. ఇందుకు ప్రభుత్వాలు,ప్రజలు కంకణబద్ధులు కావాలి.ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ కూడా ఇదేవిధమైన ఆలోచనలతో ప్రజలను జాగృతం చేయాలని భావించి 2009 వ సంవత్సరంలో ఒక తీర్మానంచేసింది. అంతర్జాతీయ విపత్తుల తీవ్రతను తగ్గించేందుకు ప్రజల ప్రేరణతో ఒక ఉద్యమంగా మలచడానికి ప్రతీఏటా అక్టోబర్ 13వ తేదీన నిర్వహించే 'ఇంటర్నేషనల్ డిజాస్టర్ రిస్క్‌రిడక్షన్ డే'ఒక అవగాహనా కార్యక్రమం.ఎన్నిసంస్థలు ఎన్నివిధాలుగా కృషిచేసినా, ప్రజాచైతన్యం, ప్రజాభాగస్వామ్యం లేనిదే ఏ ప్రయత్నమైనా నిర్వీర్యం కాక తప్పదు. కాబట్టి లోక కల్యాణార్థం చేపట్టే కార్యక్రమాలకు,సంకల్పానికి వికల్పం కలగకుండా చూడవలసిన బాధ్యత ప్రజలపైన,ప్రభుత్వాలపైన ఎంతైనాఉంది.*



సుంకవల్లి సత్తిరాజు

ప్రపంచంలోని అనేక దేశాలు పలు ప్రకృతి వైపరీత్యాలకు గురవుతున్నాయి.వాతావరణంలో సంభవించే ఆకస్మిక మార్పులకు, అధిక వర్షాలకు,వరదలకు జనజీవితం అతలాకుతలం కావడం చూస్తున్నాం. ప్రకృతి విపత్తుల వలన సంభవిస్తున్న పరిణామాలు అత్యంత భయానకంగా ఉంటున్నాయి. ఈ అనర్థాలను అనుభవాలను, పాఠాలుగా స్వీకరించి, ప్రకృతి విపత్తులను ఎదుర్కోవడానికి, నష్టాన్ని సాధ్యమైనంత తక్కువ స్థాయికి తగ్గించడానికిఅంతర్జాతీయ వేదికలు కృషి చేస్తున్నాయి. మానవ మేథస్సుకంటే ప్రకృతి అత్యంత బలీయమైనది. ఎన్నో పరిశోధనలు జరిగినా, ఎన్నో ఆవిష్కరణలు జరిగినా ఇప్పటివరకు మానవుడు మృత్యువును,ప్రకృతిని జయించలేకపోయాడు. రోగానికి వైద్యపరంగా చికిత్స అందించవచ్చు. సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించవచ్చు. కాని ప్రకృతి విలయాలను ఆపడంసాధ్యం కాదు.పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం వలన ప్రకృతివిపత్తుల వలన సంభవించే ప్రాణ నష్టాన్ని, ఆస్తి నష్టాన్ని పూర్తిగా నివారించలేకపోయినా కనీస స్థాయికి తగ్గించే అవకాశాలున్నాయి.ప్రకృతి విపత్తులను ఎదుర్కోవడానికి,నష్టాన్ని సాధ్యమైనంత తక్కువ స్థాయికి తగ్గించడానికి ఐక్యరాజ్య సమితి ప్రతీ ఏటా అక్టోబర్ 13వ తేదీని అంతర్జాతీయ విపత్తుల తగ్గింపు దినోత్సవం (ఇంటర్నేషనల్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ డే)గా పాటిస్తున్నది. ప్రకృతిలో సంభవించే తీవ్రమైన పరిణామాలను 'విపత్తు' అని నిర్వచించవచ్చు. ప్రపంచాన్ని ఎలాంటి విపత్తులు లేకుండా కాపాడాలనే మానవ సంకల్పానికి వికల్పమే వైపరీత్యం.వర్తమానంలో సంభవిస్తున్నప్రకృతి విపత్తుల్లో చాలా వరకు మానవ తప్పిదాలే కారణమవుతున్నాయి. వరదలు, భూకంపాలు,తుఫానులు, సునామీలు ఇత్యాదులన్నీ సహజ విపత్తులు. ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు నష్టం కలిగించి, విధ్వంసం చేసి, కోలుకోలేని విధంగా మానవజీవితాలను అతలాకుతలం చేసిన అనేక సంఘటనలు ఈ ప్రపంచంలో సంభవించాయి. అతివృష్టి వలన వరదలు సంభవించడం, ప్రజాజీవితాన్ని స్థంభింపచేయడం, అనావృష్టి వలన పంటలన్నీ ఎండిపోయి, ఆహారోత్పత్తి దెబ్బతినడం త్రాగడానికే నీరు లేక కటకటలాడడం మనం చూస్తున్నాం. వీటన్నింటినీ విపత్తులుగా పేర్కొనవచ్చు. జనజీవనానికి తీవ్ర విఘాతం కలిగించి, జీవనోపాధిని దెబ్బతీసి,ప్రాణాలకు, ప్రభుత్వ, ప్రజల ఆస్తులకు నష్టం కలిగించడంలో ప్రకృతి విపత్తుల పాత్ర అధికం. ప్రకృతి వైపరీత్యాల నుండి కోలుకుని, జనజీవనం సాధారణ స్థితికి రావడానికి సుదీర్ఘకాలం పడుతుంది. ఇలాంటి సందర్భాల్లో ప్రజాజీవనాన్ని పునరుద్ధరించడానికి ప్రభుత్వాల, జాతీయ, అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థల అవసరం ఎంతైనా ఉంది. మానవ జీవితాలను అతలాకుతలం చేసే ఇలాంటి ప్రమాదాలన్నీ సాధారణ స్థాయిని దాటి తీవ్రమైన స్థితికి చేరడం వలన విపరీతమైన ప్రాణనష్టం జరుగుతున్నది. ప్రకృతి వైపరీత్యాల్లో వాతావరణ పర్యావరణ,సంబంధమైన అంశాలు మిళితమై ఉన్నాయి. ప్రస్తుతం ఏర్పడుతున్న వైపరీత్యాల్లో మానవ ప్రేరిత వైపరీత్యాలదే సింహాభాగం. ఈ సంవత్సరం మయన్మార్, థాయ్‌లాండ్, వియత్నాం దేశాల్లో సంభవించిన భూకంపం దాటికి ఆకాశహర్మ్యాలు నేలమట్టమయ్యాయి. ఫిలిప్పీన్స్‌లో సంభవించిన భూకంపం విధ్వంసం సృష్టించింది. పాక్ వంటి దేశాల్లో వరదల కారణంగా అపారమైన ప్రాణ,ఆస్తి నష్టం సంభవించింది. కేరళలోని వయనాడ్ జిల్లాలో జరిగిన ప్రకృతి విధ్వంస ఫలితాలను మరువలేం.భారతదేశంలోని పలు రాష్ట్రాలు వరదల వలన




అస్తవ్యస్తంగా మారుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో బుడమేరు వరదలు ప్రజాజీవితాలను తీవ్రంగా ప్రభావితం చేసాయి. హైదరాబాద్ మహానగరంలో చినుకు పడితే చాలు రోడ్లన్నీ జలమయమై పోతున్నాయి. మానవ తప్పిదాలు మహోగ్ర రూపం ధరించి మహా ఉపద్రవాలకు కారణభూతమవుతున్నాయి. ప్రకృతిని పరిరక్షించకపోవడమే సకల అనర్థాలకు కారణం. ఈ భూప్రపంచంలో మానవమనుగడ కొనసాగించాలంటే పచ్చదనాన్ని పరిరక్షించుకోవాలి. స్వార్థ ప్రయోజనాల కోసం చెట్లను నరికే విధానం మారాలి. వృక్షజాతిని పెంపొందించాలి. మొక్కలనునాటే కార్యక్రమాన్ని దైవభక్తి, దేశభక్తితో ముడిపెట్టాలి. అప్పటివరకూ మొక్కలు నాటే కార్యక్రమం ఊపందుకోదు. చెట్లను పెంచడం వలన భూతాపం తగ్గుతుంది. వాయు కాలుష్యం తగ్గి మనం పీల్చే గాలిలో నాణ్యతాశాతం పెరుగుతుంది. అనారోగ్య సమస్యలు అరికట్టబడతాయి.వాతావరణం చక్కబడుతుంది. పచ్చని చెట్లను నరకడం వలన వాతావరణంలో సమతుల్యత దెబ్బతింటున్నది. మానవాళికి అవసరమైన ప్రాణవాయువు లభించడం లేదు. కాలుష్యం పెరిగి, ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తుతున్నాయి. మానవ మనుగడకు రక్షాకవచమైనఓజోన్ పొర దెబ్బతినడం వలన రేడియోధార్మికత వెలువడుతున్నది. దీనివలన అనేక విపత్కర పరిణామాలు సంభవిస్తున్నాయి.వాతావరణంలో అవాంఛనీయ పరిణామాలకు మనదే బాధ్యత. గ్లోబల్ వార్మింగ్ ఒక విషమ సమస్య. ఈ విషమ సమస్యకు విరుగుడు మనచేతుల్లోనే ఉంది. భారత దేశంలోని సముద్రతీర ప్రాంతాలు తరచూ తుఫానులకు గురౌతున్నాయి. నదులన్నీ పోటెత్తి వరదలు ముంచెత్తుతున్నాయి.ఉత్తరభారతంలో సంభవించిన విలయాలను విస్మరించలేం.ఆంధ్రప్రదేశ్‌లో గతంలో సంభవించిన కోనసీమ తుఫాను సృష్టించిన బీభత్సాన్ని, 1977 వ సంవత్సరంలో దివిసీమ ఉప్పెన సంఘటన దుష్పలితాలను,ఉత్తర కోస్తాలో సంభవించిన హుద్‌హుద్ తుఫాన్ విలయాన్ని,టిట్లీతుఫాను సృష్టించిన భయానక సంఘటనలను తలచుకుంటే గగ్గుర్పాటు కలుగకమానదు.కోస్తా తీరప్రాంతం తరచూ తుఫాను కోరల్లో చిక్కుకుని,ప్రళయగర్జన చేస్తున్నది.అపారమైన ప్రాణ నష్టం, ఆస్తినష్టం సంభవిస్తున్నది. వరదల కారణంగా చేతికొచ్చిన పంటలన్నీ సర్వానాశనమౌతున్నాయి.ప్రజలఆస్తులకు, ప్రాణాలకు విపరీతమైన నష్టం వాటిల్లడం తరచూ జరుగుతున్న ప్రకృతి ప్రకోప సంఘటనల పర్యవసానమే.ఇక భూకంపాలు కూడా విపత్తే ప్రపంచంలోనూ, మన దేశంలోను సంభవించిన పలు భూకంపాలు విపరీతమైన నష్టం కలుగచేయడం విదితమే. గతంలో జరిగిన భూకంపాల వలన చిలీ వంటి దేశం చిగురుటాకులా వణికిపోయింది. జపాన్‌లో తరచూ సంభవించే భూకంపాల గురించి ప్రత్యేకంగా పేర్కొనవలసిన అవసరం లేదు. ఇరాన్,ఇరాక్‌లలోనూ, మరికొన్ని దేశాల్లోను గతంలో ఎన్నోభూకంప ప్రళయాలు సంభవించాయి. మన దేశంలో మహారాష్ట్రలోని లాతూర్ భూకంప విలయాన్ని మరచిపోలేము. భూకంపాలు సంభవించడంలో కూడా మానవ తప్పిదాలు చోటు చేసుకుంటున్నాయి. రిజర్వాయర్ల నిర్మాణం, నీటి ప్రాజెక్టులు,క్వారీలు,లోతైన బోరు బావులు భూకంపాలకు కారణమౌతున్నాయి. అసాధారణ రీతిలో సాగుతున్న భూగర్భ సంపద వెలికితీత ప్రక్రియ భూకంపాలకు కారణభూతమౌతున్నాయి.ప్రకృతి, పర్యావరణ, వాతావరణ సంబంధిత విపత్తుల్లోను, మానవ వైఫల్యాలవలన జరుగుతున్న విపత్తుల్లోను అపారమైన ప్రాణ నష్టం జరగడం బాధాకరం.శాస్త్ర,సాంకేతిక రంగాల్లో సాధించిన ప్రగతి మానవ సుఖజీవనానికి వినియోగపడడం శుభదాయకమే అయినప్పటికీ,మానవ విజ్ఞానం వెర్రితలలు వేసి, అసలుకే ఎసరు పెడుతున్నది.విపత్తులకు మూలకారణమౌతున్నది. మానవ స్వార్థ ప్రయోజనాల ఫలితంగా ఏర్పడుతున్న విపత్తులను అరికట్టడం కొంతవరకు మన చేతుల్లోనే ఉంది. అలాగే ప్రకృతి సంబంధిత విపత్తుల వలన జరిగే ప్రాణ,ఆస్తినష్టాలను కనీస స్థాయికి తగ్గించడం కూడా సుసాధ్యమే. ఇందుకు ప్రభుత్వాలు,ప్రజలు కంకణబద్ధులుకావాలి. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ కూడా ఇదేవిధమైన ఆలోచనలతో ప్రజలను జాగృతం చేయాలని భావించి 2009 వ సంవత్సరంలో ఒక తీర్మానంచేసింది. అంతర్జాతీయ విపత్తుల తీవ్రతను తగ్గించేందుకు ప్రజల ప్రేరణతో ఒక ఉద్యమంగా మలచడానికి ప్రతీఏటా అక్టోబర్ 13వ తేదీన నిర్వహించే 'ఇంటర్నేషనల్ డిజాస్టర్ రిస్క్‌రిడక్షన్ డే'ఒక అవగాహనా కార్యక్రమం.ఎన్నిసంస్థలు ఎన్నివిధాలుగా కృషిచేసినా, ప్రజాచైతన్యం, ప్రజాభాగస్వామ్యం లేనిదే ఏ ప్రయత్నమైనా నిర్వీర్యం కాక తప్పదు.కాబట్టి లోకకల్యాణార్థం చేపట్టే కార్యక్రమాలకు,సంకల్పానికి వికల్పం కలగకుండా చూడవలసిన బాధ్యత ప్రజలపైన,ప్రభుత్వాలపైన ఎంతైనాఉంది. ●

# హింసాత్మక ధోరణులతో పెరుగుతున్న అశాంతి

దాడిశెట్టి శ్యామ్ కుమార్

ప్రపంచంలో మానవజాతిని కలవరపెడుతున్న హింసాత్మక సంఘటనలు దేశాల మధ్య అంతర్గత యుద్ధాల వలన కోలుకోలేకపోతున్న సామాన్య జనాల గోడు పట్టించుకునే నాథుడు లేనిపరిస్థితి. కానీ కొందరు శాంతి కాముకులమని చెప్పుకుంటునే యుద్ధాలకు ఊపిరినందిస్తున్న కొన్ని అగ్రదేశాల కుటిల నీతి యుద్ధ ఆంక్షలతో,భిన్న వైఖరులు అంతర్గత ఆలోచనలో మతోన్మాదమే ప్రధాన లక్ష్యంగా హింసాత్మక వైఖరితో కొన్ని దేశాలు పరస్పర దాడులకు ఒడిగడుతున్న సందర్భాల్లో ప్రమాద అంచున దిక్కుతోచని మానవ జీవన ప్రయాణాలు యుద్ధబీజాలతో అణు ఆయుధాల బెదిరింపుల భయంతో బీతిల్లిపోతున్న సామాన్య జనాలు పుట్టి పెరిగిన ప్రదేశాలను వదిలి బ్రతుకు జీవుడా అని సుదూర ప్రాంతాలకు తరలివెళ్తున్న సందర్భాలు ప్రపంచవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో గోచరిస్తూనే ఉన్నాయి. నిజంగా పరస్పర సామరస్యంతో సంభాషణలకు వేదికగా సమస్య సాధనకు పరిష్కరించుకునే శైలి నేటి ఆధునిక జీవన విధానాల్లో సులభతరమైనప్పటికీ కొన్ని దేశాలు అత్యాధునిక ఆయుధాల సంపత్తి ముసుగులో ఆధిపత్యం కోసం మధ్యవర్తిత్వం నెపంతో నిరంతర దేశాల మధ్య యుద్ధ ప్రమాదాలకు కారణం అవుతున్నయేమో అనిపిస్తుంది. ప్రపంచంలోని ఏమతం కూడా మతోన్మాదానికి వత్తాసు పలుకదు.మానవుల మధ్య భిన్నాభిప్రాయాలున్నప్పటికీ మతాల మధ్య శాంతియుత అవగాహన ఆలోచన విధానాలు కలిగిన ఏకరూపసారూప్యత ఉందని గ్రహించాలి. అయితే మతాల సారం మానవ జాతి మనుగడే అని తెలిసినా కొన్ని దేశాల మధ్య జరుగుతున్న దురాక్రమణ ధోరణి గమనిస్తే మానవుని ఆలోచన, మేధస్సు కుంచితత్వంతో కుదించకపోతుందా అనిపిస్తుంది. ఆధునికత సంతరించుకుంటున్న నేటి ప్రపంచంలోని మానవ జీవన విధానాల్లో అక్షరాస్యత క్రమం అభివృద్ధి చెందుతున్న దశలో ఆధునిక పోకడలతో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అవసరాలకు అనుగుణమైన రీతిలో ఉపయోగించుకునే విధానాన్ని సులభతరం చేసుకుంటున్నటువంటి నాగరిక ప్రపంచంలో శాంతియుత జీవనవిధానాలకు విఘాతం కలిగించే యుద్ధ వాతావరణాన్ని కొందరు ఆకాంక్షించడం పర్యవసానంగా సామాన్య జీవనవిధానాలపై ప్రభావం చూపిస్తున్నాయి. ప్రధానంగా నేటి ఆధునిక పౌర సమాజం ఎదుగుతున్న క్రమంలో అవసరమైన మానవీయ విలువలతో కూడిన ఆలోచన విధానాలను ప్రతిబింబించేలా సమాజంలో మెరుగైన మానవ సంబంధాలు మంచి దృక్పథాలను కలిగే విధంగా ఆలోచన స్థాయిని మెరుగుపరిచేందుకు భావి తరానికి ఉన్నతమైన విలువలను నేర్పించే బాధ్యతను అనుభవజ్ఞులైన బోధకులు అభ్యాసకులకు అలవర్చినట్లయితే విచక్షణ కలిగిన ఆలోచనావిధానంతో నైతిక విలువలతో కూడిన మానవ సమాజం ముందుకు పురోగమిస్తుంది. మానవ జీవన విధానాల్లో బాల్యదశ నుండి సరైన నిర్దేశకత లేక మానవీయ కోణంలో ఆలోచించే ధోరణి తగ్గిపోవడం కనికరం లేని కఠినత్వపు హింసాత్మక సంఘటనలు సమాజంలో ఎక్కువ అవుతుండటం మానవజాతిని కలవర పెడుతున్నాయి. అనాలోచిత దుశ్చర్యలు మానవీయ సంబంధాల మధ్య పెరుగుతున్న అగాధం మంచులా కరిగిపోతున్న ఆత్మీయతలు,హింస ప్రవృత్తి కలిగిన ఉగ్రవాదం,అంతర్గతంగా దేశభద్రతకు విఘాతం కలిగించే స్వార్థపూరిత దేశద్రోహులు ఇలా చెప్పుకుంటూ పోతే హింసాత్మక సంఘటనలకు పాల్పడుతున్నకొందరి మనస్తత్వాలు దయా,జాలి,కరుణ లేక విద్రోహులుగా మారి జాతీయ సమైక్యతవాదాన్ని మరిచి క్షమించరాని దోషులుగా మిగిలిపోతున్నారు.గత కాలంలో కరోనా వైరస్ విజృంభించిన తరుణంలో మానవ జాతి మొత్తం వణికిపోయి ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని బతుకు జీవుడా అని జీవితాలను వెల్లదీసిన నాటి జ్ఞాపకాలు మదిలో నుండి చెరిగిపోక మునుపే ప్రపంచంలో మతవిద్వేషాలతో దేశాల ఆధిపత్య ధోరణితో హింసాత్మక సంఘటనలతో యుద్ధాల వల్ల వణికిపోతున్న సామాన్య జనాలు చేసిన నేరం ఏమిటో అర్థంకాని పరిస్థితులు ఒకవైపు, మానవ మేధస్సు ఆలోచనలో మితిమీరిన విద్వేషాల పరంపర కరోనా వైరస్ కంటే భయంకరంగా ఉన్నాయానే సందేహాలు మరోవైపు.ఈక్రమంలోశాంతియుత మార్గాన్నిఎన్నుకునేఆలోచనలను ప్రతి బింబించేందుకు మానవమేధస్సు మరింత పరిణితి చెందాలి. ●

# మాదకద్రవ్యాల నిషేధం సమాజ బాధ్యత!



మేకిరి దామోదం

విచక్షణాజ్ఞానం గల మనిషిని మాదకద్రవ్యాలు మృగంగా మార్చేస్తూ, ప్రజా ఆరోగ్యానికి, శాంతి భద్రతలకు ప్రథమ శత్రువులుగా పరిణమించాయి.గంజాయి, హెరాయిన్, కొకైన్, మెఫీడ్రిన్ వంటి పదార్థాలు నిత్యం ఎక్కడో ఒకచోట పట్టుబడుతూనే ఉన్నా, అదే సమయంలో ఎన్నో రెట్లు ఎక్కువ పరిమాణంలో మత్తు పదార్థాలు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరి వినియోగదారుల కోరికలు తీర్చేస్తున్నాయి. విదేశాల నుంచి భారత్‌లోకి చోరబాట్ల ద్వారా ప్రవేశిస్తున్న ఈ మత్తు పదార్థాలకు తోడు, స్థానిక పరిశ్రమల్లో గుట్టు చప్పుడు కాకుండా జరుగుతున్న డ్రగ్ తయారీ దందాలు దేశ భవిష్యత్తుకు తీవ్రమైన ముప్పుగా మారాయి. ఇటీవల హైదరాబాద్‌లోని చర్లపల్లి ప్రాంతంలో పోలీసుల దాడిలో కోట్ల రూపాయల విలువైన మెఫీడ్రిన్ మత్తుమందు, ముడిసరుకులు స్వాధీనం కావడం ఈ వ్యవస్థీకృత నేరాల విస్తృతిని సూచిస్తోంది. గుజరాత్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో కూడా ఇలాగే రూ.230కోట్ల విలువైన డ్రగ్స్ఉత్పత్తి సామగ్రి పట్టుబడింది. ఇవన్నీ ప్రాణాధార ఔషధాల ముసుగులో జరుగుతున్న నేర కార్యకలాపాలు. వీటిని సమూలంగా అరికట్టకపోతే దేశాన్ని అనారోగ్యం, అల్లకల్లోలం వైపు నెడతాయి. పాఠశాలల నుండి విశ్వవిద్యాలయాల వరకు, వృత్తి,సాంకేతిక విద్యాలయాల వరకు మత్తుమందుల ప్రభావం విస్తరిస్తోంది. యువతలో ఒత్తిడి తగ్గించుకోవడం పేరుతో లేదా స్నేహితుల ప్రోత్సాహంతో డ్రగ్స్‌వైపు అడుగులు వేస్తున్నారు. ఉన్నత విద్యావంతులు, డాక్టర్లు, ఇంజినీర్లు సైతం ఈ మాదక రక్కసి కబంధహస్తాల్లో చిక్కి విలవిల్లాడుతున్నారు. మత్తు అలవాటుతో మానసిక స్థైర్యం కోల్పోయి నేరాలకు పాల్పడడం, ఆత్మహత్యలు చేసుకోవడం వంటి ఘటనలు పెరుగుతున్నాయి. డ్రగ్స్ ట్రీట్మెంట్ క్లినిక్‌లకు వెళ్ళే వారిసంఖ్య ఐదేళ్లలో 1300 శాతం పెరిగిందని గణాంకాలు చెబుతున్నాయి.ఇండోర్, ముంబై, చెన్నై, లఖ్‌నౌవంటి నగరాల్లో ఈ మహమ్మారి విస్తరిస్తూ ఉంది. మన రాష్ట్రంలోనే మత్తు మార్కెట్ విలువ దాదాపు1000 కోట్లకు పైగా ఉందని అధికారులు చెబుతున్నారు. పట్టుబడుతున్న మత్తు మందులు మొత్తం వ్యాపారంలో 10శాతానికి కూడా చేరవు. స్థానికంగా ఉత్పత్తి అవుతున్న గంజాయి,లాటిన్ అమెరికా నుంచి వచ్చే హెరాయిన్, అలాగే ఔషధ కర్మాగారాల రూపంలో తయారవుతున్న రసాయన డ్రగ్స్ మార్కెట్లో సులభంగా లభ్యమవుతున్నాయి. ప్రస్తుతం 44కు పైగా రకాల మత్తు పదార్థాలు వినియోగంలో ఉన్నాయని అధికారుల అంచనా. ఇటీవల మహారాష్ట్ర పోలీసులు చర్లపల్లి పారిశ్రామికవాడలో రూ.12కోట్ల విలువైన మత్తు మందులు స్వాధీనం చేసుకోవడం, గత ఏడాది రూ.139 కోట్లు, ఈ ఏడాది జూలైవరకు రూ.68కోట్ల విలువైన డ్రగ్స్ ఈగల్‌అధికారులు పట్టుకోవడం పరిస్థితి తీవ్రతను తెలియ జేస్తున్నాయి. పట్టణాలు, నగరాల ప్రతిమూలలో గంజాయి మత్తులో తేలుతున్న యువతను చూడడం ఇప్పుడు సాధారణదృశ్యమైంది. హైదరాబాద్‌లో ఖరీదైన హెరాయిన్, కొకైన్‌డ్రగ్స్‌తో పార్టీలు నిర్వహించడం ఫ్యాషన్‌గా మారింది. ముఠాలు మొదట ఉచితంగా సరఫరాచేసి, తరువాత ఆ వ్యక్తులను అమ్మకందారులుగా మార్చే వ్యూహం అవలంబిస్తున్నాయి.ఈ వ్యాపారం వ్యవస్థీకృతంగా సాగుతోంది. ప్రభుత్వం దీని కట్టడికి చర్యలు ప్రారంభించినా, అధికారుల కన్నుగప్పి వ్యాపారం విస్తరిస్తూనే ఉంది.2023లో ఈగల్ అధికారులు 104.75 గ్రాముల కొకైన్‌స్వాధీనం చేసుకోగా,2024లో అది336.56 గ్రాములుగా పెరిగింది. అలానే హెరాయిన్ విషయంలో కూడా ఇదే ధోరణి 2023లో 419 గ్రాములు, 2024లో 2,160.67 గ్రాములు పట్టుబడ్డాయి. నిన్నటికి నిన్న హైదరాబాదులో నిషేధిత ఎఫి డ్రీన్ మత్తు పదార్థాన్ని భారీగా తయారు చేసి విక్రయించేందుకు సిద్ధమైన ముఠాగుట్టు రట్టు చేసినది తెలంగాణ ఈగల్ (ఎలిటీ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) పట్టుకుంది. 220 కిలోల ఎఫీడ్రిన్ స్వాధీనం చేసుకున్నదీని విలువ రూ.72కోట్ల విలువ అంతర్జాతీయ మార్కెట్లో ఉంటుందంటున్నారు.ఈ పరిస్థితులు, గణాంకాలు భయంకర దిశను చూపుతున్నాయి. ఇలా ఊడలు దిగిన డ్రగ్స్‌విష వ్యాపారాన్ని నిర్మూలించాలంటే?కేంద్రం అన్ని రాష్ట్రాలు కలిసికట్టుగా పనిచేయాలి.దీనికి సంబంధించిన ముడిసరుకులు ఎక్కడినుంచి వస్తున్నాయి, ఏ ప్రాంతాల్లో మత్తుమందులను ఎలా తరలిస్తున్నారు అనే అంశాలపై లోతుగా ఆరాతీయాలి. ఆ రవాణా వ్యవస్థను పూర్తిగా విచ్ఛిన్నం చేయాలి. దేశవ్యాప్తంగా అన్నిపారిశ్రామిక ల్యాబ్ల కార్యకలాపాలపై ఎప్పటికప్పుడు గమనిస్తుండాలి. డ్రగ్స్ కేసులను పగడ్బందీగా దర్యాప్తుచేసేలా సిబ్బందికి తగిన శిక్షణ అందించాలి. దీని వెనుక అసలు సూత్రధారులను కటకటాల్లోకి నెట్టడం అత్యవసరం.వారికి వెంటనే కఠిన శిక్షలు పడాలంటే డ్రగ్స్ కేసుల విచారణ ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలి.నిర్లక్ష్యం వహిస్తే భావితరం ఇంకా బలహీనమై జాతి భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతోంది.ప్రభుత్వం కఠినచట్టాలతో పాటు పునరావాస కేంద్రాల ద్వారా మత్తుకు బానిసలైనవారికి సహాయంచేయాలి. ప్రతిపౌరుడు ఈ సమస్యపై బాధ్యతగాస్పందిస్తేనే రేపటితరాన్ని రక్షించగలం. ●



# అమెరికా బెదరింపులకు భయపడం

## ప్రతీకార చర్యలకు వెనుకాడబోం

## ట్రంప్‌కు చైనా తీవ్ర హెచ్చరిక




**బీజింగ్, అక్టోబరు 12:** అగ్రరాజ్యం అమెరికా, చైనా మధ్య వాణిజ్య యుద్ధం తారస్థాయికి చేరింది. చైనా నుంచి వచ్చే అన్ని దిగుమతులపై 100 శాతం సుంకాలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. దీనిపై చైనా తీవ్రంగా స్పందించింది. అమెరికా ఏకపక్షంగా ద్వంద్వ ప్రమాణాలకు పాల్పడుతోందని ఆరోపిస్తూ, తాము ప్రతీకార చర్యలకు వెనుకాడబోమని గట్టిగా హెచ్చరించింది. నవంబర్ 1 నుంచి చైనా నుంచి దిగుమతయ్యే అన్నివస్తువులపై ప్రస్తుతం ఉన్న పన్నులకు అదనంగా 100శాతం సుంకం అమల్లోకి వస్తుందనితెలిపారు. అంతేకాకుండా, అమెరికాలో తయారైన కీలకమైన సాఫ్ట్‌వేర్ల ఎగుమతులపై కూడా కఠినమైన నియంత్రణలు విధిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. చైనా వాణిజ్యపరంగా అత్యంత దూకుడుగా వ్యవహరిస్తోందని, దానికి తగిన బదులు ఇవ్వాల్సిన సమయం వచ్చిందని ట్రంప్ వ్యాఖ్యానించారు.

ట్రంప్ నిర్ణయంపై చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ ఆదివారం ఘాటుగా స్పందించింది. అమెరికా చర్యలు తమ దేశ ప్రయోజనాలకు తీవ్ర నష్టం కలిగిస్తాయని, ఇరుదేశాల మధ్య వాణిజ్య చర్చల వాతావరణాన్ని పూర్తిగా దెబ్బతీస్తాయని పేర్కొంది. మేము యుద్ధాన్ని కోరుకోవడంలేదు, కానీ పోరాడటానికి భయపడం అని ఆ ప్రకటనలో స్పష్టం చేసింది. అమెరికా తన వైఖరిని మార్చుకోకపోతే తమ చట్టబద్ధమైన హక్కులు, ప్రయోజనాలను కాపాడుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. దీనిలో భాగంగా అమెరికాకు చెందిన నౌకలపై ప్రత్యేక పోర్టు ఫీజులు విధించనున్నట్లు తెలిపింది. ప్రపంచ టెక్నాలజీ పరిశ్రమకు కీలకమైన రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ఎగుమతులను చైనా కఠినతరం చేసింది. దీనికి ప్రతిస్పందనగానే ట్రంప్ ఈ భారీ సుంకాలను ప్రకటించారు. ఈ వాణిజ్య పోరు కారణంగా ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వాహనాల వంటి రంగాలు తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మరో వైపు, కొద్దివారాల్లో దక్షిణ కొరియాలో ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ల మధ్య జరగాల్సిన సమావేశం కూడా ఈ పరిణా మాలతో రద్దయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

# ప్రధాని మోడీకి ట్రంప్ ఫోన్

## ఈజిప్టు అధ్యక్షుడు అబ్దేల్ ఫత్తా అల్‌సిసి కూడా

## గాజా శాంతి ఒప్పందానికి రావాలంటూ ఆహ్వానం

## భారత్ తరపున విదేశాంగ సహాయ మంత్రి కీర్తి వర్దన్ హాజరు



**న్యూఢిల్లీ, అక్టోబరు 12:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫోన్ చేశాడు. సోమవారంనాడు ఈజిప్టులో జరుగనున్న గాజా శాంతి ఒప్పందం కార్యక్రమానికి రావాలంటూ ఆహ్వానించారు. ట్రంప్‌తోపాటు ఈజిప్టు అధ్యక్షుడు అబ్దేల్ ఫత్తా అల్‌సిసి కూడా మోడీకి ఫోన్ చేసి ఆహ్వానించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. భారత్ తరఫున ప్రధాన మంత్రి నరేంద్రమోడీకి బదులుగా, కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్దన్ హాజరుకానున్నారు. ఈజిప్టు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, సోమవారం మధ్యాహ్నం షర్మ్ ఎల్ షేక్‌లో గాజా శాంతి ఒప్పందం జరగనుంది. గాజా యుద్ధాన్ని ముగించి, శాంతి, స్థిరత్వాన్ని నెలకొల్పడమే లక్ష్యంగా ఈ శిఖరాగ్ర సమావేశం జరగనుంది.

ఈజిప్టు అధ్యక్షుడు అబ్దేల్ ఫతా అల్‌సిసి, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అధ్యక్షతన జరగనున్న ఈ కార్యక్రమంలో ప్రపంచ దేశాల నేతలు కూడా పాల్గొననున్నారు. ముఖ్యంగా ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ సహా 20కి పైగా దేశాల నాయకులు హాజరయ్యే అవకాశం ఉందని సమాచారం. అయితే ఇందులో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ పాల్గొంటారా? లేదా? అనేది ఇంకా తెలియరాలేదు.


# ఇకపై విద్యాసంస్థల్లో ఫీజులూ డిజిటల్ చెల్లింపులే..

## రాష్ట్రాలకు లేఖలు రాస్తున్న కేంద్రం

**న్యూఢిల్లీ, అక్టోబరు 12:** దేశవ్యాప్తంగా డిజిటల్ లావాదేవీలు విస్తరిస్తున్న నేపథ్యంలో విద్యారంగాన్ని కూడా అదే దిశగా తీసుకెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పాఠశాలల్లో ఫీజుల చెల్లింపులను పూర్తిగా డిజిటల్ విధానంలో స్వీకరించేలా చర్యలు చేపట్టాలని కేంద్ర విద్యాశాఖ తాజాగా రాష్ట్ర ప్రభుత్వాలు, జాతీయ విద్యా సంస్థలను ఆదేశించింది. డిజిటల్ లావాదేవీల విస్తరణ యూపీఐ, నెట్ బ్యాంకింగ్, క్రెడిట్/డెబిట్ కార్డు వంటి డిజిటల్ చెల్లింపు పద్ధతులు ప్రస్తుతం దేశవ్యాప్తంగా విస్తృతంగా ఉపయోగంలో ఉన్నాయి. చిన్న కొనుగోళ్ల నుంచి పెద్ద వ్యాపారాల వరకు డిజిటల్ పేమెంట్ వ్యవస్థ సాధారణమైంది. ఈ నేపథ్యంలో పాఠశాలల్లో కూడా ఫీజులు, అడ్మిషన్ రుసుములు, పరీక్ష ఫీజులు వంటి చెల్లింపులు యూపీఐ ద్వారా స్వీకరించేలా ప్రోత్సాహక చర్యలు తీసుకోవాలని కేంద్ర విద్యాశాఖ సూచించింది. ఎన్‌సీఈఆర్‌టీ, సీబీఎస్‌ఈ, కేవీఎస్, ఎన్‌వీఎస్‌లకు ఆదేశాలు జారీ అయ్యాయి. రాష్ట్ర పాఠశాలలకే కాకుండా, కేంద్రానికి చెందిన జాతీయ విద్యా సంస్థలకు కూడా ఇదే సూచనలు వర్తిస్తాయని విద్యాశాఖ స్పష్టం చేసింది. జాతీయ విద్యా పరిశోధన మండలి, సీబీఎస్‌ఈ, కేంద్రీయ విద్యాలయ సంఘటన్, నవోదయ విద్యాలయ సమితిలకు లేఖలు పంపి, తమ పరిధిలోని పాఠశాలల్లో డిజిటల్ చెల్లింపు మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. నగదు నుంచి డిజిటల్ వైపు పారదర్శకత, సౌలభ్య అని ఈ నిర్ణయం వల్ల తల్లిదండ్రులు ఇంటి నుంచే సులభంగా ఫీజులు చెల్లించగలరని, పాఠశాలల వద్ద క్యూలు తగ్గుతాయని విద్యాశాఖ తెలిపింది. అదనంగా, ప్రతి లావాదేవీకి డిజిటల్ రసీదు లభించడం వల్ల పారదర్శకత పెరుగుతుందని, అకౌంటింగ్ వ్యవస్థ మరింత సులభతరం అవుతుందని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన "డిజిటల్ భారత్" కార్యక్రమంలో విద్యా రంగం కీలక పాత్ర పోషించగలదని అధికారులు పేర్కొన్నారు. చిన్నప్పటి నుంచే విద్యార్థులు, తల్లిదండ్రులు డిజిటల్ లావాదేవీలకు అలవాటు పడడం వల్ల ఆర్థిక అక్షరాస్యత పెరిగే అవకాశం ఉందన్నారు. విద్యా సంస్థల్లో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ ప్రవేశపెట్టడం ద్వారా ఆర్థిక నిర్వహణ మరింత సమర్థవంతంగా మారనుందని, నగదు ఆధారిత వ్యవస్థలలో ఉండేఅస్పష్టతలు తగ్గుతాయని విద్యాశాఖ విశ్వాసం వ్యక్తంచేసింది. డిజిటల్ పద్ధతుల్లో ఫీజుల చెల్లింపులు అమలులోకి రావడం ద్వారా విద్యా రంగం ఆధునీకరణ దిశగా మరో కీలక మైలురాయిని చేరుకున్నట్లు భావిస్తున్నారు.

# పడిపోతున్న జననాల రేటు..

## వరుసగా మూడోసారి తగ్గిన జననాల నమోదు



**న్యూఢిల్లీ, అక్టోబరు 12:** దేశంలో జననాల నమోదు గణనీయంగా తగ్గుముఖం పడుతోంది. 2022 సంవత్సరంతో పోలిస్తే 2023లో రెండు లక్షలకు పైగా జననాలు తక్కువగా నమోదయ్యాయి. గత ఐదేళ్ల కాలంలో జననాల నమోదు తగ్గడం ఇది మూడోసారి కావడం గమనార్హం. ఇదే సమయంలో మరణాల నమోదులో స్వల్ప పెరుగుదల కనిపించింది. కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలోని రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (ఆర్‌జీఐ) విడుదల చేసిన సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (సీఆర్‌ఎస్) 2023 నివేదికలో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. ఈ నివేదిక ప్రకారం 2023లో దేశవ్యాప్తంగా 2.52 కోట్ల జననాలు నమోదయ్యాయి. ఇది 2022లో నమోదైన జననాలతో పోలిస్తే 2,32,094 (0.9 శాతం) తక్కువ. దేశంలో సంతానోత్పత్తి రేటు తగ్గుతోందనడానికి ఇది ఒక సంకేతంగా నిపుణులు భావిస్తున్నారు. మరో వైపు, 2023లో మొత్తం 87 లక్షల మరణాలు నమోదయ్యాయి. 2022తో పోలిస్తే ఇది కేవలం 9,749 (0.1 శాతం) ఎక్కువ కావడంతో, మరణాల సంఖ్య దాదాపు స్థిరంగా ఉన్నట్లేనని నివేదిక స్పష్టం చేసింది. ఈ నివేదికలో మరి కొన్ని ఆందోళనకరమైన అంశాలు కూడా ఉన్నాయి. దేశంలో ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో జరిగే ప్రసవాల శాతం క్రమంగా తగ్గుతోంది. 2022లో ఇది 75.5 శాతంగా ఉండగా, 2023 నాటికి 74.7 శాతానికి పడిపోయింది. కరోనా మహమ్మారికి ముందు ఇది 80 శాతానికి పైగా ఉండేది. అలాగే, సరైన సమయంలో వైద్య సహాయం అందక ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య కూడా పెరుగుతోంది. 2022లో ఇలాంటి మరణాలు 50.7 శాతంగా నమోదు కాగా, 2023లో ఆ సంఖ్య 53.4 శాతానికి పెరిగింది. కరోనాకు ముందు ఈ తరహా మరణాలు 40 శాతం లోపే ఉండటం గమనార్హం. ఈ గణాంకాలు దేశ ఆరోగ్య వ్యవస్థ పనితీరుపై కొత్త చర్చకు దారితీస్తున్నాయి.

# లక్నోలో బాలికపై సామూహిక లైంగికదాడి

**లక్నో, అక్టోబరు 12:** ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో దారుణ ఘటన చోటుచేసుకుంది. 16 ఏళ్ల బాలికపై ఐదుగురు దుండగులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ కేసులో పోలీసులు వేగంగా స్పందించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. ఒకరిని ఎన్‌కౌంటర్ చేసి మరీ అదుపులోకి తీసుకున్నారు. బాధితురాలు శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో తన సోదరి ఇంటికి వెళ్లేందుకు ఒక పరిచయస్తుడితో కలిసి మోటార్‌సైకిల్‌పై బయలు దేరింది. మార్గమధ్యలో బంత్రా ప్రాంతంలోని ఓ పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న మామిడి తోట వద్ద వారు ఆగారు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న ఐదుగురు వ్యక్తులు, బాలికతో ఉన్న వ్యక్తిని చితకబాది, ఆమెపై అత్యాచారానికి ఒడిగట్టారు. ఈ ఘటనపై బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుల కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. ఈ క్రమంలో గత రాత్రి హరౌనీ రైల్వే స్టేషన్ సమీపంలో తనిఖీలు చేస్తుండగా, బైక్‌పై వస్తున్న ఇద్దరు అనుమానితులను ఆపేందుకు పోలీసులు ప్రయత్నించారు. ఈ క్రమంలో వారు పోలీసులపై కాల్పులు జరిపారు. ఆత్మరక్షణ కోసం పోలీసులు జరిపిన ఎదురు కాల్పుల్లో ఒక నిందితుడి కాలికి బుల్లెట్ తగిలింది. గాయపడిన నిందితుడిని లలిత్ కశ్యప్‌గా గుర్తించామని, అతడిని ఆసుపత్రికి తరలించామని డీసీపీ నిపుణ్ అగర్వాల్ తెలిపారు.

# హిందూమైనార్టీలపై దాడులు అంతా ఫేక్ న్యూస్: మహ్మద్ యూనస్



**ఢాకా, అక్టోబరు 12:** బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలపై హింస జరుగుతోందంటూ వస్తున్న వార్తలను ఆ దేశ ప్రధాన సలహాదారు మహమ్మద్ యూనస్ తీవ్రంగా ఖండించారు. ఇదంతా భారత్ నుంచి ఉద్దేశపూర్వకంగా వ్యాప్తి చేస్తున్న ఫేక్ న్యూస్ అని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. గత వారం అమెరికన్ జర్నలిస్ట్ మెహదీ హాసన్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆయన ఈవ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం భారత్‌లో ఫేక్ న్యూస్ ఒక ప్రత్యేకతగా మారిపోయింది. అక్కడి నుంచి తప్పుడు వార్తలు వెల్లువెత్తుతున్నాయని యూనస్ ఆరోపించారు. దేశంలో జరుగుతున్న కొన్ని సంఘటనలను మతపరమైనవిగా చిత్రీకరిస్తున్నారని, అవి కేవలం భూవివాదాలు వంటి స్థానిక సమస్యల కారణంగా పొరుగువారి మధ్య జరిగే సాధారణ గొడవలు మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో భారత్ నిరంతరం ఒత్తిడి తెస్తున్నందున తమ ప్రభుత్వం చాలా అప్రమత్తంగా ఉందని ఆయన పేర్కొన్నారు.



# రెండో పెళ్లికి అంగీకరించలేదని భార్యకు నిప్పంటించిన భర్త

**పాట్నా, అక్టోబరు 12:** ప్రియురాలితో పెళ్లికి నో చెప్పిందని తన రెండో భార్యకు భర్త నిప్పంటించాడు. ఈ దారుణ ఘటన బీహార్‌లోని నలంద జిల్లాలో వెలుగు చూసింది. వికాస్ కుమార్ ఐదేండ్ల క్రితం సునీత దేవి(25)ని వివాహం చేసుకున్నాడు. అతనికి అప్పటికే పెళ్లి అయినట్లు సునీతను వివాహమాడిన తర్వాత ఆమె తల్లిదండ్రులకు తెలిసింది. మొదటి భార్యకు విడాకులు ఇవ్వకుండానే సునీతను పెళ్లాడినట్లు తెలిసింది. దీంతో సునీత తల్లిదండ్రులు వికాస్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తానికి అతని కుటుంబ సభ్యులు నచ్చజెప్పడంతో సునీత తల్లిదండ్రులు శాంతించారు. కొన్నాళ్లకు సునీత, వికాస్ దంపతులకు ఇద్దరు పిల్లలు జన్మించారు. కానీ పుట్టిన వెంటనే ఆ పిల్లలిద్దరూ చనిపోయారు. ఇక అప్పట్నుంచి కుమార్ సునీతను వేధింపులకు గురి చేస్తున్నాడు. తాను తన ప్రియురాలిని పెళ్లి చేసుకుంటానని, అంగీకరించాలని భార్యను వేధిస్తున్నాడు. ఇందుకు సునీత ఒప్పుకోలేదు. ఈ క్రమంలో ఆమెపై పగ పెంచుకున్న భర్త చంపాలని నిర్ణయించుకున్నాడు. ఆమెను ఓ గదిలో బంధించి పెట్రోల్ పోశాడు. ఆ తర్వాత సిలిండర్‌ను లీక్ చేసి నిప్పంటించాడు. పెట్రోల్ పోసి గదిని మూసిన వెంటనే సునీత తన తల్లిదండ్రులకు ఫోన్ చేసి వికాస్ దారుణాలను వివరించి, తనకు నిప్పంటిస్తున్నట్లు తెలిపింది. అప్రమత్తమైన తల్లిదండ్రులు వికాస్ ఇంటికి చేరుకునేలోగా ఆమె ప్రాణాలు కోల్పోయింది. దహన సంస్కారాలు కూడా చేసే పనిలో వికాస్ కుటుంబ సభ్యులు నిమగ్నమయ్యారు. అయితే సునీత కుటుంబ సభ్యులను చూసి వికాస్‌తో పాటు అతని కుటుంబ సభ్యులు పరారీ అయ్యారు. మృతురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఫోరెన్సిక్ బృందాలు నమూనాలను సేకరించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

# రాత్రివేళల్లో బాలికలను బయటికి వెళ్లనీయొద్దు

## విద్యార్థినుల భద్రత ఆయా వైద్యకళాశాలలదే

## అయినా చర్యలుచేపట్టాం, ముగ్గురిని అరెస్టు చేసాం...

## మరింతగా దర్యాప్తు జరుగుతోంది: సిఎం మమతా బెనర్జీ



**కోల్‌కత్తా, అక్టోబరు 12:** పశ్చిమ బెంగాల్‌లో మెడికల్ కాలేజీ విద్యార్థినిపై సామూహిక లైంగిక దాడి జరిగిన ఘటనపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మౌనం వీడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలను రాత్రివేళల్లో బయటకు వెళ్లనివ్వకూడదని వ్యాఖ్యానించారు. మెడికల్ కాలేజీ విద్యార్థిని భద్రతను నిర్ధారించడంపై ప్రైవేట్ మెడికల్ కాలేజీ బాధ్యత అని ఇందులోకి ప్రభుత్వాన్ని లాగడం అన్యాయమన్నారు. ముఖ్యంగా రాత్రిపూట ఆడపిల్లను బయటకు రావడానికి అనుమతించకూడదని వారు కూడా తమను తాము రక్షించుకోవాలన్నారు. గ్యాంగ్‌రేప్ ఘటనను 'షాకింగ్' అని పేర్కొన్నారు. ఇది ఒక దిగ్భ్రాంతికరమైన సంఘటన ఈ ఘటనలో ముగ్గురు నిందితులను అరెస్టు చేశారని.. పోలీసులు మరికొందరి కోసం గాలిస్తున్నారని ఎవరినీ వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. దాదాపు ఒక నెల కిందట ఒడిశాలోని పూరి బీచ్‌లో ఒక విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరిగిన సంఘటనను ప్రస్తావించారు. ఒడిశా ప్రభుత్వం ఎలాంటి చర్య తీసుకుంటోంది ఆమె ప్రశ్నించారు. అక్టోబర్ 10న పశ్చిమ బర్ధ మాన్ జిల్లా దుర్గాపూర్‌లో ఓ ప్రైవేట్ మెడికల్ కాలేజీ విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరిగింది. విద్యార్థిని మెడికల్ కాలేజీలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆ రోజు రాత్రి 8 గంటల ప్రాంతంలో అదే కళాశాలకు చెందిన ఒక విద్యార్థి తన స్నేహితులతో కలిసి విద్యార్థినిని నిర్జన ప్రదేశానికి రప్పించి ఆ తర్వాత ఫోన్, డబ్బులు లాక్కోవడంతోపాటు లైంగిక దాడికి పాల్పడినట్లుగా పోలీసులు పేర్కొన్నారు. విద్యార్థిని తన కుమార్తెకు బెంగాల్‌లో భద్రత లేదని, తిరిగి ఇంటికి తీసుకువెళ్తామని.. ఆమెను ఇక్కడ ఏ క్షణంలోనైనా చంపే ప్రమాదం ఉందం టూ అనుమానం వ్యక్తం చేశారు. తమ కూతురిని తిరిగి ఒడిశాకు తీసుకెళ్తామని తమకు నమ్మకం పోయిందని పేర్కొన్నారు. ఆమె బెంగాల్‌లో ఉండడం తమకు ఏమాత్రం ఇష్టం లేదని ఆమె ఒడిశాలో తన చదువును కొనసాగిస్తుందని బాధితురాలి తండ్రి మీడియాకు తెలిపారు. ఒడిశా నుంచి దుర్గాపూర్‌కు చేరుకున్న మహిళ తల్లిదండ్రులు న్యూ టౌన్‌షిప్ పోలీస్ స్టేషన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తన కూతురు ఆరోగ్యం ఏమాత్రం బాగా లేదని నడవలేని పరిస్థితుల్లో ఉందని వాపోయారు. లైంగిక దాడి వ్యవహారంలో పోలీసులు ఎస్‌కే రిజాయ్ ఉద్దీన్, ఎస్‌కే ఫిర్దౌష్, అప్పు అనే ముగ్గురిని అరెస్టు చేశారు. ఈ ఘటనలో ప్రమేయం ఉన్న మరో అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నారు. మొబైల్ టవర్ డంపింగ్ పద్ధతిలో ముగ్గురు నిందితులను గుర్తించారు. ఈ ఘటనలో మరికొందరి హస్తం ఉందని భావిస్తున్నారు. కేసు దర్యాప్తు కొనసాగు తుందని పేర్కొన్నారు. బాధితురాలు ఫ్రెండ్ పాత్రపై సైతం పోలీసులు విచారించనున్నారు. గతేడాది ఆర్‌జీ ఖర్ ఆసుపత్రిలో జరిగిన ఘటన మరువక ముందో మరోసారి వైద్య విద్యార్థినిపై లైంగిక దాడి జరుగడంపై బీజేపీ నాయకురాలు సుకాంత మంజుందార్ తీవ్రంగా విమర్శించారు. పశ్చిమ బెంగాల్‌లో శాంతిభద్రతల పూర్తి పతనానికి ముఖ్యమంత్రిదే బాధ్యత అని ఈ విషయంలో ఆమె తప్పించుకోలేరన్నారు. ఆశ్చర్యకరంగా ముఖ్యమంత్రి ప్రైవేటు వైద్య కళాశాలపై నిందలు మోపుతుందని విమర్శించారు.

# సంక్షిప్తంగా..

## బిఎస్‌ఎఫ్ ఎయిర్‌వింగ్‌లోకి మహిళ



**న్యూఢిల్లీ, అక్టోబరు 12:** భారత సైన్యంలోకి మహిళల ప్రవేశం ఇటీవలే ప్రారంభమైంది. అందులో భాగంగానే సరిహద్దు భద్రతా దళం (బిఎస్‌ఎఫ్) వైమానిక విభాగంలోకి తొలిసారిగా మహిళా ఫ్లైట్ ఇంజినీర్ ప్రవేశించింది. బిఎస్‌ఎఫ్ 50ఏళ్ల చరిత్రలో మహిళ బిఎస్‌ఎఫ్‌లోకి అడుగుపెట్టడం ఇదే తొలిసారి. ఇన్‌స్పెక్టర్‌గా భావన చౌదరితోపాటు మరో నలుగురు సహోద్యోగులు (పురుషులు) ఇటీవల బిఎస్‌ఎఫ్ డైరెక్టర్ జనరల్ దల్జీత్ సింగ్ చౌదరి నుంచి నియామక పత్రాలు అందుకున్నారు. 1969 నుంచి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో బిఎస్‌ఎఫ్ వైమానిక కార్యకలాపాలు నిర్వహిస్తోంది. అంతేగాక సాయుధ బలగాలు, ఎన్ ఎస్‌జి, ఎన్‌డిఆర్‌ఎఫ్ తదితర ప్రత్యేక దళాలకు సంబంధించిన కార్య నిర్వాహక అంశాలను బిఎస్‌ఎఫ్ పర్యవేక్షిస్తోంది. అందులో భాగంగానే వైమానిక విభాగంలోకి ఓ మహిళా అధికారితోపాటు నలుగురిని నియమించినట్లు బిఎస్‌ఎఫ్ డిజి దల్జీత్ సింగ్ చౌదరి తెలిపారు.

## 20 బంగారం బిస్కెట్లు సీజ్



**కోల్‌కతా, అక్టోబరు 12:** భారత్– బంగ్లాదేశ్ సరిహద్దులో అక్రమంగా రవాణా చేస్తున్న 20 బంగారం బిస్కెట్లను సరిహద్దు భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ అంతర్జాయ మార్కెట్‌లో రూ.2.82 కోట్ల మేర ఉంటుందని బిఎస్‌ఎఫ్ అధికారులు తెలిపారు. పశ్చిమబెంగాల్‌లోని నడియా జిల్లాలో ఈఘటన చోటుచేసుకుంది. బంగ్లాదేశ్ నుంచి 2332.66 గ్రాముల బరువుగల 20 బంగారం బిస్కెట్లను ఓ ప్లాస్టిక్ కవర్‌లో తీసుకొస్తుండగా, పక్కా సమాచారంతో తనిఖీలు చేపట్టి, పట్టుకున్నట్లు బిఎస్‌ఎఫ్ సౌత్ బెంగాల్ అధికారులు వెల్లడించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని స్థానిక పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

## ఆపరేషన్ బ్లూస్టార్ సరైన నిర్ణయం కాదు: చిదంబరం



**న్యూఢిల్లీ, అక్టోబరు 12:** స్వర్ణదేవాలయం నుంచి ఉగ్రవాదులను ఏరివేసేందుకు చేపట్టిన ఆపరేషన్ బ్లూస్టార్ సరైన మార్గంకాదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి పీ చిదంబరం అన్నారు.ఆ ఆపరేషన్ కారణంగా అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ తన ప్రాణాలనే కోల్పో వాల్సి వచ్చిందని ఆయన గుర్తుచేశారు. ఆపరే షన్ బ్లూస్టార్ సరైన మార్గం కాదని, ఆ విష యాన్ని తాను అంగీకరిస్తానని చిదంబరం వ్యాఖ్యానించారు. ఆ పొరపాటు ఇందిరాగాంధీ ప్రాణాలనే తీసిందన్నారు. అయితే ఆపరేషన్ బ్లూ స్టార్ అనేది అందరూ కలిసి తీసుకున్న సమష్టి నిర్ణయమని ఆయన చెప్పారు. ఇండియన్ ఆర్మీ,ఇంటెలిజెన్స్, పోలీసులు, సివిల్ డిఫెన్స్ కలిసికట్టుగా తీసుకున్న నిర్ణయమని, ఈ విషయంలో కేవలం ఇందిరా గాంధీని మాత్రమే నిందించడం కరెక్టుకాదన్నారు. హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రం కౌసాలీలోని కుశ్వంత్ సింగ్ లిటరరీ ఫెస్ట్‌లో అనే పుస్తకాన్ని ఆవిష్కరించిన చిదంబరం ఈ వ్యాఖ్యలు చేశారు.

# 58 మంది పాకిస్థాన్ సైనికులు హతం.. 25 ఆర్మీ స్థావరాలు స్వాధీనం : అఫ్ఘానిస్థాన్



**కాబూల్, అక్టోబరు 12:** అఫ్ఘానిస్థాన్, పాకిస్థాన్ సరిహద్దుల్లో ఇరుదేశాల బలగాల మధ్య తీవ్ర ఘర్షణలు చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే తాము 58 మంది పాకిస్థానీ సైనికులను మట్టుబెట్టామని అఫ్ఘానిస్థాన్ ప్రకటించింది. ఇస్లామాబాద్ పదేపదే తమ సరిహద్దుల ఉల్లంఘనలకు పాల్పడిన నేపథ్యంలో ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. అదే విధంగా.. ఐసిస్ ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించొద్దని పాకిస్థాన్‌ను హెచ్చరించింది. దేశ రాజధాని కాబూల్‌తోపాటు ఓ మార్కెట్‌పై పాకిస్థాన్ బాంబు దాడులు చేసిందని అఫ్ఘానిస్థాన్ ఇటీవల ఆరోపించింది. ఈ నేపథ్యంలోనే పాక్ దళాలే లక్ష్యంగా ప్రతీకార దాడులు చేపట్టినట్లు సమాచారం. తమ సేనలు పొరుగు దేశానికి చెందిన 25 ఆర్మీ పోస్టులను స్వాధీనం చేసుకున్నాయని తాలిబన్ ప్రభుత్వ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ వెల్లడించారు. 58 మంది పాక్ సైనికులు మృతి చెందారని, మరో 30 మంది గాయపడ్డారని చెప్పారు.

ఇటీవల అఫ్ఘానిస్థాన్ రాజధాని కాబూల్‌లో భారీ పేలుళ్లు చోటుచేసుకున్నాయి. తెహ్రీక్–ఇ–తాలిబన్ పాకిస్థాన్ (టిటిపి) చీఫ్ నూర్ వారి మెహ్సూద్ స్థావరం లక్ష్యంగా పాక్ యుద్ధ విమానాలు దాడి చేసినట్లు పాక్ రక్షణ విశ్లేషణ సంస్థలు కథనాలు వెలువరించాయి. అయితే, ఈ దాడులపై ఇస్లామాబాద్ ఎటువంటి ప్రకటన చేయలేదు. అఫ్ఘానిస్థాన్ విదేశాంగమంత్రి ఆమిర్ ఖాన్ ముత్తాఖీ భారత పర్యటనలో ఉన్న సమయంలో ఈ దాడులు జరగడం గమనార్హం.

# కోడ్ ఉల్లంఘించారని ప్రశాంత్‌కిశోర్‌పై కేసు



**పాట్నా, అక్టోబరు 12:** ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారనే ఆరోపణపై జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్‌పై వైశాలి జిల్లాలోని రఘోపూర్‌లో కేసు నమోదైంది. రఘోపూర్ ప్రాంతంలో ప్రశాంత్ కిషోర్ శనివారం ఎన్నికల ప్రచారం ప్రారంభించిన అనంతరం ఆయనపై స్థానిక సబ్‌డివిజినల్ అధికారి ఈ ఫిర్యాదు నమోదు చేశారు. ఆర్జేడీ నేత తేజస్వియాదవ్‌కు గట్టి పట్టున్న రఘోపూర్ నుంచి ప్రశాంత్ కిశోర్ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు.

# ఎన్‌డిఎలో కుదిరిన సీట్ల సర్దుబాటు

## జెడియు వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రకటన

## బిజెపి 101, జెడియు 101, ఎల్‌జెపి 29, ఆర్‌ఎల్‌ఎం 6, హెచ్‌ఎఎం 6



**న్యూఢిల్లీ, అక్టోబరు 12:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఎన్‌డిఎ కూటమిలో సీట్ల సర్దుబాటు కుదిరింది. 243 స్థానాలున్న బీహార్ అసెంబ్లీలో బిజెపి, జెడియులు సరిసమానంగా చెరో 101 స్థానాల్లో పోటీ చేయనున్నాయి. లోక్ జన్‌శక్తి పార్టీ (రాంవిలాస్) 29, రాష్ట్రీయ లోక్ మోర్చా (ఆర్‌ఎల్‌ఎం) 6, హిందుస్థానీ అవామ్ పార్టీ (హెచ్‌ఏఎం–ఎస్) 6 సీట్లు దక్కాయి. "సీట్ల సర్దుబాటు సామరస్యంగా జరిగింది, ఎన్‌డిఎలోని అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆనందంగా స్వాగతించారని పేర్కొంటూ ఈ మేరకు జెడియు వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్‌కుమార్ ఝా ఎక్స్ వేదికగా ప్రకటించారు. భారీ మెజారిటీతో నితీష్‌కుమార్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేయడానికి ఐక్యంగా ఉన్నారని సంజయ్ తన పోస్ట్‌లో రాశారు. 2020 బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 115 సీట్లలో జెడియు, 110 స్థానాల్లో పోటీ చేసిన బిజెపి ఈసారి ఆ సంఖ్యను తగ్గించుకున్నాయి. ఆ మేరకు కూటమి భాగస్వామ్య పార్టీలకు సీట్లను కేటాయించాయి. నాడు ఎన్‌డిఎ కూటమి తరఫున వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ (విఐపి) 11 సీట్లలో పోటీ చేసింది. తాజా విఐపి మహాఘట్ బంధన్ కూటమిలో చేరింది. ఈ నేపథ్యంలోనే ఎన్‌డిఎ కూటమిలోని బిజెపి–జెడియులు తమ సీట్లను త్యాగం చేసి భాగస్వామ్య పార్టీలకు ప్రధానంగా చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని ఎల్‌జెపికి 29 సీట్లు కేటాయించింది. గత ఎన్నికల్లో నితీష్‌తో విభేదించి, 135 స్థానాల్లో ఒంటరిగా బరిలోకి దిగిన విషయం తెలిసిందే. తాజా ఎన్నికల్లో ఎన్‌డిఎ తరఫున ఎల్‌జెపి 29 స్థానాల్లో పోటీ చేయనుంది.


ఇక ఆర్‌జెడి, కాంగ్రెస్ నేతృత్వంలోని మహాఘట్ బంధన్ కూటమి సీట్ల సర్దుబాటుకు సంబంధించి చర్చలు కొనసాగుతున్నాయి, నేడో రేపో అధికారికంగా ప్రకటన చేసే అవకాశముందని ఆర్‌జెడి నేతలు చెబుతున్నారు. ఇప్పటికే తొలి దశ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ వెలువడగా, సోమవారం రెండో దశ నోటిఫికేషన్ రానుంది.

నవంబర్ 6, 11 తేదీల్లో రెండు విడతలుగా పోలింగ్ జరుగనుంది.

# అమెరికాలో మళ్లీ కాల్పులు: 8 మంది దుర్మరణం

**వాషింగ్టన్, అక్టోబరు 12:** అమెరికాలో మిసిసిపిలోని ఓ హైస్కూల్‌లో ఫుట్‌బాల్ హోంకమింగ్ వేడుకల్లో జరిగిన మూడుచోట్ల వేర్వేరుగా కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ కాల్పుల్లో 8మంది ప్రాణాలు కోల్పోగా, 18మందికి పైగా గాయపడ్డారు. అర్ధరాత్రి సమయంలో లేలాండ్‌లో అత్యంత పాశవికంగా దుండగులు కాల్పులకు పాల్పడ్డారని, ఈ ఘటనలో ఎనిమిది మంది మరణించారని పశ్చిమ మిసిసిపిలోని వాషింగ్టన్ కౌంటీ మేయర్ జాన్‌లీ తెలిపారు. 18 మందికి పైగా గాయపడ్డారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉందన్నారు.

# అమెరికాను వీడనున్న 'నోబెల్' దంపతులు



**వాషింగ్టన్, అక్టోబరు 12:** ఆర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతి పొందిన దంపతులు ఎస్తర్ డుఫ్లో, అభిజిత్ బెనర్జీలు అమెరికాను వీడనున్నారు. స్విట్జర్లాండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ జూరిచ్‌లో ఏర్పాటు చేయనున్న కొత్త ఆర్థిక శాస్త్ర విభాగానికి నేతృత్వం వహించను న్నా రు. ఈ మేరకు యూనివర్సిటీ ఆఫ్ జ్యూరిచ్ ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం డుఫ్లో, అభిజిత్ బెనర్జీలు ఎమ్ఐటీలో ఉన్నారు. వచ్చే ఏడాది జులైలో ప్రొఫెసర్లుగా యూనివర్సిటీ ఆఫ్ జ్యూరిచ్‌లో చేరతారు.

# అమరావతిలో సిఆర్‌డిఎ

విజయవాడ, అక్టోబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి: అమరావతిలో సిఆర్‌డిఎ (క్రడా) కార్యాలయం కార్యకలపాలకు సిద్ధమైంది. ఈ భవనం నుంచే రాజధాని అమరావతి నుంచి కార్యకలాపాలు నిర్వహించేందుకు సిఆర్‌డిఎ సన్నాహాలు చేస్తోంది. ప్రజా రాజధానిలో పాలనా సౌలభ్యం కొరకు అన్ని హెచ్‌వోడీలు ఒకేచోట, ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా సరికొత్త హంగులతో నిర్మించారు. ఈ కార్యాలయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ఈనెల 13వ తేదీ ఉదయం గం.9.54ని.లకు ప్రారంభిస్తారు. అమరావతికి భూములిచ్చిన రైతులకు దగ్గరగా సిఆర్‌డిఎ ప్రధాన కార్యాలయం అందుబాటులో ఉంటుంది. రాజధాని అమరావతిని ప్రతిబింబించేలా భవనం ముందు ఏ అక్షరంతో ఎలివేషన్‌పై ఉంటుంది. ఇకపై అమరావతి నిర్మాణ పనులన్నీ ఇక్కడి నుంచే పర్యవేక్షిస్తారు.

అమరావతిలో సీడ్ యాక్సిస్ రోడ్ ఇ3-ఎన్11 జంక్షన్ వద్ద రాయపూడి సమీపంలో మున్సిపల్ శాఖ ప్రధాన కార్యాలయం నిర్మాణాన్ని 2017లో ప్రారంభించారు. ఇక్కడ ఒక ప్రధాన భవనంతో పాటు పిఇబి భవనాల నిర్మాణం జరిగింది. ఇందులో ప్రధాన భవనం మొత్తం 4.32 ఎకరాల విస్తీర్ణంలో జీ ప్లస్ 7((బి+7) భవనం 3 లక్షల 7వేల 326 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణం పూర్తయింది. ఈ విస్తీర్ణంలో ప్రధాన భవనం 0.73 ఎకరాలు, గ్రీన్ జోన్ 0.88 ఎకరాలు, పార్కింగ్ ప్రాంతం 1.36 ఎకరాలు, ఓపెన్ స్పేస్ 0.96 ఎకరాలు, ఎస్టీపీ 0.39 ఎకరాల్లో నిర్మాణం చేసారు. ఇవి కాకుండా హెడ్ రూమ్స్ 5,554 చ.అ, ప్రొజెక్షన్ శ్లాబ్స్ 3,113చ.అ., టెర్రస్ పిఇబి స్ట్రక్చర్ 32,062 చ.అడుగులు కలిపి మొత్తం 2,85,561 చ.అడుగుల విస్తీర్ణంలో (బిల్టప్ ఏరియా)లో నిర్మించారు.

ఆఫీస్ ప్రాంగణంలో సంపు, పంప్ రూం 4,029చ.అ., ఎస్టీపి 5014చ.అ అడుగులు ఉంటుంది. డ్రైవర్స్ లాంజ్ 752 సెక్యూరిటీ రూం 225, యుటిలిటీ బ్లాక్ 11,745 చ.అడుగులతో కలిపి మొత్తం ఎక్స్టర్నల్ బ్లాక్ 21,765 చ.అడుగులు ఉంటుంది. ఇంటర్నల్ బ్లాక్, ఎక్స్ టర్నల్ బ్లాక్ ఏరియా కలిపి మొత్తం 3,07,326 చ.అడుగులతో నిర్మించారు.

మొత్తం లిఫ్టులు 7 (ఒక్కొక్కటి 8 మంది కెపాసిటీ)
పార్కింగ్ వసతి 170 ఫోర్ వీలర్, 170 టూ వీలర్ వెహికల్స్.
ఇక ఈ ప్రధాన కార్యాలయానికి పక్కనే మొత్తం 8 ఎకరాల్లో (పార్కింగ్ ఏరియాతో కలిపి) మరో నాలుగు భవనాలు నిర్మించారు.
పిఇబి (ప్రిఇంజినీర్డ్ బిల్డింగులు)భవనాలు..
ఒక్కొక్క భవనం 41,500 చ.అ.ల విస్తీర్ణంలో నాలుగు భవనాలు అంటే 1,66,000 చ.అడుగుల విస్తీర్ణంలో నిర్మించారు. ఈ భవనంలో మున్సిపల్ శాఖ హెచ్‌వోడీలకు ఈ విధంగా కేటాయించారు.
భవనం 1 41,500 చ.అ టిడ్కో,
భవనం 2 41,500 చ.అ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, రెరా అప్పిలేట్ అథారిటీ, గ్రీనింగ్ కార్పొరేషన్.
భవనం 3 41,500 చ.అ రెరా, టౌన్ ప్లానింగ్.
భవనం 4 41,500 చ.అ మెప్మా కార్యాలయం. అమరావతి నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం అమరావతిలో 79 ప్రాజెక్టల పనులు ప్రారంభమయ్యాయి. వీటిలో సిఆర్‌డిఎ నుంచి రూ.12,762.46 కోట్ల విలువైన 19 పనులు, ఎడిసిఎల్ నుంచి రూ.36,737.06 కోట్ల విలువైన 60 పనులు మొత్తంగా రూ.49,499.52 కోట్ల విలువైన 79 పనులు జరుగుతున్నవి. మొత్తం రూ.54,693.09 కోట్ల విలువైన 90 పనులకు పాలనాపరమైన అనుమతులు రాగా... వీటిలో 79 పనులు మొదలెట్టారు. మరో 7 పనులు టెండర్ల ప్రక్రియలో ఉన్నాయి. మరో 5 పనులకు టెండర్లు పిలవాల్సి ఉంది. ఇవికాకుండా మరో రూ.36,577 కోట్ల విలువైన 20 పనులకు పాలనాపరమైన అనుమతులు రావాల్సి ఉంది.



## నేడు సీఎం చేతుల మీదుగా ప్రారంభం

**జీ ప్లస్ 7(బి+7) లో శాఖల వారీగా కేటాయింపులు**

గ్రౌండ్ ఫ్లోర్ 23,814 చ.అ రిసెప్షన్, పబ్లిక్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, రెస్టారెంట్, బ్యాంక్, ఏఐ కమాండ్ సెంటర్
ఫస్ట్ ఫ్లోర్ 30,886 చ.అ కాన్ఫరెన్స్ హాల్స్
సెకండ్ ఫ్లోర్ 30,886 చ.అ సిఆర్‌డిఎ
థర్డ్ ఫ్లోర్ 32,096 చ.అ. సిఆర్‌డిఎ
ఫోర్త్ ఫ్లోర్ 30,862 చ.అ. మున్సిపల్ శాఖ డైరెక్టర్ ఆఫీస్
ఐదో ఫ్లోర్ 32,096 చ.అ. సిఆర్‌డిఎ
ఆరో ఫ్లోర్ 32,096 చ.అ. ఏడీసీఎల్
ఏడో ఫ్లోర్ 32,096 చ.అ. ఉంటుంది. పురపాలక శాఖ మంత్రి చాంబర్, ప్రిన్సిపల్ సెక్రటరీ చాంబర్, పబ్లిక్ హెల్త్ ఈఎన్సి, ఏడీసీఎల్
టెర్రస్ పిఇబి డైనింగ్



జ్యోతి ప్రజ్వలనతో మకుట చేనేత ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత

## ఎగ్జిబిషన్లతో నేతన్నలకు ఆర్థిక భరోసా

విజయవాడ, అక్టోబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి: నేతన్నలకు ఆర్థిక భరోసా కలిగేలా చేనేత ఎగ్జిబిషన్లు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. విజయవాడ నగరంలోని జీఈవీ రాధా మాధవ్ క్లబ్ హౌస్‌లో మకుట డిజైనర్స్ స్టూడియో ఆధ్వర్యంలో చేపట్టిన చేనేత ఎగ్జిబిషన్‌ను మంత్రి సవిత జ్యోతి పారంభించారు. ఎగ్జిబిషన్‌లో అందుబాటులో ఉంచిన చేనేత రెడీ మేడ్ దుస్తులను, చీరలను పరిశీలించారు. స్వయంగా కొన్ని వస్త్రాలు కొనుగోలు చేసారు. అనంతరం మీడియాతో మంత్రి సవిత మాట్లాడుతూ, చేనేత రంగానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ కోసమే ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆన్‌లైన్‌తో పాటు ఆప్కో షో రూమ్‌ల్లోనూ చేనేత విక్రయాల చేపట్టామని, చేనేత రెడీమేడ్ దుస్తులకు విశేష స్పందన లభిస్తోందని తెలిపారు. తెలుగింటి పండుగల్లో సంప్రదాయ చేనేత దుస్తులను ప్రజలు ధరించి నేతన్నలకు అండగా నిలవాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, జిల్లా పరిషత్ పూర్వపు చైర్మన్ గద్దె అనురాధ, మకుట డిజైనర్స్ స్టూడియో ఎండి శ్రావ్య, ఇతర ప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# విశాఖలో 5 లక్షల ఉద్యోగాలు

**● పెద్దఎత్తున పెట్టుబడులు తరలి వస్తున్నాయి ● విశాఖ రీజియన్‌లో ఐటీ పార్కులు ఏర్పాటు ● ల్యాండ్ బ్యాంకులను సిద్ధం చేయాలి ● మౌలిక వసతులపై దృష్టి సారించాలి ● నిర్దిష్ట ప్రణాళికలు రూపొందించండి ● ఉత్తరాంధ్ర జిల్లాల అధికారులు, ప్రజాప్రతినిధులతో ఉన్నత సమావేశంలో మంత్రి లోకేష్ దిశానిర్దేశం**

విశాఖపట్నం, అక్టోబరు 12 ప్రభాతవార్త: రాబోయే కాలంలో విశాఖ రీజియన్‌లో పెద్దఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని, ఇందుకు కావాల్సిన మౌలిక వసతులపై నిర్దిష్ట ప్రణాళికలు రూపొందించాలని అధికారులను మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లు, అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో విశాఖ కలెక్టరేట్ మీటింగు హాల్‌లో మంత్రి ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. విశాఖపట్టణం, అనకాపల్లి, విజయగరం, శ్రీకాకుళం జిల్లాలతో కూడిన రీజియన్ అభివృద్ధి, ఇతర అంశాలపై సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని విశాఖపట్నం దశదిశ మారేలా అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. బెంగళూరు, పుణెలాంటి నగరాల్లో ఉండే ట్రాఫిక్ సమస్యలు ఇక్కడ ఉత్పన్నం కాకుండా చూడాలని, విస్తారమైన రోడ్లను అభివృద్ధి చేయాలని సూచించారు. విశాఖకు పెద్దఎత్తున కంపెనీలు వస్తున్నాయి. దానికి తగ్గట్టుగా మాస్టర్ ప్లాన్లు సిద్ధం చేసుకుని ముందుకు వెళ్లాలి. ముప్పై ఏళ్ల భవిష్యత్తును ఊహించి ప్రణాళికలు రూపొందించాలి. ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య సమన్వయంతో కూడిన మేధోపరమైన చర్చ జరగాలని మంత్రి పేర్కొన్నారు.

వివిధ కంపెనీలు, అతిపెద్ద స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కాబోతున్న ఈ రీజియన్‌లో 5 లక్షల ఉద్యోగాలు యువతకు కల్పించటమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కాబట్టి ఇక్కడి నేతలు, అధికారులు నిర్దిష్ట ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బంది లేని విధంగా మిషన్ మోడ్‌లో అభివృద్ధి జరగాలని, వారి ఆమోదయోగ్యమైన విధంగా నిర్ణయాలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా రాబోయే రోజుల్లో విశాఖ రీజియన్‌లో ఐటీ పార్కులను ఏర్పాటు చేసేందుకు అనువైన ల్యాండ్ బ్యాంకులను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో ఐటీ సెక్రటరీ కాటంనేని భాస్కర్, శాసన సభ విప్ గణబాబు, నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, ఏపీ గ్రోవర్స్ ఆయిల్స్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ గండిబాబ్జీ, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల కలెక్టర్లు విజయ కృష్ణన్, రాంసుందర్ రెడ్డి, స్వప్నిల్ దినకర్ పుండర్కర్, విఎంఆర్‌డిఎ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్, విశాఖపట్నం జెసి కె. మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్ భవానీ శంకర్, భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు సంగీతరావు

## ఇంజనీర్లపై కేసులు ఎత్తివేయాలి

తిరుపతి కలెక్టరేట్, అక్టోబరు 12 ప్రభాతవార్త: ఆటో డ్రైవర్ల కంటే దయనీయంగా పంచాయతీరాజ్ ఇంజనీర్ల పరిస్థితి మారిందని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.సంగీతరావు, గౌరవ అధ్యక్షులు మురళీకృష్ణమ నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతి ఆఫీసర్స్ క్లబ్‌లో ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం జరిగింది. సంగీతరావు, మురళీకృష్ణ నాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పంచాయతీ ఇంజనీర్లు గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సైనికులా పనిచేసిన వారిపై కేసులు నమోదు చేయడం బాధాకరమన్నారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ వెంటనే స్పందించి ఆ కేసులను ఎత్తివేయాలన్నారు. ఖాళీగా ఉన్న 619 సెక్షన్ ఆఫీసర్ను ఏపీపీఎస్సీ ద్వారా వెంటనే భర్తీ చేయాలన్నారు. మూడు వేల కోట్లు విలువ చేసే ఎంజిఎన్ఆర్ ఇజిఎస్ పనులు చేసినందుకు పంచాయతీ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్‌కు అడ్మినిస్ట్రేటివ్ చార్జెస్ మూడు శాతం వెంటనే విడుదల చేయాలని తెలిపారు. సెక్షన్ ఆఫీసర్స్ అందరికి మూడు వేల రూపాయలు ఎఫ్‌టిఏ ఇవ్వాలన్నారు. డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్స్ పోస్టులలో 30 పంచాయతీరాజ్ ఇంజనీర్లకు కేటాయించాలని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పంచాయతీ ఇంజనీర్ల సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో డిసెంబర్ నుండి దశలవారీగా ఆందోళనలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అన్ని జిల్లాల అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సభ్యులు, పంచాయతీ ఇంజనీర్లు పాల్గొన్నారు.

# క్రీడా రంగానికి ప్రభుత్వం పెద్దపీట

**జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్**

జగ్గయ్యపేట, అక్టోబరు 12, ప్రభాతవార్త: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు క్రీడా రంగానికి, క్రీడాకారులకు అవసరమైన సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తుందని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అన్నారు. గుంటూరులో జరిగిన 8వ మాష్టర్స్ స్విమ్మింగ్ చాంపియన్ షిప్ (ఇంటర్ డిస్ట్రిక్ట్ మాష్టర్స్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్)-2025 పోటీల్లో ప్రతిభతో 64 పతకాలు సాధించిన జగ్గయ్యపేట స్విమ్మర్లను ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజగోపాల్-శ్రీదేవి దంపతులు సన్మానించారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఈతల పోటీల్లో పాల్గొంటూ పతకాలు సాధిస్తూ ఈప్రాంత ఖ్యాతిని విస్తరింపజేస్తున్నారంటూ స్విమ్మర్లను వారు అభినందించారు. ప్రభుత్వం పక్షాన క్రీడాకారులకు అవసరమైన అన్ని రకాల సదుపాయల కల్పనకు తన వంతు కృషి ఉంటుందని హామీ ఇచ్చారు. జగ్గయ్యపేటలో నిర్మించిన స్విమ్మింగ్‌పూల్‌ను శాప్ అనుమతులతో ప్రజలకు అతి త్వరలో అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు ప్రకటించారు. కాగా విజేతలను కెడిసిసి బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్, మాజీవిప్ సామినేని ఉదయభాను, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మాజీ కెడిసిసి చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, కృష్ణా స్విమ్మర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు, గౌరవాధ్యక్షులు సిఐ మోటపోతుల కిషోం బాబు, స్విమ్మర్స్ కో-కన్వీనర్, సీనియర్ పాత్రికేయులు యలదండి శ్రీనివాసరావు, డ్రీమర్స్ స్విమ్మర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మందడపు శ్రీనివాసరావు, కలాలి నరేష్, కోశాధికారి పి.రమాదేవి, కుర్ర శ్రీనివాస్, గంధం రాంబాబు, తుమ్మడపు నారాయణ, కృష్ణాస్విమ్మర్స్ అధ్యక్షులు కె కరుణాకర్, పూర్వ అధ్యక్షులు రాటకొండ శ్రీనివాసరావు, చెరుకూరి రమేష్, గోగుశెట్టి వెంకటమహేష్, పిన్నెల్లి పాండురంగారావు, సీనియర్ స్విమ్మర్స్ ధూళిపాళ లక్ష్మయణరావు, కొల్లి మార్షల్ స్టాలిన్, ఎస్‌కె బాజాని విజేతలను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.



విజేతలను సన్మానిస్తున్న జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్



## దుర్గమ్మ వారి దర్శనానికి పోటెత్తిన భక్తజనం

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 12, ప్రభాతవార్త: అమ్మల గన్న అమ్మ బెజవాడ దుర్గమ్మ వారి దర్శనానికి భక్తులు ఆదివారం పెద్ద ఎత్తున వచ్చారు. వారికి త్వరగా దర్శనమయ్యేలా ఇఒ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా గాంధీలు చర్యలు తీసుకున్నారు. ఉదయం 10.30 నుండి అంతరాలయ దర్శనాలను రద్దు చేస్తూ ఇఒ చర్యలు తీసుకున్నారు. అలాగే విఐపి, ప్రోటోకాల్ దర్శనాలు రద్దు చేశారు.

## వేదోక్తంగా సూర్యోపాసన

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 12, ప్రభాతవార్త: విజయవాడ కనకదుర్గమ్మవారి ఆలయంలో ఆదివారంనాడు వేదోక్తంగా సూర్య ఉపాసన నిర్వహించారు. సూర్య నమస్కారాలు, ఆదిత్య హృదయ పఠనం, అరుణ పారాయణలు గావిస్తూ పూజాదికాలు నిర్వహించారు. దూప, దీప నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు.



## తప్పిపోయిన బాలుడిని తల్లికి అప్పగింత

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 12, ప్రభాతవార్త: దుర్గమ్మ దర్శనానికి ఆదివారం వచ్చిన జగ్గయ్యపేటకు చెందిన లావణ్య కుమారుడు శశివజ్ర ఆరూప్ తప్పిపోయాడు. ఈ సమయంలో ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయ ఏఎస్ఐ ఆర్‌వి సత్యనారాయణ శ్రీ అమ్మవారి దర్శనం చేసుకుని వస్తున్నప్పుడు లిఫ్ట్‌వద్ద కనిపించిన ఆ బాలుడిని ఈఓ వికె శీనా నాయక్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా బాలుని తల్లికి ఆ బాలుడిని సురక్షితంగా అప్పగించారు. ఏఎస్ఐను ఇఒ, చైర్మన్‌లు అభినందించారు.

## సింగపూర్‌కు విమాన సర్వీస్‌పై విఆర్‌ఒ అసోసియేషన్ హర్షం

విజయవాడ, అక్టోబరు 12 ప్రభాతవార్త: గన్నవరం ఎయిర్‌పోర్టు నుండి నేరుగా సింగపూర్‌కు విమాన సర్వీసు ఏర్పాటు చేసినందుకు విఆర్‌ఒ అసోసియేషన్ అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్ర రాజు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు 15 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రారంభమైన ఈ సింగపూర్ సర్వీస్ ఏర్పాటు చేయడానికి కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు, అశోక్‌గజపతి రాజు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, నారా లోకేష్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. విజయవాడ చుట్టుప్రక్కల నుండి, అమరావతి రాజధాని నుండి సింగపూర్‌కు వెళ్లటానికి ఇబ్బందులు ఈనెల 15 నుండి ప్రారంభమయ్యే విమాన సర్వీసుతో తొలగినట్లేనన్నారు.



వేద విద్వాన మహాసభల వేడుకల్లో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

## సనాతన ధర్మాన్ని పరిరక్షించాలి

సికింద్రాబాద్, అక్టోబరు 12 ప్రభాతవార్త: సనాతన ధర్మాన్ని పరిరక్షించడమే ధ్యేయంగా ప్రతి హిందువు పాటుపడాల్సిన ఆవశ్యకత ఉందని కేంద్ర బొగ్గ గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. సనాతన ధర్మం హిందుత్వం భారతదేశంలో ఉన్నన్నినాళ్ళే సెక్యులరిజానికి అవకాశం ఉంటుందని హిందూ మతం మైనారిటీలో పడితే సెక్యులరిజం అనేది ఉండదని అన్నారు. సికింద్రాబాద్ స్కందగిరి దేవాలయంలో జరుగుతున్న శ్రీ జనార్దన ఆనంద సరస్వతి స్వామి సంస్కృతి ట్రస్ట్ 25వ రజతోత్సవాలు, శ్రీ తెలంగాణ వేద విద్వాన మహాసభల వేడుకల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేద పాఠశాలలో 600 మందికి పైగా విద్యార్థులకు నాలుగు రకాల వేద పరీక్షలు నిర్వహిస్తూ వేదాన్ని ప్రోత్సహించడం శుభ పరిణామమన్నారు. సనాతన ధర్మానికి మరింత గౌరవాన్ని ఇనుమడింపజేసేలా ప్రచారాన్ని నిర్వహిస్తూ ప్రధాని మోడీ నేతృత్వంలో సనాతన ధర్మ రక్షణకు కృషి చేస్తున్నట్టు వెల్లడించారు. సనాతన ధర్మం, హిందూమతం గురించి మాట్లాడితే దేశంలోనే విమర్శలు వస్తుండడం బాధాకరమన్నారు. ఇతర మతాలను కించపరచకుండా హిందూమతం గురించి మాట్లాడే స్వేచ్ఛ ప్రతి ఒక్కరికి ఉందన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ తూములూరి సాయినాథ శర్మ, ప్రధాన కార్యదర్శి బ్రహ్మానంద శర్మ, మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ స్టేడియంలో మంత్రి లోకేష్ సందడి




విశాఖపట్నం, అక్టోబరు 12 ప్రభాతవార్త: విశాఖ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సందడి చేశారు. విశాఖలోని ఎసిఎవిడిసిఎ స్టేడియంలో భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ పేరుతో ఏ గ్యాలరీ స్టాండ్‌తో పాటు మరో క్రికెటర్ రావి కల్పన పేరుతో మూడో నెంబర్ గేట్‌ను ఐసిసి చైర్మన్ జై షాతో కలిసి మంత్రి నారా లోకేష్ లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బిసిసిఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్, ఎసిఎ అధ్యక్షులు కేశినేని శివనాథ్, ఎసిఎ కార్యదర్శి సానా సతీష్ పాల్గొన్నారు. అనంతరం భారత్ ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న మహిళల వన్డే ప్రపంచ కప్‌ను మ్యాచ్‌ను జై షాతో కలిసి మంత్రి నారా లోకేష్ వీక్షి ంచారు.



## బంజారాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

విజయవాడ, అక్టోబరు 12 ప్రభాతవార్త: బంజారాలకు ఐకమత్యం అవసరమని ఆలిండియా బంజారా సేవాసంఘం ప్రెసిడెంట్ కొర్ర జగన్నాథం అన్నారు. ఆదివారం విజయవాడలో ఆలిండియా బంజారా సేవా సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ సందర్భంగా నూతన ప్రెసిడెంట్‌గా ఎన్నికైన ఆయన మాట్లాడుతూ ఐక్యంగా వుంటే రాబోయే కాలంలో బంజారాలకు ఎటువంటి ఇబ్బందులుండవన్నారు. కార్యక్రమంలో జాతీయ కమిటీ నాయకులు పిఎల్ రవీందర్‌నాయక్, రాష్ట్ర ప్రెసిడెంట్ బానోత్ చక్రి నాయక్, జనరల్ సెక్రటరి జటావత్ రాంబాబు మాట్లాడుతూ ఎపిలోని 15లక్షల మంది బంజారాల వాణి కాలంలో చట్టసభల్లో వినిపించేందుకు ఒక్కరైనా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీగా లేరని వాపోయారు. స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలైనా తండాల్లో అనేక తండాలు అభివృద్ధి చెందలేదని, బంజారాల సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు వివరించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో స్టేట్ కోఆర్డినేటర్ బిబివి నాయక్, బద్దే నాయక్, డా బాలాజి నాయక్, జటావత్ బాలాజీ నాయక్, బానోత్ శ్రీనివాస్ నాయక్, భూఖ్య శ్రీనివాస నాయక్, లాల్య నాయక్, బంజారాల రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న పరకాల ప్రభాకర్

## కేంద్రం చేతిలో ఇసి కీలుబొమ్మ

# రద్దు చేయాలి

**హైదరాబాద్ (సైఫాబాద్), అక్టోబరు 12, ప్రభాతవార్త:** ఎన్నికల సంఘం కేంద్ర ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మ వలే, బిజెపికి అనుబంధ మోర్చాగా మారిం దని ప్రఖ్యాత రాజకీయ విశ్లేషకులు డా.పరకాల ప్రభాకర్ ఆరోపించారు. జాగో నవ తెలంగాణ ఆధ్వర్యంలో ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన 'ప్రజాస్వామ్యాన్ని కాపాడే ప్రయత్నంలో- మీరు భాగస్వాములు కండి' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన ముఖ్య అతిధి గా పాల్గొని ప్రసంగించారు. ఇలాంటి ఎన్నికల సంఘాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఓటు చోరి జరిగిందని మాట్లాడేవారు తక్షణమే ఎంపి పదవులకు రాజీనామా చేయాలని, పార్లమెంట్‌ను కూడా రద్దు చేయాలని కోరాలన్నారు. 15 రాష్ట్రాలలో 79 లోక్‌సభ నియోజకవర్గాల్లో 5 కోట్ల ఓట్లను అదనంగా లెక్కించడం జరిగిందని, ఈ 5 కోట్ల ఓట్లు అదనంగా రావడం వల్లనే ఎన్‌డిఎకి లోక్‌సభలో మేజారిట్ట వచ్చిందని, లేకపోతే 234 స్థానాలు మాత్రమే వచ్చేవని, ప్రతిపక్షంగా ఉన్న కూటమికి 313 స్దానాలు వచ్చేవని ఆయన స్పష్టం చేశారు. 79 స్థానాలు ఎన్‌డిఎకి అధనంగా రావడం వల్లనే ఎన్‌డిఎ అధికారంలోకి వచ్చిందని చెప్పారు. బీహార్ రాష్ట్రంలో లక్షలాది ఓట్లను రకరకాల పేర్ల మీద తొలగించడం జరిగిందన్నారు. చివరికి మోసం అని తెలిందన్నారు. తెలంగాణ ప్రజల పార్టీ అధ్యక్షు డు జస్టిస్ బి.చంద్రకుమార్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మత విద్వే షాలను రెచ్చగోడుతున్నదని, దేశవ్యాప్తంగా 60 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసు కుంటే పట్టించుకోలేదని ఆరోపించారు. దేశంలో అవినీతి బాగా పెరిగిపోయిందని, ఎన్నికల కమిషన్‌ను ఎన్నుకునే పద్దతి సరిగలేదన్నారు. ఎన్నికలు నిష్పాక్షపాతంగా జరగాలని, అప్పుడు ప్రజాస్వామ్యం బలంగా ఉంటుందన్నారు. ఈ సదస్సులో ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్, వివిధ పార్టీల నాయకులు, కందిమళ్ల ప్రతాప్‌రెడ్డి, అబ్దుల్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీపై విమర్శల వివాదం

## శ్రీకాంత్ అయ్యంగార్ క్షమాపణ



శ్రీకాంత్ అయ్యంగార్

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** మహాత్మా గాంధీపై సినీ నటుడు శ్రీకాంత్ అయ్యంగార్ చేసిన అసభ్యకర వ్యాఖ్యలపై ఆదివారం ఎట్టకేలకు క్షమాపణలు కోరారు. నాటి నుంచి పెద్ద ఎత్తున నెటిజన్ల నుంచి తీవ్ర విమ ర్శలు రావడంతో, ఆయన క్షమాపణలు కోరుతూ ఇన్‌స్ట్రాగ్రామ్‌లో ఓ వీడియో పోస్ట్ చేశారు. తన వ్యాఖ్యలతో బాధపడిన వారందరినీ క్షమించమని వేడు కున్నాడు. గాంధీ జయంతి అయిన అక్టోబరు 2న దసరా పండగ రావడంపై శ్రీకాంత్‌గాంధీపై వివాదాస్పద కామెంట్స్ చేసింది తెలిసిందే. ఈ విడియో సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో ఆయనపై నెటిజన్లు ఫైర్ అయ్యారు. నగర సిసిఎస్‌తో పాటు ఏపీలోనూ కేసులు నమోదు చేయడమే కాదు, మా మూవీ అసోసియేషన్‌కు వెళ్లి శ్రీకాంత్ సభ్యత్వం రద్దు చేయాలంటూ కాంగ్రెస్ నేత, ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్ ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శ్రీకాంత్ అయ్యంగార్ తాజాగా స్పందించారు. తన వ్యా ఖ్యలు ఎవరినైనా బాధపెట్టి ఉంటే క్షమించమని కోరుతూ ఇన్‌స్ట్రాగ్రామ్‌లో వీడియో పోస్ట్ చేశాడు. ఇటీవల మాట్లాడిన ఒక విషయం ఎంతో మందికి బాధ కలిగించింది. అది నా ఉద్దేశం కాదని, బాధపడిన వారందరికీ క్షమా పణలు చెప్తున్నాను. ఫ్రీడమ్ ఫైటర్స్ అందరికీ నేను శిరస్సు వంచి వేడు కుంటున్నాను. నాకూ, మీకూ స్వేచ్ఛా వాయువులు పీల్చే భాగ్యం కల్పిం చడానికి ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర్య సమర యోధులందరికీ మన్నిం చమని కోరుతున్నానని శ్రీకాంత్ అయ్యంగార్ అన్నారు.

## కామారెడ్డి పోలీసులకు చిక్కిన

# బీహార్ దొంగనోట్ల ముఠా

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** కామారెడ్డి జిల్లా పోలీసులకు బిహార్ దొంగనోట్ల ముఠా పట్టుబడింది. ఈ సందర్భంగా ఈ ముఠా నుంచి మూడు లక్షల రూపాయలకు పైగా నకిలీ నోట్లతో నాటు 15 వేల 300 రూపాయల అసలు నోట్లు, నకిలీనోట్లను ముద్రించే సామాగ్రిని పట్టుకున్నా రు. ఈ ముఠా గుట్టు రట్టయిన వైనం విచిత్రంగా వుంది. కామారెడ్డి బస్ స్టాండ్ వద్ద వున్న ఓ వైన్ షాప్‌లో గత నెల 23వ తేదీన సిద్ధా గౌడ్ అనే వ్యక్తి 500 రూపాయల నోటు ఇచ్చి మద్యం కొనుగోలు చేశాడు. అయితే మద్యం దుకాణంలో పనిచేసే అఖిల్‌కు సిద్దా గౌడ్ ఇచ్చిన 500 రూపాయ ల నోటు నకిలీదని అనుమానం వచ్చి అతని ఇంటికి వెళ్లి నిలదీయగా ఇది అసలైనదే నని అతను దబాయించాడు. దీంతో అఖిల్ ఈ నకిలీ నోటును పోలీసులకు అందించి ఫిర్యాదు చేశాడు. ఈ పిర్యాదు ఆధారంగా పోలీసులు సిద్దా గౌడ్‌ను పిలిపించి విచారణ చేయగా దొంగనోటుగా అతను అంగీ కరించాడు. దీనిని ఫేస్ బుక్‌లో వచ్చిన కరెన్సీ గ్రూపు ద్వారా కోల్‌కతాకు చెందిన సౌరబ్ డే అనే వ్యక్తి ద్వారా పరిచయం చేసుకుని ఐదు వేల రూపాయల అసలునోట్లకు పది వేల నకిలీ నోట్లు తీసుకున్నానని తెలిపాడు. దీంతో కామారెడ్డి పోలీసులు కోల్‌కతాకు వెళ్లి సౌరబ్ డేను అరెస్టు చేయగా హర్యానాలోని భగత్, బీహార్‌లోని రషీద్ ద్వారా తాను వీటిని కొన్నానని తెలిపాడు. దీని తరువాత కామారెడ్డి జిల్లా పోలీసులు ప్రత్యేక బృందాలు గా ఏర్పడి బీహార్‌కు వెళ్లి దొంగనోట్ల ముఠాకు లీడర్ రషీద్‌ను పట్టుకున్నాయి. ఇతని ఇంట్లో భారీగా దొంగనోట్లతోపాటు వాటిని ముద్రించే సామాగ్రి పట్టుబడింది. ముఠాలో 8 మందిని అరెస్టు చేయగా మరో నలుగురు పరారీలో ఉన్నారు.

# ఆందోళన చెందకండి

### జోర్డాన్‌లో చిక్కుకున్న గల్ఫ్ కార్మికులకు హరీశ్‌రావు భరోసా

**హైదరాబాద్, అక్టోబరు 12 ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి:** ఉపాధి కోసం వెళ్లి జోర్డాన్‌లో చిక్కుకున్న 12 మంది తెలంగాన వలస కార్మికులకు బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ఆదివారం భరోసా కల్పించారు. వారి సమస్యలను విదేశీ వ్యవహారాల శాఖ దృష్టికి తీసుకెళ్లామని.. వారిని తెలంగాణకు రప్పించేందుకు అన్ని విధాల కృషి చేస్తున్నామని తెలిపారు. మీరు ఇబ్బంది పడుతున్నారనే విషయం మా దృష్టికి వచ్చిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్లామని జోర్డాన్‌లో చిక్కుకుపోయిన వారికి హరీశ్‌రావు వివరించారు. ఎలాగైనా మిమ్మల్ని తెలంగాణకు తీసుకువచ్చే కృషి చేస్తున్నాం.. అధైర్య పడవద్దని ధైర్యం చెప్పారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఏడాది క్రితం ఉపాధి కోసం 12 మంది వలస కార్మికులు జోర్డాన్‌కు వెళ్లారు. వీరిలో నిర్మల్, కామారెడ్డి, నిజామాబాద్, జగిత్యాల, సిద్దిపేటకు చెందిన గల్ఫ్ కార్మికులు ఉన్నారు. ఈ క్రమంలో వారి ఇబ్బందులను చెబుతూ ఇటీవల ఒక వీడియోను పంపించారు. అక్కడే ఉండి బతికేందుకు చేతిలో డబ్బులు లేక, కంపెనీ అనుమతి ఇవ్వకపోవడంతో తిరిగి స్వదేశానికి రాలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని హరీశ్‌రావుకు వలస కార్మికులు గోడు వెళ్లబోసుకున్నారు. ఎలాగైనా తమను తెలంగాణలో ఉన్న కుటుంబ సభ్యుల వద్దకు చేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో వారికి హరీశ్‌రావు ఫోన్ చేసి ధైర్యం చెప్పారు.

# రైళ్లలో రహస్యంగా గంజాయి రవాణా

### ప్రత్యేక దృష్టి సారించిన అధికారులు

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో గంజాయి తరలింపుఅనేది సర్వసాధారణంగా మారింది. రోడ్డు మో తన తనిఖీలు జరిగి పట్టుబడుతున్నామన్న ఉద్దేశంతోను గంజాయి సరాఫరా చేసేవారు రైళ్ళను ఎంచుకుంటున్నారు. ప్రస్తుతం ఒడిశ్శా నుంచి హైదరాబాద్‌సహా ఇతర ప్రాంతాలకు సరఫరా ఆవుతున్న గంజాయిలో అధిక భాగం రైళ్ల ద్వారానే చేరుకుం టోందని పలు సంఘటనలు రుజువు చేస్తున్నాయి. గత రెండు సంవత్సరాల్లో రేళ్ళలో ఏకంగా 7వేల కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.అయితే సరఫరా అవుతున్న గంజాయిలో నామమాత్రంగానే పోలీసులకు చిక్కుతోంది. అంటే నిత్యం వందల కిలోల గంజాయి రైళ్ళలోనే హైదరాబాద్‌కు చేరుతోంది.దీంతో రైల్వేశాఖను కేంద్రం అప్రమత్తం చేసింది. దీంతో రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్(ఆర్‌పిఎఫ్) గంజాయిను స్వాధీనం చేసుకునేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించింది. గవర్నమెంట్ రైల్వే పోలీస్ (జీఆర్‌పి)తో పాటు స్థానిక పోలీసులతో ప్రత్యేక సమన్వయ వ్యవస్థను సిద్దం చేసుకుంటోంది. సికింద్రాబాద్, హైదరాబాద్, కాజీపేట, వరంగల్, ఖమ్మం, లింగంపల్లి, నల్గొండ, నిజామాబాద్, వికారాబాద్ స్టేషన్‌లలో ఎక్కువశాతం గంజాయి పట్టుబడుతుండగా, కోణార్క్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం నుంచి ముంబాయి వెళ్ళే ఎల్‌టిటి ఎక్స్‌ప్రెస్, కోరమండల్ ఎక్స్‌ప్రెస్, చార్మినార్ సూపర్‌ఫాస్ట్, ఏపీ ఎక్స్‌ప్రెస్, నవజీవన్ ఎక్స్‌ప్రెస్, లక్నో,జాన్సీ ఎక్స్‌ప్రెస్ ,హైదరాబాద్ పూర్ణ ఎక్స్‌ప్రెస్, రాయచూర్ ఎక్స్‌ప్రెస్, అమృత్ సర్ ఎక్స్‌ప్రెస్,గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్,సంబల్‌పూర్ నాంధేడ్ ఎక్స్‌ప్రెస్‌లలో గంజాయి సరఫరా జరుగుతూనే ఉంది.గంజాయి సరఫరాను ఎన్ని విధాలుగా అడ్డుకున్నా అది మాత్రం గుట్టు చప్పుడు కాకుండా ఎక్కడకు చేరాలో అక్కడికే చేరుకుంటోంది. ముఖ్యంగా రైలు మార్గంలో గంజాయి రవాణాను అరికట్టేఉందుకు ఎక్సైజ్ అధికారులు పలు మార్లు సంబంధిత ఉన్నతాధికారులతో కూడా సమావేశాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఉదాహారణకు కొద్ది రోజుల క్రితం



లింగంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలోని కోణార్క్ ఎక్స్ ప్రెస్ చేరుకుంది. దిగేందుకు, ప్రయాణికులు సిద్ధమయ్యారు. ఇంతలో ఆర్‌పిఎఫ్‌ల పోలీసులు ఒక కోచ్‌లోకి చేరుకున్నారు. చుట్టూరా పరిశీలిస్తుండగా, ప్రయాణికులు సమీపంలో లేకుండా కొన్ని బ్యాగులు కని సించాయి. అనుమానం వచ్చి, వాటిని చెక్ చేయగా, అందులో 85 కిలోల గంజాయి పొడి ఉన్న ప్యాకెట్లు కనిపించాయి. ఇంతలో ఓ ప్రయాణికుడు ఎలాంటి లగేజీ లేకుండా మరో కోచ్లో హడావుడిగా వెళుతుండగా, గమనించి పట్టుకున్నారు. ఆరాతీస్తే.. ఒడిశా నుంచి తానే గంజాయిని తెచ్చానని, హైదరాబాద్ లోని ధూల్‌పేటకు తరలిస్తు న్నానని చెప్పాడు. మరో కేసులో సాధారణ తనిఖీలు చేస్తుండగా కాచిగూడ రైల్వేస్టేషన్ పార్శిల్ గది నుంచి ఏడు వ్యాగులు తరలిస్తున్న ఐదుగురి కదలికల్లో అనుమానం రావటంతో అవి తనిఖీ చేయగా, ఆ ఏడు బ్యాగుల్లో 120 కిలోల గం జాయి వెలుగు చూసింది. ఒడిశా నుంచి తీసుకొన్ని కాచిగూడ పార్శిల్ ఆఫీసులో ఉంచి అక్కడి నుంచి దాన్ని హైదరాబాద్‌లోని తిలక్‌నగర్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. వారంతా స్థానికులు అయినప్పటికి బ్యాగులను కాచిగూడ స్టేషన్ వరకు తరలించింది మాత్రం ఒడిశ్శాకు చెందినవారు కావడం గమనార్హం.అదే విధంగా వరంగల్ రైల్వేస్టేషన్ రెండు పర్యాయాలు 60 కిలోల చొప్పున గంజాయి దొరికింది. నవజీన్ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి తరలిస్తున్న ముగ్గురిని, కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రెండో కోచ్‌లో మగ్గుర్ని పోలీసులు అరెస్టు చేశారు. పెరుగుతున్న కేసులను దృష్టిలో ఉంచకుని రైల్వే పోలీసులు ప్రత్యేకంగా కొంతమంది సిబ్బందిని కేటాయిం చింది. గంజాయి సరఫరాను కనుగొనే బాధ్యతను వారికి అప్పగించింది.గంజాయి తరలింపే లక్ష్యంగా పని చేస్తున్న కొంత మందిని గుర్తించి వారికి సంబంధించి ఫోటోలతో కూడిన వివరాలను సిబ్బందికి అందచేసింది. అంతే కాకుండా సిసిటివి కెమెరాలద్వారా, ఆధునిక పరిజ్ఞానాన్ని కూడా వారి గుర్తిచేందుకు ఉపయోగి స్తున్నారు. కేవలం ప్రయాణికులు రైళ్ళలనే కాకుండా సరుకు రవాణా రైళ్ళలో కూడా వాటి సరఫరా జరుగుతోందని గుర్తించారు. దానిలో భాగంగా సరుకు రవాణా వ్యాగన్లపై కూడా ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు న్విర్వహిస్తున్నారు.


# ప్రాణం గాలిలో.. బిల్లు లక్షల్లో!

- ఎఐజిలో లివర్ ట్రాన్స్‌ప్లాంట్ చేసుకున్న వ్యక్తి మృతి
- ఆస్పత్రి ముందు బంధువుల ఆందోళన



ఆస్పత్రి ముందు ఆందోళన చేస్తున్న కుటుంబసభ్యులు, బంధువులు

**హైదరాబాద్ (గచ్చిబౌలి), అక్టోబరు 12, ప్రభాతవార్త:** గచ్చిబౌలిలోని ఎఐజి ఆస్పత్రిలో దారుణం చోటుచేసుకుంది. లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం ఆస్పత్రిలో చేరిన వ్యక్తి సర్జరీ తర్వాత మృతి చెందారు. డాక్టర్ల నిర్లక్ష్యం కారణంగానే ప్రాణం పోయిందని, బిల్లు ఎక్కువగా వేశారని రోగి బంధువులు ఆందోళనకు దిగారు. మాదాపూర్ డిసిపి రీతురాజ్ ఆందోళనకారులకు సర్దిచెప్పి కేసు నమోదు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని చింతల్‌కు చెందిన ము రళి(40) కాలేయం చెడిపోవడంతో ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం ఆగస్టు 26న గచ్చి బౌలిలోని ఎఐజి ఆస్పత్రిలో చేరారు. లివర్‌ను దానం చేసేందుకు మురళి భార్య ముం దుకువచ్చారు. మొత్తం 35 లక్షలు ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పగా అందుకు వారు అంగీక రించారు. ఆగస్టు 28న మురళికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ జరిగింది. అప్పటి నుంచి ఆయన పూర్తిగా కోలుకోకపోవడంతో ఆస్పత్రిలోనే ఉంచి చికిత్స అందిస్తు న్నారు. కాగా మురళి ఆరోగ్యం పూర్తిగా క్షీణించి శనివారంరాత్రి ఆస్పత్రి లోనే మృతి చెందాడు. ఆస్పత్రి యాజమాన్యం రూ.49 లక్షల బిల్లు వేసిందని, ఇప్పటికే రూ. 35 లక్షలు చెల్లించినా మురళి బతుకలేదని బాధిత కుటుంబసభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. డాక్టర్ల నిర్లక్ష్యం కారణంగానే మురళి మృతి చెందారని, అధికం గా బిల్లు వేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే ఆపరేషన్‌కు ముందు లివర్ కోసం మురళి కుటుంబసభ్యులు జీవన్ దాన్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు తెలి పారు. కానీ డాక్టర్లు ఆయన వయస్సు 40కు బదులు 60 వేయడంతో డోనర్లు ముందుకు రాలేదని తెలిపారు. జీవన్‌దాన్‌లో అవకాశం వస్తే 7 లక్షల బిల్లు తగ్గేదన్నారు. ఆస్పత్రి నిర్లక్ష్యం కారణంగానే జీవన్‌దాన్‌లో అవకాశం కోల్పోయా మన్నారు. బాధితుల ఆందోళనతో రాయదుర్గం పోలీసులు ఆసుపత్రికి చేరుకొని పరిస్థితిని పర్యవేక్షి ంచారు. బాధి తుల ఫిర్యాదు మేరకు ఆస్పత్రి నిర్లక్ష్యంపై కేసు నమోదు చేస్తామని రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ సిహెచ్ వెంకన్న బాధితులకు తెలిపారు.



# జాతీయ రహదారిపై ఐదు వాహనాలు ఢీ

### నలుగురు మృతి.. మరికొందరికి గాయాలు

**చెన్నై, అక్టోబరు 12:** తమిళనాడులో జరిగిన ఘోర ప్రమాదంలో నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఆదివారం తెల్లవారు జామున కృష్ణగిరి జిల్లా హోసూరు సమీపంలోని బెంగళూరు - చెన్నై జాతీయ రహదారిపై ఒకేసారి ఐదు వాహనాలు ఢీకొన్నాయి. వేగంగా వెళ్తున్న ఓ కారు ట్రక్కును ఢీకొట్టింది. దీంతో వెను కనే ఉన్న ఉన్న మరో మూడు కార్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. ప్రమా దానికి గురైన కారు హోసూరు నుంచి కృష్ణగిరి వైపు వెళ్తున్నట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ రోడ్డు ప్రమాదంతో బెంగళూరు - చెన్నై జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ట్రాఫిక్‌ను క్రమ బద్ధీకరించేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. మృతుల్లో ఒకరిని ముకిలాన్(30)గా గుర్తించారు. ప్రస్తుతం బెంగళూరులోని ఓ ప్రయివేటు కోచింగ్ సెంటర్‌లో యూపీఎస్సీ పరీక్షల కోసం ప్రిపేరవుతున్నట్లు తెలిసింది. మరో ముగ్గురి వివరాలు తెలియాల్సి ఉంది. మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం హోసూరు హాస్పిటల్‌కు తరలించారు.

# పాప్‌స్టార్‌తో కెనడా మాజీ ప్రధాని డేటింగ్!

**టొరంటో, అక్టోబరు 12:** కెనడా మాజీ ప్రధాని జస్టిన్ ట్రూడో(53)కు సంబంధించిన విడియో ఇపుడు సోషల్‌మీడియాలో వైరల్ అవుతోంది. ఆయన పాప్ స్టార్ పెర్రీకి ముద్దులు పెడుతున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కెనడా మాజీ ప్రధాని జస్టిన్ ట్రూడో (53) పదవిలో లేనప్పటికీ ఏదో ఒక అంశంతో తరచూ వార్తల్లో నిలుస్తుంటారు. ఇటీవల వరల్డ్ ఫేమస్ పాప్ సింగర్ కేటీ పెర్రీ(40) తో ట్రూడో డేటింగ్ లో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. వాటిని నిజం చేస్తూ..తాజాగా వారిద్దరు ముద్దులు పెట్టుకున్న ఫొటోలు బయటకు వచ్చాయి. కాలిఫోర్నియాలోని శాంటా బార్బరాలో ఓ బోటులో వారిద్దరు కిస్ చేసుకుంటూ కనిపించారు. ఇక వైరల్ అవుతోన్న ఫొటోలను చూసినట్లు అయితే పెర్రీ నల్లటి స్విమ్ సూట్‌లో ఉండగా షర్ట్ లేకుండా ట్రూడో ఉన్నారు. అంతేకాక వారిద్దరూ కౌగిలించుకుంటున్నారు. ట్రూడో పెర్రీ చెంపకు ముద్దు పెడుతున్నట్లు ఆ పిక్స్ లో కనిపిస్తుంది. ఈ సన్నివేశాలను ఓ ప్రత్యక్ష సాక్షిచూసి సోషల్ మీడియాలో పోస్టుచేసాడు. తొలుత ట్రూడో, పెర్రీ ఉన్న బోటును దూరంగా చూసి దగ్గర వెళ్లిన తరువాత తాను ధృవీకరించుకున్నట్లు సదరు వ్యక్తి పేర్కొన్నారు. మొత్తంగా వారిద్దరి డేటింగ్ పుకార్లకు ఈ ఫొటోలు బలాన్ని చేకూరుస్తున్నాయి. గతంలో జూలై 28న మోంట్రియాల్‌లోని ప్రముఖ రెస్టారెంట్లో వీరిద్దరూ కలిసి డిన్నర్ చేశారు. అందుకు సంబంధించిన చిత్రాలు వెలుగులోకి రావడంతో వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారనే తొలుత వార్తలు వచ్చాయి. పెర్రీ, యాక్టర్ ఓర్లాండో బ్లూమ్ తో ఏడేళ్లు కలిసి జీవించింది. అంతేకాక నిశ్చితార్థం కూడా జరిగింది. అయితే వివిధ కారణాలతో ఈ ఏడాది జూన్‌లో వారి నిశ్చితార్థం రద్దైంది.



## గంజాయి నిర్మూలనకు డ్రోన్ పర్యవేక్షణ

**కెరిమెరి, అక్టోబరు 12, ప్రభాతవార్త:** మండల పరిధిలో గంజాయి సాగు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి, వాటిని పూర్తిగా నిర్మూలించేందుకు పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటామని కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా ఏఎస్పీ చిత్త నిరంజన్ అన్నారు. ఈ క్రమంలో ఆదివారం డ్రోన్ సహాయంతో పంటభూములపై పర్యవేక్షణ నిర్వ హించారు. డ్రోన్ సర్వే ద్వారా గంజాయి మొక్కలు సాగు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి, సంబంధిత మండల పోలీస్ అధికారులు, ఎక్సైజ్ రెవెన్యూ శాఖలతో సమన్వయం చేసుకుని వెంటనే నిర్మూలన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ నేపథ్యంలో కెరిమెరి మండలం అంతపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని నారాయణ గూడ గ్రామానికి చెందిన రాథోడ్ బాలాజీ అనే వ్యక్తి వ్యవసాయ పొలంలో 51 గంజాయి మొక్కలు గుర్తించారు. ఆ మొక్కలను పోలీసులు స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు ఏఎస్పీ మాట్లాడుతూ మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా, అమ్మకం, వినియోగం చట్టపరంగా తీవ్ర నేరమని, ఈ అక్రమ కార్యకలాపాల్లో పాల్గొన్న వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# అభివృద్ధికి చిహ్నంగా ముందుకెళ్తోన్న రియల్ ఎస్టేట్



### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

### సెప్టెంబరులో రిజిస్ట్రేషన్లలో 35 శాతం పెరుగుదల

### రియల్ ఎస్టేట్‌లోనే ఎక్కువ మందికి ఉపాధి

### ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 12:** రాష్ట్రంలో అభివృద్ధికి చిహ్నంగా రియల్ ఎస్టేట్ ముందుకువెళ్తోందని, కేంద్ర ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనను చాలా కీలకంగా ముందుకు తీసుకెళ్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు, తెలంగాణలో రోడ్ల అభివృద్దికి రూ.లక్ష 80వేల కోట్ల చేస్తున్నామన్నారు. మన దేశం అభివృద్ధి చెందిన దేశాల సరసన ఉండాలని ప్రధాని నరేంద్రమోడీ కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ఆదివారం నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలెప్ మెంట్ కౌన్సిల్ (నారెడ్కో) తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో హైటెక్స్ లో నిర్వహిస్తున్న 15వ నారెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షో ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. 2047లక్ష్యంగా పెట్టుకుని అభివృద్ది చెందిన దేశాల వరుసలో మన దేశం ఉండాలని పేర్కొన్నారు. దేశంలో ప్రతి శాఖకు మౌలిక సదుపాయాల కల్పనకు బడ్జెట్‌లో అత్యధిక కల్పన చేస్తున్నామ న్నారు. ప్రపంచంలో 4వ ఆర్థిక ఎకనామిగా అభివృద్ధి చెందుతున్నామని, ప్రధాని నరేంద్ర మోడీ సంస్కరణలు లేకుండా అభివృద్ధి పనులు చేయమని పేర్కొంటున్నారని తెలిపారు. 331 లక్షల కోట్లకు మన దేశ జిడిపి పెరిగిందని, 20 మంది ప్రజలు దారిద్ర్య రేఖ నుంచి బయటకు వచ్చారని తెలిపారు. అవినీతి లేని పాలన మోడీ అందిస్తున్నారని, గతంలో ఎన్నడూ లేని విధంగా ధరలు తగ్గించారని పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ సెక్టార్‌లో రెరా యాక్ట్ మైల్ స్టోన్‌గా ఉపకరిస్తుందని, జిఎస్‌టీ స్లాబ్ తగ్గడంతో రియల్ ఎస్టేట్‌కు బాగా లాభం జరిగిందని పేర్కొన్నారు.

2024-25లో రియల్ ఎస్టేట్, వృత్తిపరమైన సేవల రంగం 15.4 శాతం వృద్ధి రేటును నమోదు చేసింది. 11.97 శాతం వృద్ధి రేటుతో నిర్మాణ రంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు రూ.80వేల కోట్లకు పైగా సమకూర్చింది. స్టేట్ సర్వీసెస్ జీఎస్ డీపీలో ఈ రెండు రంగాల వాటానే 24.9 శాతంగా ఉంది అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ - మల్కాజ్ గిరి జిల్లాల పరిధిలో 2024 సెప్టెంబర్ లో రూ.2820 కోట్ల విలువైన 4903 ఇళ్ల రిజిస్ట్రేషన్ జరిగింది. ఈ ఏడాది సెప్టెంబర్ లో రూ.4804 కోట్ల విలువైన 6612 ఇళ్ల రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. ఇది 35 శాతం అధికం. విలువలో వార్షిక వృద్ధి 70 శాతంగా నమోదయ్యింది. ఇవి కేవలం గణాంకాలు కాదు, రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ కుదేలయ్యిందంటూ మాపై దుష్ప్రచారం చేస్తున్న వారికి ధీటైన సమాధానాలు అని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ సెప్టెంబర్ లో రూ.కోటిపైన విలువైన ఆస్తుల రిజిస్ట్రేషన్లలో 151 శాతం పెరుగుదల ఉంది. మొత్తం విక్రయాల్లో విలువ పరంగా వీటి వాటానే 53 శాతం అని చెప్పారు. భారత్‌లో వ్యవసాయం తర్వాత ఎక్కువ మంది రియల్ ఎస్టేట్ రంగంలోనే ఉపాధి పొందుతున్నారు. అయితే... అభివృద్ధి చెందిన దేశాల జీడీపీలో స్థిరాస్తి రంగ వాటా సగటున 10 శాతం 15 శాతం కాగా... చైనాలో అత్యధికంగా 23 శాతం నుంచి 25 శాతం వరకుంది. మన దేశంలో ఇది 6 శాతం నుంచి 8 శాతమే. ఇది మరింత పెరగాల్సిన అవసరముంద్ధి అని అభిప్రాయపడ్డారు. ఎలివేటెడ్ కారిడార్లు, మెట్రో ఫేజ్ - 2, భారత్ ఫ్యూచర్ సిటీ, మూసీ సుందరీకరణ, రీజినల్ రింగ్ రోడ్డు తదితర ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులతో తెలంగాణ రూపురేఖలు మారిపోనున్నాయి. డిసెంబర్ నాటికి ఫ్యూచర్ సిటీలో జోనలైజేషన్ ప్రక్రియను పట్టలెక్కించాలనే పట్టుదలతో ఉన్నాం. అక్కడే 200 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయనున్న ఏఐ సిటీకి రెండు, మూడు నెలల్లోనే భూమి పూజ చేయబోతున్నాం అని వివరించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న రియల్ ఎస్టేట్ రంగానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

## నేడు జూబ్లీహిల్స్ ఎన్నికల నోటిఫికేషన్

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), అక్టోబరు 12, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికకు సంబంధించి నేడు గెజిట్ నోటిఫికేషన్ విడుదల కానుంది. అనంతరం వెంటనే నామినేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని జూబ్లీహిల్స్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి. సాయిరాం తెలిపారు. ఫారం 2బి(నామినేషన్), ఫారం 26(అఫిడవిట్- అన్ని కాలమ్స్ తప్పనిసరి, నోటరైజ్ చేయాలి)లతో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయాలన్నారు. ఈ నెల 21 వరకు నామినేషన్లను స్వీకరిస్తామన్నారు. పబ్లిక్ హాలిడేలు, రెండో, నాల్గో శనివారాలు మినహాయించి నామినేషన్లను దాఖలు చేయవచ్చని అన్నారు. అభ్యర్థి కనీస వయసు 25 ఏళ్లు ఉండాలని, ప్రతిపాదకులు తప్పనిసరిగా ఉండాలని, గుర్తింపు పొందిన పార్టీ అభ్యర్థులకు నియోజకవర్గ ఓటరుగా ఉన్న వారు ప్రతిపాదకుడిగా ఉండాలన్నారు. స్వతంత్ర, గుర్తింపు లేని పార్టీ అభ్యర్థులకు పది మంది ప్రతిపాదకులు నియోజకవర్గం లోని ఓటర్లై ఉండాలన్నారు. ఇతర నియోజకవర్గ అభ్యర్థులు సంబంధిత ఈఆర్‌ఓ నుండి ఓటర్ల వివరాలు సమర్పించాలన్నారు. ఎన్‌కోర్ పోర్టల్ ద్వారా డిజిటల్ నామినేషన్ దాఖలు చేయవచ్చని ఇందుకోసం ఎన్‌కోర్ వెబ్‌సైట్ ద్వారా నామినేషన్ ఫారం ఆన్‌లైన్‌లో సమర్పించాలన్నారు. క్యూఆర్ కోడ్‌తో కూడిన ప్రింటెడ్ హార్డ్‌కాపీని తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు. ఆన్‌లైన్ డిపాజిట్ బ్యాంక్ /ట్రెజరీలో క్రెడిట్ అయ్యి ఉండాలని లేదంటే మాన్యువల్‌గా డిపాజిట్ చేయాలన్నారు. అయిదుగురు వ్యక్తులకే ప్రవేశం ఉంటుందని, ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయానికి 100 మీటర్ల పరిధిలో గరిష్టంగా మూడు వాహనాలకే అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. అభ్యర్థులు తప్పనిసరిగా నిబంధనలను పాటించాలని ఆయన స్పష్టం చేశారు.

# తెర

## అక్కినేని కుటుంబరావు

## అందరిలోనూ ఆలోచనను రేకెత్తించేలా తెరకెక్కించా

రోహిణి హట్టంగడి, రోహిణి మొల్లేటి, సముద్రఖని, హిమాంశు పోపూరి, సౌమ్య, అనన్య నన్నపనేని ప్రధాన పాత్రలో రానున్న చిత్రం 'ఒక మంచిప్రేమ కథ'. ఈ చిత్రాన్ని హిమాంశు పోపూరి నిర్మిస్తుండగా.. అక్కినేని కుటుంబరావు తెరకెక్కించారు. ఈ మూవీకి కథ, మాటలు, పాటల్నిఓల్గా అందించారు. ఈ సినిమాకు లక్ష్మీ సౌజన్య ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో,.నటి రోహిణి మొల్లేటి మాట్లాడుతూ, కోర్ట్' సినిమాతో ఆడియెన్స్ ముందుకు వచ్చాను. ఎప్పుడూ మంచి కథలతో ప్రేక్షకుల ముందుకు రావడం ఆనందంగా ఉంది. ఇప్పుడు 'ఒక మంచి ప్రేమ కథ'తో రాబోతోన్నాను. ఓల్గా రాసిన కథ నాకు చాలా నచ్చింది. నేను, రోహిణి చాలా ఏళ్ల క్రితం కలిసి నటించాం.. ఈ చిత్రంలో అందరూ అద్భుతంగా నటించారు. మేం అడిగిన వెంటనే సపోర్ట్ చేసిన సముద్రఖనికి థాంక్స్. మా సినిమాను ముందుకు తీసుకు వెళ్తున్న ఈటీవీ విన్ టీంకు థాంక్స్‌అని అన్నారు.

సీనియర్ నటి రోహిణి హట్టంగడి మాట్లాడుతూ,ఇరవై ఏళ్ల క్రితం కుటుంబరావు, ఓల్గా ఓ సినిమా కోసం అప్రోచ్ అయ్యారు. ఈ కథనాకెంతో నచ్చింది. ఈసినిమా నా మనసుకి హత్తుకుంది. ఇంత మంచి చిత్రంలోనన్నుపార్ట్ చేసిన కుటుంబ రావుకి,ఓల్గాకి థాంక్స్. మాసినిమాను రిలీజ్ చేస్తున్న ఈటీవీ విన్‌కు థాంక్స్ .ఒక మంచి ప్రేమకథ లాంటి మంచి చిత్రానికి మంచి ఓటీటీ ఫ్లాట్‌ఫాం లభించింది అనిఅన్నారు . ఇక హిమాంశు వచ్చిన ఈ కథను సినిమాగా తీయాలని పట్టుబట్టారు. రోహిణి మొల్లేటిముందు నుంచీ ఈ కథతో ప్రయాణం చేశారు. మా ప్రాజెక్ట్‌లోకి రోహిణి హట్టంగడి రావడంతో ఆనందమేసింది. సముద్రఖని ఎంత బిజీగా ఉన్నా కూడా మాకు డేట్లు ఇచ్చారు. మంచి సినిమా రావాలని కోరుకునే ఆర్టిస్టులు మాకు దొరకడం మా అదృష్టం. ఈటీవీ విన్ మా సినిమాను తీసుకోవడం మరో అదృష్టం. 1985 నుంచి 2017 వరకు నేను రాసిన ప్రతీ నవల చతురలో వచ్చింది. నేను ఉషా కిరణ్ మూవీస్ బ్యానర్‌లోనూ చాలా కాలం పని చేశాను. మళ్లీ ఇప్పుడు నా సినిమా ఈటీవీ విన్‌లో రావడం ఆనందంగా ఉంది. పెద్దవాళ్లందరూ కలిసి నటించిన చిత్రమే అయినా ఇది యువతరానికి సంబంధించిన కథఅని అన్నారు. దర్శకుడు అక్కినేని కుటుంబరావు మాట్లాడుతూ ,సినిమాకి స్క్రిప్ట్ ఎంత ముఖ్యమో.. ఆర్టిస్టులు అంత ముఖ్యం ఆ తరువాత టెక్నీషియన్లు మరింత ముఖ్యం. గుమ్మడి గారికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో 'తోడు' సినిమాలో రోహిణి హట్టంగడిని తీసుకు లేకపోయాను. అయినా సరే ఆమెకు 37 ఏళ్ల తరువాత ఈ కథ




చెప్పడానికి వెళ్లాను. రోహిణి మొల్లేటిలేకపోతే ఈ చిత్రం ముందుకు వచ్చేది కాదు. సముద్రఖని ఎంత బిజీగా ఉన్నా కూడా మాకు సపోర్ట్ చేశారు. మధు అంబట్, రాధాకృష్ణన్, లెనిన్ లేకపోతే ఈ చిత్రం లేదు. ఓల్గా మంచి కథను, మాటల్ని, పాటల్ని ఇచ్చారు. కోట్లు సంపాదించేందుకు పరుగులు పెడుతున్నారు.. కానీ తల్లిదండ్రుల్ని పట్టించుకోవడం లేదు. అందరిలోనూ ఆలోచనను రేకెత్తించేలా ఈ సినిమాను తెరకెక్కించాను. ఎక్కడా బోర్ కొట్టించకుండా నవ్విస్తూ, ఏడ్పించేలా ఈ మూవీని తీశాను. ఈటీవీ విన్‌లో మా సినిమా వస్తుండటం ఆనందంగా ఉంది. మా కోసం వచ్చిన ప్రభు కి థాంక్స్ అని అన్నారు.

## బాలీవుడ్‌లో బంపరాఫర్ కొట్టేసిన మీనాక్షి చౌదరి



బాలీవుడ్‌లో బంపరాఫర్ కొట్టేసిన మీనాక్షి చౌదరి 'లక్కీ భాస్కర్', 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలతో వరుస విజయాలు అందుకున్న మీనాక్షి చౌదరికి బాలీవుడ్ నుండి భారీ ఆఫర్ వచ్చింది. హిట్ ఫ్రాంచైజీ 'ఫోర్స్' మూడో భాగంలో హీరో జాన్ అబ్రహం సరసన కథానాయికగా ఆమెను ఎంపిక చేశారు. ఇప్పటికే కథ విన్న మీనాక్షి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. విపుల్ అమృత్‌లాల్‌షా, జాన్ అబ్రహం నిర్మాణంలో, దర్శకుడు నిషికాంత్ కామత్ తెరకెక్కించే ఈ చిత్రం ద్వారా మీనాక్షి హిందీ చిత్రసీమలో అడుగు పెడుతున్నారు. వరుసగా టాలీవుడ్ విజయాల తరువాత, ప్రస్టేజియస్ ప్రాజెక్ట్‌తో బాలీవుడ్‌లో హీరోయిన్‌గా లాంచ్ అవుతుండటంతో మీనాక్షి ఆనందానికి అవధుల్లేవు.

## గమ్మత్తుగా 'లవ్ ఓటిపి' ట్రైలర్



సూపర్ ఇంట్రెస్టింగ్ పేస్‌తో 2 నిమిషాల 27 సెకన్ల ట్రైలర్‌ను విడుదల చేసిన లవ్ ఓటిపి టీమ్. ఒకరికి తెలియకుండా మరొకరిని ఇలా ఇద్దరమ్మాయిలను ఒకేసారి ప్రేమించి ఇబ్బందిపడే అబ్బాయిల కథలా ఉంది 'లవ్ ఓటిపి' ట్రైలర్. ప్రేమంటే అస్సలు పడని నాన్న పాత్రలో బెంగుళూరులో ఉండే పోలీసాఫీసర్‌గా రాజీవ్ కనకాల నటించారు. భవప్రీతా ప్రొడక్షన్స్ పతాకంపై విజయ్ యం రెడ్డి నిర్మాతగా అనీష్, జాన్విక, స్వరూపిణిలు హీరో హీరోయిన్లుగా నటించిన 'లవ్ ఓటిపి' చిత్రం అతి త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్న సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్ర యూనిట్. ఈ సందర్భంగా నిర్మాత విజయ్ యం రెడ్డి మాట్లాడుతూ, ఫ్రెష్ కంటెంట్‌తో వచ్చిన ఏ సినిమాకైనా ఫుల్ డిమాండ్ ఉంటుంది అని అందరికి తెలుసు.

## ఆడియన్స్ ఇచ్చిన రెస్పాన్స్ మరిచిపోలేను



డైరెక్టర్ రిషబ్ శెట్టి

రిషబ్ శెట్టి బిగ్గెస్ట్ పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ కాంతార: చాప్టర్ 1. ప్రఖ్యాత పాన్ ఇండియా నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబర్ 2న విడుదలైన అన్ని వర్గాల ప్రేక్షకులని ఆకట్టుకొని ఘన విజయాన్ని అందుకుంది. తొలి వారంలో ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 509 కోట్ల గ్రాస్ కలెక్ట్ చేసి కొత్త బెంచ్ మార్క్ ని క్రియేట్ చేసింది. కాంతార: చాప్టర్ 1 విజువల్ వండర్ గా ప్రేక్షకులని మెస్మరైజ్ చేస్తోంది. ప్రేక్షకులు విమర్శకుల నుంచి అద్భుతమైన ప్రశంసలు అందుకుంది. పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ కాంతరకి ప్రీక్వెల్‌గా వచ్చిన కాంతార: చాప్టర్ 1 ప్రస్తుతం బాక్సాఫీసు వద్ద సంచలనం సృష్టిస్తూ సక్సెస్ ఫుల్ గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా హీరో, దర్శకుడు రిషబ్ శెట్టి విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. కాంతార: చాప్టర్ 1తో చాలా పెద్ద విజయాన్ని అందుకున్నారు.. కంగ్రాజులేషన్స్. థాంక్యూ అండి. తెలుగు ప్రేక్షకులకి హృదయపూర్వక కృతజ్ఞతలు. చాలా అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. కాంతారకి ఎంత మంచి రెస్పాన్స్ వచ్చిందో ఈ సినిమా కూడా అంత గొప్ప రెస్పాన్స్ ఇచ్చారు. నా జర్నీలో సపోర్ట్ చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నాను

**ప్రీక్వెల్ ఆలోచన ముందు నుంచే ఉందా?**

కాంతార చేసినప్పుడే ఈ ఆలోచన కూడా ఉంది. కాంతారాకి వచ్చిన అద్భుతమైన రెస్పాన్స్ చూసి ప్రీక్వెల్ స్క్రిప్ట్ రాయడం మొదలుపెట్టాం.

**కాంతారతో జానపద కథలకు మళ్లీ పునర్వైభవం తీసుకొచ్చారని ప్రశంసలు రావడం ఎలా అనిపించింది?**

చాలా ఆనందంగా వుంది. కథని చాలా నిజాయితీగా చెప్పాలనుకున్నాం. అది ప్రేక్షకులకు నచ్చింది. ఇండియా జానపద కథలకు నిలయం. ఈ సినిమా విజయం మరిన్ని జానపద కథలు రావడానికి అవకాశం కల్పించడం చాలా ఆనందంగా ఉంది.

నాకు జానపద కథలు చేయడం ఇష్టం. కాంతార మా ప్రాంతంలో జరిగిన కథ. అందుకే లోకేషన్ కూడా మా ప్రాంతంలోనే తీసుకోవడం జరిగింది. నా వైఫ్ ఈ సినిమాకి ఇచ్చిన సపోర్టు మర్చిపోలేను. కాస్ట్యూమ్ డిజైనర్ గా తన కాంట్రిబ్యూషన్ మాకు ఎంతగానో హెల్ప్ అయింది.

**రుక్మిణి వసంత్ పాత్ర గురించి?**

రుక్మిణి ప్రీవియస్ సినిమాలు చూసి సెలెక్ట్ చేశాను. అలాగే గుల్షన్ దేవయ్య ,జయరాం గారి పాత్రలు కూడా అద్భుతమైన ఆదరణ పొందాయి. ప్రతి ఒక్కరూ తమ పాత్రలకు పూర్తి న్యాయం చేశారు। కానీ ఫస్ట్ ప్రిఫరెన్స్ అంటే దర్శకత్వానికి ఇస్తాను.

**అజినిష్ మ్యూజిక్ గురించి?**

అజినిష్ సినిమాకి చాలా డిఫరెంట్ గా కంపోజిషన్ చేశారు.

## మాస్ అవతార్ 'కాటలన్' ఫస్ట్‌లుక్



యాక్షన్ థ్రిల్లర్ "కాటాలన్" ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైంది. క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై షరీఫ్ మహమ్మద్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో హీరోగా అంటోని వర్గీస్ పెపే మాస్ అవాతర్ లో కనిపిస్తున్నారు. మంటల చుట్టూ, సిగరెట్‌తో, కళ్లలో జ్వాలలతో కనిపిస్తున్న అతని లుక్ అదిరిపోయింది. రక్తంతో తడిసిన ముఖం, చేతులు యాక్షన్ ఇన్‌టెన్సిటీని సూచిస్తున్నాయి. పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్ .మార్కో" తర్వాత, కాటాలన్ క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్, షరీఫ్ మహమ్మద్ నుంచి మరో భారీ ప్రాజెక్ట్‌గా రూపుదిద్దుకుంటోంది. డెబ్యుటెంట్ డైరెక్టర్ పాల్ జార్జ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాగ్రాండ్ పూజా కార్యక్రమాలలో ప్రారంభమైంది. పాన్‌ఇండియా కాన్సెప్ట్‌గా భారీ స్థాయిలో నిర్మిస్తునారు. థాయ్‌లాండ్ యాక్షన్ సన్నివేశాలను ప్రపంచ ప్రఖ్యాత ఒంగ్‌బాక్ సిరీస్ యాక్షన్ డైరెక్టర్ కెచా ఖాంఫక్డీ తన టీమ్‌తో కలిసి రూపొందించారు. అదే సిరీస్‌లో నటించిన పాంగ్ కూడా ఈ సినిమాలో కనిపించనుంది. సినిమాకు అజనీష్ లోకనాథ్ మ్యూజిక్ అందిస్తున్నారు.

కాటాలన్ లో తెలుగు నటుడు సునీల్ (పుష్ప, జైలర్ 2 ఫేమ్), కబీర్ దుహాన్ సింగ్ (మార్కో), రాపర్ బేబీ జీన్, రాజ్ తిరందాసు (పుష్ప ఫేమ్), బాలీవుడ్ నటుడు పార్థ్ తివారి (కిల్ ఫేమ్), అలాగే మలయాళ సినీ నటులు జగదీష్, సిద్ధిక్, వ్లాగర్‌సింగర్ హనాన్ షా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. కథ, స్క్రీన్‌ప్లేలను జోబీ వర్గీస్, పాల్ జార్జ్, జెరో జేకబ్ సంయుక్తంగా రాశారు. డైలాగ్స్‌ను ఉన్నీ ఆర్. రాశారు.కట్టలన్ సినిమా మలయాళం, తమిళం, తెలుగు, కన్నడ, హిందీ భాషల్లో గ్రాండ్ రిలీజ్ కానుంది. సిబ్బంది:ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ జుమాన్ షెరీఫ్ సినిమాటోగ్రఫీ రెనదివ్ సంగీతం బి. అజనీష్ లోక్‌నాథ్ ఎడిటింగ్ షమీర్ మహమ్మద్‌స్టంట్స్ కేచా ఖంఫక్డీ, యాక్షన్ సంతోష్ ప్రొడక్షన్ డిజైన్ సునీల్ దాస్‌క్రియేటివ్.

## 'తెలుసుకదా' కు యూఏ సర్టిఫికెట్

స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ యూనిక్ లవ్ స్టోరీ తెలుసు కదా" ఈ దీపావళికి ప్రేక్షకులను అలరించే ఒదుకు సిద్ధమవుతోంది. అక్టోబర్ 17న విడుదల కాబోతున్న ఈ సినిమా సెన్సార్ పూర్తి చేసుకొని 'యు/ఎ' సర్టిఫికేట్ పొందింది. ప్రముఖ స్టైలిస్ట్ నీరజ కోన దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టి.జి. విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. సెన్సార్ టాక్ ప్రకారం, చిత్రానికి ఫుల్ పాజిటివ్ రిపోర్ట్స్ రావడంతో సినిమాపై అంచనాలు మరింతగా పెరిగాయి. సినిమా రన్‌టైమ్ 2 గంటల16 నిమిషాలు, ఎలాంటి లాగింగ్ లేకుండా రేసీగా, ఎంటర్‌టైనింగ్‌గా వుంటుంది, సిద్ధు జొన్నలగడ్డ, శ్రీనిధి శెట్టి, రాశీ ఖన్నా పాత్రలు యువతరానికి కనెక్ట్ అయ్యేలా ఈ ప్రేమకథ సాగనుంది. కథలో ఊహించని మలుపులు, భావోద్వేగాలు ప్రేక్షకులు సరికొత్త అనుభూతిని పంచనున్నాయి సిద్ధు తన స్వాగ్ చార్మ్ ఎనర్జీతో ఆకట్టుకోనున్నాడు. శ్రీనిధి, రాశీ గ్లామర్‌తో అలరించబోతున్నారు. వైవా హర్ష తన కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను నవ్వించనున్నారు.



## లాపత్తా లేడీస్‌కు 13అవార్డులు..!

### ఉత్తమనటుడు అభిషేక్ బచ్చన్
### ఉత్తమ నటి ఆలియాభట్
### అట్టహాసంగా 70వ ఫిలింఫేర్ అవార్డుల ప్రధానోత్సవం






70వ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ వేడుకలు అహ్మదాబాద్‌లో అట్టహాసంగా జరిగాయి. షారుక్ ఖాన్, కరణ్ జోహార్, మనీష్ పాల్ హోస్ట్‌లుగా వ్యవహరించారు. 2024 సంవత్సరంలో విడుదలైన సినిమాలను ఎంపిక చేసి, వివిధ విభాగాలలో అవార్డులు అందజేశారు. ఇందులో 'లాపతా లేడీస్' సినిమా ఏకంగా 13 క్యాటగిరీలలో అవార్డులు సొంతం చేసుకుంది. కిల్ మూవీ 6 అవార్డులతో మెరిసింది. ఉత్తమ నటుడి పురస్కారాన్ని అభిషేక్ బచ్చన్ (ఐ వాంట్ టు టాక్), కార్తీక్ ఆర్యన్ (చందు ఛాంపియన్) స్వీకరించారు.

'జిగ్రా' సినిమాకిగానూ ఉత్తమ నటి అవార్డును అలియా భట్ అందుకున్నారు. జీవితకాల సాఫల్య పురస్కారం జీనత్ అమన్, శ్యామ్ బెనెగల్ (మరణానంతరం)ఆర్‌డి బర్మన్ అవార్డు అచింత్ ఠక్కర్ (జిగ్రా, మిస్టర్ అండ్ మిసెస్ మహి)

బెస్ట్ యాక్టర్ మేల్ రాజ్‌కుమార్ రావ్ (శ్రీకాంత్ మూవీ)బెస్ట్ యాక్టర్ ఫిమేల్ (క్రిటిక్స్ ఛాయిస్)

ప్రతిభ (లాపతా లేడీస్)బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్ మేల్ రవి కిషన్ లాపతా లేడీస్, బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్ ఫిమేల్ ఛాయా కదమ్ లాపతా లేడీస్, బెస్ట్ ఫిల్మ్ (క్రిటిక్స్) ఐ వాంట్ టు టాక్ (సూజిత్ సర్కార్)బెస్ట్ డెబ్యూ యాక్టర్ ఫిమేల్ నితాన్షీ గోయెల్ (లాపతా లేడీస్)బెస్ట్ డెబ్యూ యాక్టర్ మేల్ లక్ష్య (కిల్)బెస్ట్ డెబ్యూ డైరెక్టర్ కునాల్ కెమ్ము (మడ్గావ్ ఎక్స్‌ప్రెస్),

ఆదిత్య సుహాస్ జంభలే (ఆర్టికల్ 370)బెస్ట్ యాక్షన్ సీయాంగ్ ఓహ్,పర్వేజ్ షేక్ (కిల్) బెస్ట్ స్క్రీన్ ప్లే స్నేహ దేశాయ్ (లాపతా లేడీస్)బెస్ట్ స్టోరీ

ఆదిత్య ధర్ మోనాల్ ఠక్కర్ (ఆర్టికల్ 370)బెస్ట్ డైలాగ్స్ స్నేహ దేశాయ్ (లాపతా లేడీస్)బెస్ట్ మ్యూజిక్ ఆల్బమ్ రామ్ సంపత్ (లాపతా లేడీస్)బెస్ట్ లిరిక్స్ ప్రశాంత్ పాండే (లాపతా లేడీస్)బెస్ట్ ప్లేబ్యాక్ సింగర్ మేల్ అర్జిత్ సింగ్‌లు గెలుచుకున్నారు.

## కళాకారులకు కలైమామణి పురస్కారాల ప్రదానం




కళాకారులకు కలైమామణి పురస్కారాలప్రధానంవివిధ విభాగాల్లో 90 మంది కళా కారులకు పురస్కా రాలు పుర స్కారాలు అందుకున్న వారిలో సూర్య, విక్రమ్ ప్రభు తదితరులు కళారంగంలో విశేష కృషి చేసిన ప్రతిభా వంతులను తమిళనాడు ప్రభుత్వ ంసత్కరించింది. చెన్నైలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎం.కే. స్టాలిన్ 2021, 2022, 2023 సంవత్సరాలకు గాను కలైమామణి' పురస్కారాలను ప్రదానం చేశారు. మొత్తం 90 మంది కళాకారులు వివిధ విభాగాలలో ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకున్నారు.2021 సంవత్సరానికి గాను నటనా విభాగంలో ప్రముఖ నటి సాయిపల్లవి ఈ పురస్కారానికి ఎంపిక కాగా, ముఖ్యమంత్రి స్టాలిన్ స్వయంగా ఆమెకు అవార్డును అందజేశారు.అలాగే, నటులు ఎస్.జే. సూర్య, విక్రమ్ ప్రభు తదితరులు కూడా పురస్కారాలు అందుకున్న వారిలో ఉన్నారు.

సంగీతం, నృత్యం, నాటకం, సినిమా వంటి విభాగాల్లో విశేష కృషి చేసిన కళాకారులను ప్రభుత్వం గుర్తించి సత్కరించింది.

## 'మటన్ సూప్ కు వస్తోన్న స్పందన చూస్తే ఆనందంగా ఉంది

### నిర్మాత మల్లిఖార్జున ఎలికా (గోపాల్)



అలుకా స్టూడియోస్, శ్రీ వారాహి ఆర్ట్స్, భవిష్య విహార్ బ్యానర్లపై రామచంద్ర వట్టికూటి దర్శకత్వంలో మల్లిఖార్జున ఎలికా (గోపాల్), అరుణ్ చంద్ర వట్టికూటి, రామకృష్ణ సనపల నిర్మించిన చిత్రం మటన్ సూప్. రమణ్, వర్ష విశ్వనాథ్, జెమినీ సురేష్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కించిన ఈ మూవీ అక్టోబర్ 10న విడుదలై మంచి టాక్‌ను సొంతం చేసుకుంది. ఈ క్రమంలో నిర్మాత మల్లిఖార్జున ఎలికా (గోపాల్) మీడియాతో ముచ్చటించారు. ఆయన ఏం చెప్పారంటే..

**మటన్ సూప్..జర్నీ ఎలా ప్రారంభమైంది?..** నా దర్శకత్వంలో ఓ హారర్ మూవీని నేను ప్రారంభించాను. ఆ ప్రాజెక్ట్ చిత్రీకరణ సమయంలోనే నాకు రామచంద్ర పరిచయం అయ్యారు. ఆయన ఆ కష్టపడే తత్వం నాకు చాలా నచ్చింది.**మటన్ సూప్ చిత్రంలో మీరు ఇచ్చిన సలహాలు, సూచనలు ఏంటి?**

మటన్ సూప్ మూవీకి ముందుగా నేను కో డైరెక్టర్‌గా వచ్చాను. ఆ తరువాత రామచంద్ర ప్యాషన్ చూసి నిర్మించేందుకు ముందుకు వచ్చాను.

**.నిజ జీవితంలో జరిగి ఘటనల్ని తీసుకుని తెరకెక్కించారు కదా.. ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయి?..**

**రియల్‌గా జరిగిన సంఘటనలు కాబట్టి అసలు కథ ఏంటి?**

అన్నది అందరికీ తెలిసిపోయింది. కానీ ఆతెలిసిన కథను మేం కొత్తగా చెప్పాం. స్క్రీన్ ప్లేతో అందరినీ మ్యాజిక్ చేశాం. కథగా ఒకలా ఉంటే.. షూటింగ్ చేసినతరువాత సినిమా మొత్తాన్ని ఎడిటింగ్ టేబుల్ వద్ద మార్చేశాం. మా చిత్రం పేపర్ మీద కాకుండా ఎడిటింగ్ టేబుల్ వద్ద రెడీ అయిందని నేను గర్వంగా చెప్పుకోగలను.

**మటన్ సూప్ ఆర్టిస్టుల గురించి చెప్పండి?**

మా హీరో రమణ్ మాకు ఎంతో సహకరించారు. వర్ష విశ్వనాథ్ ఎప్పుడూ కూడా మమ్మల్ని ఇబ్బంది పెట్టలేదు. జెమినీ సురేష్ ఇచ్చిన సపోర్ట్ ఎప్పటికీ మర్చిపోలేం. గోవింద్ శ్రీనివాస్, శివరాజ్, ఎస్‌ఆర్‌కే, చరణ్, కిరణ్, గోపాల్ మహర్షి, సునీత మనోహర్, మాస్టర్ విహార్, కిరణ్ మేడసాని ఇలా అందరూ మాకు సహకరించారు.

**మటన్ సూప్ సాంకేతిక బృందం గురించి చెప్పండి?**

మటన్ సూప్‌టెక్నికల్ టీం స్ట్రాంగ్ పిల్లర్‌లా నిలబడింది. వెంకీ వీణ పాటలు, ఆర్‌ఆర్ సినిమాకు ప్రధాన బలమైంది. భరద్వాజ్, ఫణీంద్ర విజువల్స్‌కు మంచి పేరు వచ్చింది. టీం అంతా కలిసి చేసిన ఈ మూవీకి మంచి ప్రశంసలు దక్కుతుండటం ఆనందంగా ఉంది. మా సినిమాను ఇంతలా ఆదరిస్తున్న ఆడియెన్స్‌కు థాంక్స్.మటన్ సూప్ కు ఎలాంటి రెస్పాన్స్ వస్తోంది?..మటన్ సూప్ సినిమాకు మంచి స్పందన వస్తోంది. మేం ఊహించినట్టుగానే ఉంది.

**.భవిష్యత్తులో చేయబోతోన్న ప్రాజెక్ట్‌ల గురించి చెప్పండి?**

మా రామచంద్రతోనూ మరో ప్రాజెక్ట్ చేయాలని అనుకుంటున్నాను. త్వరలోనే వాటికి సంబంధించిన వివరాల్ని ప్రకటిస్తాం.

## 'మోగ్లీ 2025' డిసెంబరు12న విడుదల

'బబుల్ గమ్' తో సక్సెస్ ని అందుకున్న హీరో రోషన్ కనకాల'మోగ్లీ 2025'తో ప్రేక్షకులను అలరించ బోతున్నాడు. జాతీయ అవార్డు గ్రహీత, దర్శకుడు సందీప్ రాజ్



(కలర్ ఫోటో)


దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఫారెస్ట్ నేపథ్యంలో సాగే యూనిక్ రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించిన 'మోగ్లీ 2025' ప్రొడక్షన్ చివరి దశలో ఉంది.ఈరోజు, నిర్మాతలు సినిమా విడుదల తేదీని అనౌన్స్ చేశారు. 'మోగ్లీ 2025' డిసెంబర్ 12న థియేటర్లలోకి వస్తుంది. డిసెంబర్ రెండవ వారంలో ఎలాంటి పెద్ద సినిమాలు లేకపోవడం"మోగ్లీ 2025"కు పెద్ద ప్లస్ పాయింట్‌గా కానుంది .నాని వాయిస్ ఓవర్ ఇచ్చిన ఫస్ట్ గ్లింప్స్‌తో ఈ చిత్రం స్ట్రాంగ్ బజ్‌ను క్రియేట్ చేసింది. ఈ వీడియో ప్రేక్షకులను ది వరల్డ్ ఆఫ్ మోగ్లీకి పరిచయం చేసింది. ఎమోషనల్ నెరేటివ్ లో రోషన్ కనకాల పవర్ ఫుల్ పాత్రను పోషిస్తున్నాడు. సాక్షి సాగర్ మడోల్కర్ హీరోయిన్. వారి అద్భుతమైన కెమిస్ట్రీ ఈ చిత్రంలో హైలెట్ గా ఉండబోతోంది. బండి సరోజ్ కుమార్ ఒక బలమైన విలన్ పాత్రను పోషిస్తుండగా, హర్ష చెముడు కూడా కీలక పాత్రలో కనిపించనున్నారు.

## మైత్రి మూవీ మేకర్స్ 'ఆంధ్ర కింగ్ తాలూకా' హోల్సమ్ టీజర్ రిలీజ్

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని మోస్ట్ ఎవైటెడ్ ఎంటర్‌టైనర్ ఆంధ్ర కింగ్ తాలూకా మహేష్ బాబు పి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పాన్ ఇండియా ప్రొడక్షన్ హౌస్ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించింది. ప్రొడక్షన్ చివరి దశలో ఉంది. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటించగా, ఉపేంద్ర ఆన్‌స్క్రీన్ సూపర్ హీరోగా కనిపించనున్నారు. వివేక్ మెర్విన్ సంగీతం అందించారు. ఇప్పటివరకు విడుదలైన రెండు పాటలు చార్ట్‌బస్టర్‌లుగా నిలిచాయి. ఈరోజు, మేకర్స్ టీజర్‌ను రిలీజ్ చేశారు. రామ్ క్యారెక్టర్, సినిమా కథాంశం గురించి ఒక గ్లింప్స్ ఇచ్చారు. రామ్ సినిమాలను ఆరాధిస్తూ, ఆంధ్ర కింగ్ ని ఆరాధిస్తూ పెరుగుతాడు. అంకితభావంతో ఉన్న అభిమానిగా, అతను తన అభిమాన స్టార్ విజయాలను సెలబ్రేట్ చేసుకుంటాడు. అతనిని సమర్థిస్తూ గొడవల్లో కూడా పాల్గొంటాడు. అతను తన హీరోని ఎంతగా ప్రేమిస్తాడో, అంతే తీవ్రంగా అతన్ని ప్రేమించే ఒక అమ్మాయి ఉంది. మురళి శర్మ చెప్పిన హార్డ్ హిట్టింగ్ డైలాగ్ తో టీజర్ ముగుస్తుంది. రామ్ పోతినేని ఈ చిత్రంలో ఒక సినిమా అభిమాని పాత్రలో ఒదిగిపోయారు. ప్రతి హీరో అభిమానికి ఈ పాత్రలో తామే ఉన్నట్టు అనిపించేలా నటించారు. తన ఎనర్జీ తో రామ్ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. భాగ్యశ్రీ బోర్స్ రామ్ లవ్ క్యారెక్టర్ లో గ్రేస్‌ఫుల్, ఎమోషనల్ గా కనిపించింది. రామ్ తల్లిదండ్రులుగా రావు రమేష్, తులసి బాగా నటించారు. రామ్ స్నేహితుడిగా సత్య హ్యూమర్ అందించగా, ఒక సీన్‌లో మురళీ శర్మ ఆకట్టుకున్నారు.తన తొలి చిత్రంతోనే మంచి హిట్ ఇచ్చిన దర్శకుడు మహేశ్ బాబు పి, ఈసారి మరో యూనిక్ కథను అందిస్తున్నారు. ఆయన డైలాగులు బలంగా, ప్రేక్షకుడికి కనెక్ట్ అవుతున్నాయి. టీజర్‌ను అద్భుతంగా కట్ చేశారు.

సిద్ధార్థ్ నూని సినిమాటోగ్రఫీ అద్భుతంగా ఉంది. వివేక్-మర్విన్ సంగీతం టీజర్ టోన్‌కి తగినట్టుగా మారుతూ, కథను మరింత ఎట్రాక్టివ్ గాన వుంది. మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణ విలువలు అత్యున్నతంగా ఉన్నాయి. శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్‌గా, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్‌గా అద్భుతమైన వర్క్ అందించారు.

ఇది సినిమాను వేడుకలా జరుపుకునే చిత్రం. ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇచ్చే ఈ టీజర్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తించింది. భారీ అంచనాలతో ఆంధ్ర కింగ్ నవంబర్ 28న థియేటర్లలో విడుదల కానుంది.





## సైనిక దళాల్లో మహిళా ప్రాతినిధ్యం

చిన్నప్పుడు ఇంటి సమీపంలో జాగ్వార్, హాక్ యుద్ధ విమానాలు ఎగరడం చూశారామె. తానూ ఏదో ఒకరోజు వాటిని నడపాలనుకున్నారు. ఆపై లక్ష్యాన్ని చేరుకోవడమే కాదు, వైమానిక దళానికి గెలుపుగుర్రంలా నిలిచిన మిగ్-21 యుద్ధ విమానాలకు వీడ్కోలు పలికే బృందంలో ఒకరిగా నిలిచారు స్క్వాడ్రన్ లీడర్ ప్రియాశర్మ.

హైదరాబాద్, దుండిగల్‌లోని ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో 2017లో చేరారు ప్రియ. బ్యాచ్‌లో ఏకైక మహిళా ఫైటర్ పైలట్. భారత వైమానిక దళంలో ఏడో మహిళా ఫైటర్ పైలట్, ఐఐటీ కో నుంచి ఇంజినీరింగ్ పూర్తిచేశాక తండ్రి అడుగుజాడల్లో నడిచి ఎయిర్‌ఫోర్స్‌లో చేరారు ప్రియ. అప్పటి ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ నుంచి 2018లో గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ అందుకుని ఐఎస్‌లో ఫ్లయింగ్ ఆఫీసర్‌గా చేరారు. మొదట హైదరాబాద్, హాకీంపేట ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ చేరారు. కర్ణాటకలోని బీదర్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌కు మారి అడ్వాన్స్‌డ్(స్టేజ్ 3) పూర్తిచేశారు. రాజస్థాన్‌లోని ఝుంఝునును జిల్లా, పిలానికి చెందిన కుటుంబం వీరిది. ఈమె తం బీదర్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నప్పుడు రోజూ యుద్ధ విమానాలను చూసేవారు. అప్పుడే పైలట్ కావాలన్న ఆమె లక్ష్యానికి బీజం పడింది. 'దేశ సేవ కోసం ఎయిర్‌ఫోర్స్‌లో చేరడం, అందులోనూ ఫైటర్ పైలట్ కావడం ఉత్తమ మార్గం. శిక్షణలో చిన్న ప్రమాదాలు జరుగుతాయి. వాటిని చూసి బెదరలేదు. అలాంటివి మరింత దృఢపరచాయి. శిక్షణ తర్వాత కాక్‌పిట్‌లో ఎంతో ధైర్యంగా కూర్చోగలిగా. కాక్‌పిట్ ఇప్పుడు నాకు రెండో ఇల్లు లాంటిది అని చెబుతారు ప్రియ.

ఈ ఆగస్టులో రాజస్థాన్, బికనేర్‌లోని నాల్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్, ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్‌తో కలిసి మిగ్స్ నడిపి వార్తల్లో నిలిచారు ప్రియ. ఆఖరిసారిగా చండీగఢ్ ఆరు మిగులు ఆకాశంలోకి ఎగరనున్నాయి. ఈ కార్యక్రమంలో ఎయిర్‌ఫోర్స్ చీఫ్‌తోపాటు పాల్గొననున్న పైలట్లలో ప్రియుడు ఒకరు. ఈమెకు సంబంధించిన రిహార్సల్స్‌లో భాగమయ్యారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో మహిళా శక్తిని చాటేలా సైనికాధికారులు కల్నల్ సోఫియా సింగ్, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ బ్రీఫింగ్‌లో ఉన్నారు. ఇప్పుడు మరో కీలకఘట్టంలోనూ ప్రియాశర్మ రూపంలో నారీశక్తి భాగం. సైనిక దళాల్లో మహిళా ప్రాతినిధ్యానికీ, సారథ్యానికీ నిదర్శనంగా నిలుస్తున్నారు ప్రియ.

## ఆమె చిత్రం రమణీయం ..

ప్రకృతిలోని అందాలను ఒడిసిపట్టి కాన్వాస్‌పై చిత్రించే కళాకారులు... దీనికి భిన్నంగా రైతన్నల కష్టాలు, మత్స్యకారుల జీవితాలు, ఆడపిల్లలపై వేధింపులు... సామాజిక వస్తువులను ప్రదర్శించేందుకు దీన్ని ఎంపిక చేశారు. హైదరాబాద్‌కు చెందిన రమణి మైలవరపు. తాజాగా ఢిల్లీలోని బికనేర్ హౌస్‌లో 'రూట్స్ టు రివర్స్' ఎగ్జిబిషన్ నిర్వహిస్తుంచిన ఆమె గురించి తెలుసుకుందాం. కళకు పరిధి లేనట్లే... నేర్చుకోవడానికి వయసుతో సంబంధం లేదని నేను నమ్ముతాను. అందుకే, నాలుగు పదాలు దాటాక కూడా నచ్చింది చేయడానికి వెనకాడలేదు. నాకు చిన్నప్పటి నుంచీ బొమ్మలు గీయడమంటే ఆసక్తి, కాగితాలు, గోడలు, పెళ్లికార్డులు... ఇలా ఏవి ఖాళీగా కనిపించినా నచ్చిన చిత్రం వేసేదాన్ని.




తర్వాత చదువుల్లో పడి వదిలేశా. మా స్వస్థలం కాకినాడ. అక్కడే ఎంఎస్సీ వరకు చదువుకున్నా. పెళ్లయ్యాక హైదరాబాద్‌కు వచ్చేశా. మావారు ఐఆర్ఎస్ అధికారి అయిన ఆయన ఉద్యోగరీత్యా వివిధ ప్రాంతాలు తిరగాల్సి వచ్చేది. అలా మేం కొన్నాళ్లు బెంగళూరులో ఉన్నాం. ఆ సమయంలో ఖాళీగా ఉండటం ఇష్టంలేక బొటిక్ నిర్వహించండి. కానీ, పాప చిన్నది కావడంతో కుదరక ఆ వ్యాపారాన్ని వదిలేశా. తను బడికెళ్లడం మొదలు పెట్టాక నాకు కొంత ఖాళీ దొరకడంతో తిరిగి నా అభిరుచులపై దృష్టిపెట్టా. దొడ్డమణి అనే గురువు దగ్గర ఏడాదిపాటు పెయింటింగ్‌లో మెలకువలు నేర్చుకున్నా. మళ్లీ మావారికి హైదరాబాద్ బదిలీ అయ్యింది. ఇక్కడికి వచ్చాక ల్యాండ్‌స్కేప్ పెయింటింగ్స్‌లోనూ ప్రావీణ్యం సాధించా. ఓసారి పెయింటింగ్ ఎగ్జిబిషన్‌కి వెళ్తే జేఎన్టీయూ ఫైన్‌ఆర్ట్స్ గురించి తెలిసింది. అప్పటికే నలభై ఏళ్లు వచ్చాయి. ఆ వయసులో తిరిగి కాలేజీలో చదివితే ఎవరేమనుకుంటారో అని నేను ఆలోచించలేదు. ప్రవేశ పరీక్ష రాసి ఏడోర్యాంకు సాధించా.



**సామాజికాంశాలపై సమరం...** చదువయ్యాక... కాంటెంపరరీ ఆర్ట్‌లో టెక్నిక్స్ నేర్చుకోవడానికి లండన్ వెళ్లా. అక్కడ వ్యర్థాల నుంచి కూడా అద్భుతమైన చిత్రాలను సృష్టించొచ్చని తెలుసుకున్నా. అప్పటి నుంచే క్షేత్రస్థాయి దృష్టి సారించడం మొదలుపెట్టా. ముఖ్యంగా గ్రామీణుల జీవితాలను నా కళ్లలో ప్రతిబింబించేలా చేయాలనుకున్నా. అలా స్త్రీలపై దాడులు, అన్నదాతల కష్టాలు, నిర్భయ సంఘటన, కొవిడ్‌పై అవగాహన, స్వచ్ఛభారత్ వంటి ఎన్నో అంశాల ఫొటో ఫెర్ఫార్మెన్స్ ఆర్‌లుగా మార్చారు. అంటే తీయాలనుకున్న ఫొటోలో నేనూ భాగమై... తర్వాత దాన్ని కాన్వాస్పై ప్రింట్ చేస్తా. ఆపై దాన్ని ఆక్రిలిక్ పెయింటింగ్‌తో తీర్చిదిద్దుతా.

నిజానికి ఈ స్టైల్ పాశ్చాత్య దేశాల్లో ఎంతో పాపులర్. ఈ విషయంలో ఆర్టిస్టులు సిండి షెర్మాన్, పుష్పమాల నాకు ఆదర్శం. ఇప్పటి వరకూ హైదరాబాద్, ముంబయి, దుబాయ్, లండన్‌లలో జరిగిన గ్రూప్ ఎగ్జిబిషన్లలో నా ఆర్ట్ వర్క్స్ పెట్టా. 9 షోలో ప్రదర్శనలూ చేశా. తాజాగా ఢిల్లీలోని బికనేర్ హౌస్ లోని 'రూట్స్ టు రివర్స్' పేరుతో ప్రదర్శించారు. ఆఫ్ వాయిస్ వేవ్స్ (ఉప్పాడ మత్స్యకారులు), ఇన్విజిబుల్ రూట్స్ (అరకు గిరిజనులు), మోనాలిసా విత్ మాస్క్‌లతో పాటు బోడో గిరిజనుల జీవితాలు, సంస్కృతులు... దాదాపు 80 ఆర్ట్లను ఈ ఎగ్జిబిషన్‌లో చూపించారు. ఈ ప్రయత్నం ఆర్ట్ మీద అవగాహన పెంచడమే కాదు... సామాజిక సమస్యలపై పోరాటానికి ఉపయోగపడుతుంది.



## సముద్ర జలాలతో థెరపీ!

గ్రీకు భాషలో థలసా అంటే సముద్రం. సముద్రం నుంచి సేకరించిన నీరు, మట్టి, ఆల్గే వంటి వాటిని ఉపయోగించి థెరపీని థలసో థెరపీగా పిలుస్తారు. దీనికి ఇటీవల మనదగ్గర ప్రసిద్ధి చెందింది.

- సముద్ర జలాల్లో మెగ్నీషియం, కాల్షియం, పొటాషియం వంటి ఖనిజ లవణాలు అధికంగా ఉండటం వల్ల ఒత్తిడి, అలసట, చర్మ సంబంధ సమస్యలకు ఉపశమనం లభిస్తుంది.
- సముద్ర జలాలను ఒక టబ్‌లోకి తీసుకుని వేడి చేసి ఆ నీటిలో దిగడం, అల్గే వంటి సీవీడిని చుట్టడం, సముద్ర జలాలతో షవర్ చేయడం... వంటి మార్గాలున్నాయి.
- క్లియోపాత్ర కూడా సముద్ర జలాలకు పాలు, గులాబీ రేకల్ని జోడించి స్నానమాచరించేదట.
- దెర్మటాలజిస్టులు... ఈమధ్య సముద్రతీర మట్టి, ఆల్గే, సముద్ర ఖనిజ లవణాలు జోడించిన ఫేషియల్స్‌ను సూచిస్తున్నారు. ఇవి రక్తప్రసరణను పెంచుతాయి. శరీరంలోని మలినాలను బయటకు పంపుతుంది.
- మెగ్నీషియం, పొటాషియం, అయోడిన్ వంటి ఖనిజాలు కీళ్ల నొప్పులను తగ్గించి, కండరాల పునరుద్ధరణకు సాయపడతాయి. అందుకే క్రీడాకారులూ సముద్ర జలాల స్నానాన్ని గుర్తించారు.
- ప్రకృతికి దగ్గరగా ఉండటంవల్ల కలిగే లాభాలు సముద్ర జలాల్లో స్నానమాచరించడంవల్ల ఉంటాయి. ప్రశాంతతనూ, నిద్రనూ కారణంగా రోగ్యాన్ని పెంచుతాయి.
- మన దగ్గర ఆయుర్వేదం, స్పా మసాజ్‌లకు వచ్చినంతంగా ఇంకా థలసోథెరపీకి ఆదరణ, సదుపాయాలు రాలేదు. కానీ మీరైతే బీచ్‌కు వెళ్తే స్నానం చేయడం మర్చిపోవద్దు, పరిశుభ్రతా చూసుకోండి.

## ప్యాకేజింగ్ ఆహారం వద్దు..

పిల్లలకోసం కొనే ప్రతి వస్తువు నాణ్యమైనదై ఉండాలనుకుంటాం. ఇక ఆహారైతే ప్యాకెట్ లేబుల్ని పరిశీలించుకుని మరీ కొంటాం. ఈ విధంగానే రకరకాల పండ్లు, కూరగాయలతో చేసిన ఆహారం... ప్యాకెట్ మీద వాటి చిత్రాలను వేస్తారు. తయారీదారులు. అయితే, ఇవి చాలావరకు మనల్ని తప్పు దారి పట్టించేలా ఉంటున్నాయని యూనివర్సిటీ ఆఫ్ ఆక్లాండ్ తాజా పరిశోధనలు చెబుతున్నాయి. ఇందులో భాగంగా పసిపిల్లలకు తినిపించే ఆహారపదార్థాల ప్యాకేజింగ్‌ను పరిశీలించారు శాస్త్రవేత్తలు. ప్యాకెట్ మీద పండ్ల చిత్రాలు, తయారీలో మాత్రం 5 శాతం కంటే తక్కువగా ఉపయోగించినట్లు పేర్కొన్నారు. పసి



ఎలాంటి ఎడిటివ్స్, కృత్రిమ రంగులు కలపలేదన్న ప్యాకెట్ మీద లేబుల్ చూసి మంచివే అని ఏంచుకుంటాం. కానీ, అందులో అధిక చక్కెరలు, ప్రాసెస్ చేసిన పదార్థాలు. వీటిని గమనించకుండా మన దృష్టి మళ్లిస్తుంటాయి ఆ లేబుళ్లు. పిల్లల ఎదుగుదలకు మొదటి వెయ్యి రోజులూ కీలకం. ఈ సమయంలో వారికి పోషకాహారం మాత్రమే అందించాలి. కాబట్టి, పిల్లలకు ప్యాకేజింగ్ ఆహారాన్నివ్వటం తగ్గించాలని సూచిస్తున్నారు పరిశోధకులు.

## తెలుసుకుందాం..

కల్పనా సరోజ్ 1960-70ల్లో చిన్న ఫర్నిచర్ దుకాణంతో మొదలైంది ఆమె ప్రయాణం. అక్కడ్నుంచి చిన్నచిన్న వ్యాపారాలు చేస్తూ, 2001 నష్టాల్లో నడుస్తోన్న 'కమానీ ట్యూబ్స్ లిమిటెడ్' కంపెనీ పగ్గాలు తీసుకుని, లాభాలబాట పట్టించారు. మన దేశ మొట్టమొదటి మహిళా పారిశ్రామికవేత్తగా పేరు తెచ్చుకున్నారు. 2013లో ఈమెకు పద్మశ్రీ కూడా ఇచ్చారు.






## పింగాణీ 'ఘుమఘుమలు'







వంటగది అంటే కేవలం ఆహారం తయారుచేసుకునే ఓ గది... అన్న భావన ఎప్పుడో పోయింది. దాన్ని కూడా అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు ఈ తరం ఆడవాళ్లు. అందుకే దాన్లో వాడే ప్రతి వస్తువునూ ఏరికోరి ఎంచుకుంటున్నారు. అందులో భాగంగా వచ్చినవే ఈ పింగాణీ వంట పరికరాలు. స్టీలు, గాజు పాత్రలు ఉన్నా సరే... ఆడవాళ్లకు పింగాణీ వస్తువులపై ఉండే ప్రేమే వేరు. అందుకే కుక్వేర్, డిన్నర్వేర్ రూపంలో వాటిని ఎప్పుడో వంటింట్లో భాగం చేశారు. ఈ ఇష్టాన్ని చూసేనేమో తయారీదారులు కిచెన్లో వాడే పరికరాలనూ పింగాణీతో చేయటం కోసం. అందులోనూ సాదాసీదాగా కాదు... సృజనాత్మకత ఉట్టిపడేలా రకరకాల డిజైన్లు, రంగుల్లో తీసుకొచ్చారు. ఎగ్ ట్రే అల్లం, వెల్లుల్లి గ్రేటర్, సాల్ట్, పెప్పర్ డబ్బా, స్పూన్, స్పాంజ్ హోల్డర్, ఎగ్ ఎల్లో సెపరేటర్... ఇలా ఎన్నో రకాలుగా అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రయోజనంతోపాటు, కిచెన్కి ఓ డెకరేటివ్ టచ్నీ ఇస్తాయివి. పైగా శుభ్రపరచుకోవటమూ తేలిక. కాస్త జాగ్రత్తగా వాడుకుంటే చాలు. అందం, అలంకరణ, ఉపయోగం అన్నీ ఉన్న ఈ టూల్స్ కిచెన్‌కి కొత్త అందాన్నిస్తాయనటంలో సందేహం లేదు! ఏమంటారు?





## శివపూజ

మృకండ మహర్షికి హరిహరులు వరం ప్రసాదించగా మార్కండేయుడు జన్మించాడు. కొడుకు వరప్రసాది అయినా పదహారేళ్లే జీవిస్తాడని తెలిసి ముని దంపతులు మథనపడుతున్నారు. ఒకరోజు ఆశ్రమానికి వచ్చిన నారదుడు మహర్షి కొడుకు అల్పాయుష్కుడని బాధపడకు, కైలాసవాసుడు తలరాతను కూడా మార్చగలడు. మార్కండేయుడు మహేశ్వరుణ్ణి మెప్పించి పూర్ణాయుష్షును పొందుతాడు అని ఆశీర్వదించాడు. నారదముని ఆశీస్సులతో బాల మార్కండేయుడు శివభక్తుడయ్యాడు. తల్లిదండ్రులు కూడా కొడుకు కోసం నిత్యం శివార్చన చేసేవారు. వారి అనుమతితో బాలకుడిగా ఉన్నప్పుడే మార్కండేయుడు అడవులకు వెళ్లి ఆ పరమేశ్వరుని కోసం తపస్సు చేయసాగాడు. శివపూజలో ఏళ్లు గడిచాయి. మార్కండేయుని ఆయుర్దాయం తీరిపోగా, అతడి ప్రాణాల్ని తీసుకువెళ్లేందుకు యమధర్మరాజు వచ్చాడు. 'బాలకా! నీ ఆయువు ముగిసింది, బయల్దేరు' అని తొందర పెట్టాడు. 'శివపూజలో ఉన్నాను! ఇప్పుడు రాలేను!' అన్నాడు ఆ బాలకుడు అన్నాడు. అయినా యముడు పట్టువదలక తన యమపాశాన్ని విసిరాడు. అప్పుడు మార్కండేయుడు ఆర్తిగా శివలింగాన్ని ఆలింగనం చేసుకున్నాడు. యముడు విసిరిన కాలపాశం బాలభక్తుడితో పాటు భక్తవశంకరుణ్ణి కూడా చుట్టుకుంది. తన భక్తుని హింసిస్తున్నందుకు త్రినేత్రుడు ఆగ్రహోదగ్రుడై యమధర్మరాజునే నేలకూల్చాడు. తర్వాత దేవతలు ప్రార్థించగా యముడికి ప్రాణభిక్ష పెట్టాడు. తన భక్తుల జోలికి వెళ్లకూడదంటూ ఆజ్ఞాపించాడు. మార్కండేయుని ప్రేమగా దగ్గరకు తీసుకుంటూ నాయనా మార్కండేయా! నువ్వు చిరంజీవివై చిరకీర్తిని పొందుతావు అని ఆశీర్వదించాడు. కాలగమనంలో జ్ఞానసంపదను ఆర్జించి, ఆధ్యాత్మిక సాధనలు చేసి బాల మార్కండేయుడు, మార్కండేయ మహర్షిగా కీర్తిపొందాడు. మహాభారతం ఈ మహర్షి ప్రస్తావన తెచ్చాడు.



ఆధ్యాత్మికం

## పఠనాసక్తి పెంచుకోవాలి!

కాస్త సమయం దొరికినా వాటితోనే కాలక్షేపం. చదవడమే కాదు, వాటిపై చర్చలు కూడా పెట్టేవారు. వాళ్లు తెలుసుకున్నది నలుగురితో పంచుకునేవారు. కానీ ఇప్పుడో అంతా సామాజిక మాధ్యమాల మాయాజాలమే. స్క్రోలింగ్ నుంచి చూపు మరలితేనా... ఇంకేదైనా ఆలోచించడానికి. దీనివల్ల ఎన్నో సమస్యలు కొనితెచ్చుకుంటున్నారు. అందుకే జెన్-జి, మిలీనియల్ అమ్మాయిలు పుస్తకపఠనంపై ఆసక్తి కనబరుస్తున్నారు. వారు చదివిందే కాక, రివ్యూలు చెబుతూ పక్కవారిలోనూ చదవాలనే ఆసక్తిని కలిగిస్తున్నారు. అయితే కొత్తగా పుస్తకపఠనం మొదలుపెట్టే వారికి కొన్ని సూచనలివి...

★. సబ్జెక్ట్ పుస్తకాలు తప్పు... వేరేవి మేమెప్పుడూ చదవలేదు అనేవారు ఆరంభశూరత్వం ఉండకూడదంటే... మొదట చిన్నచిన్న కథలు ఉంటే బుక్స్ ఎంపిక చేసుకోండి. 10 నుంచి 15 నిమిషాల్లో పుస్తకం పూర్తయిపోయేలా ఉండేవైతే మేలు. అప్పుడే విసుగు అనిపించింది. ఇంకా చదవాలంటే ఆసక్తి కలుగుతుంది.

★ ఒక్క సారిగా జీవిత చరిత్రలవైపు మళ్లకుండా... హాస్యం, థ్రిల్లర్, ఫిక్షన్ ఎంపిక చేసుకోండి. ఈ జానర్ పుస్తకాలు ఆసక్తిగా చదవండి.

★ చదివినప్పుడు నచ్చిన లైన్లను నోట్ చేసుకోండి. నిద్రపోయేముందు వాటిని మళ్లీ ఓసారి చూసుకోండి. అవే ఇంకా ఆ పుస్తకంలో ఇలాంటి విషయాలు ఏమేమి ఉన్నాయో చూడాలన్న ఆసక్తిని కలిగిస్తాయి.

★ ప్రాథమిక దశ దాటాక రోజుకి ఐదు, పది పేజీలంటూ లక్ష్యాన్ని పెట్టుకోండి. మీరు ఎంపిక చేసుకున్న పుస్తకం మీకు తెలియకుండానే ఇట్టే పూర్తయిపోతుంది.

★రెండు పేజీలు అయినా చదవందే నిద్ర పట్టదు' అని అమ్మల దగ్గర వినే ఉంటారు. మనకేమో ఫోన్‌లో స్క్రోల్ చేయందే కునుకు రాదు. ఈ అలవాటును దారి మళ్లించాలన్నా కళ్లకు, మనసుకు విశ్రాంతి ఇవ్వాలన్నా..పుస్తకం పట్టాల్సిందే. అందుకే రోజూ నిద్రపోయేముందు కనీసం 20 నుంచి 30 నిమిషాలు దీనికి కేటాయించండి.



## పప్పుతో పచ్చడి

కందిపప్పుతో
ఎప్పుడూ పప్పు, సాంబార్ రొటీన్ కదా!
ఈసారి ఇలా పచ్చడి చేద్దామా..

**కావాల్సినవి:** కందిపప్పు కప్పు, ఎండుమిర్చి 9, కరివేపాకు రెబ్బలు 4, ఆవాలు, మినుములు, జీలకర్ర 2 చెంచాలు, రాళ్ల ఉప్పు సరిపడ, చింతపండు నిమ్మకాయంత, వెల్లుల్లి రెబ్బలు 8, పసుపు చిటికెడు.

**తయారీ:** ఒక కడాయిలో కందిపప్పు వేసి సన్నని సెగపై వేయించుకోవాలి. తర్వాత ఎండుమిర్చి, జీలకర్ర వేసి రెండు నిమిషాలు వేగనివ్వాలి. తర్వాత ఒక ప్లేట్‌లోకి తీసుకుని చల్లారాక మిక్సీలో కొద్దిగా రాళ్ల ఉప్పు జతచేసి నీళ్లు పోయకుండా ఒకసారి మిక్సీ పట్టుకోవాలి. తర్వాత కొద్దిగా నీళ్లు పోసి జారుగా కాకుండా గట్టిగా రుబ్బాలి. తర్వాత ఒక పాన్‌లో నూనె పోసి వేడయ్యాక ఆవాలు... జీలకర్ర, మినపప్పు, కరివేపాకు, ఎండుమిర్చి, దంచిన వెల్లులి రెబ్బలు, ఉప్పు, పసుపు వేసి కలపాలి తర్వాత చింతపండు రసం పోయాలి. కాసేపయ్యాక కంది మిశ్రమం వేస్తే పచ్చడి సిద్ధం. వేడి వేడి అన్నంలో ఈ పచ్చడిలో కొద్దిగా నెయ్యి వేసుకునే తింటే భలే కమ్మగా ఉంటుంది.!






## అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్..
# భారత్ అథ్లెట్ల అద్భుత ప్రదర్శన

**న్యూఢిల్లీ:** జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2025, 2వ రోజు భారత్ అథ్లెట్లు అద్భుత ప్రదర్శనతో ప్రపంచ అండర్ 20 అర్హత ప్రమాణాలను అధిగమించారు. భువనేశ్వర్‌లో జరిగిన ప్రపంచ అండర్ 20 పురుషుల 100 మీటర్ల రేసులో ప్రస్తుత ఛాంపియన్ అయిన జార్ఖండ్‌కు చెందిన పార్థ్ సింగ్, లాంగ్ జంప్‌లో వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శన చేశాడు. 7.82 మీటర్ల జంప్‌తో కొత్త మీట్ రికార్డును నెలకొల్పి అందరి దృష్టిని ఆకర్షించాడు. ప్రపంచ అండర్ 20 అర్హత మార్కు 7.58 మీటర్లను అధిగమించాడు. అలాగే ప్రస్తుత ఆసియా యూత్ ఛాంపియన్ హర్యానాకు చెందిన హిమాన్షు, అండర్ 18 జావెలిన్ త్రోలో 80.38 మీటర్ల ప్రయత్నంతో ఆధిపత్యం చెలాయించాడు. ప్రపంచ అండర్ 20 ప్రమాణం 68.50 మీటర్లను సులభంగా అధిగమించాడు. అతని త్రో క్వాలిఫికేషన్ రౌండ్‌లో సొంత మీట్ రికార్డు 79.96 మీటర్లను కూడా మెరుగుపరుచుకుంది. అలాగే అండర్20 పురుషుల 400 మీటర్ల పరుగులో, ముగ్గురు పతక విజేతలు మహమ్మద్ అష్ఫాక్ (కేరళ, 46.87సె), శరణ్ ఎం (తమిళనాడు, 47.09సె), రోహిత్ చౌదరి (ఉత్తరప్రదేశ్, 47.17సె) 47.40 సెకన్ల అర్హత సమయాన్ని చేరుకున్నారు. మహిళల్లో యుపికి చెందిన నీరు పాఠక్ అండర్20 మహిళల 400 మీటర్లలో 53.38 సెకన్ల మీట్ రికార్డును సృష్టించింది, జిస్నా మాథ్యూ 2017 మార్కు 53.52 సెకన్లను అధిగమించి, ప్రపంచ అండర్20 కట్ 55.20 సెకన్లను సులభంగా అధిగమించింది.

## అక్వాటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో
# చైనాకు డబుల్ స్వర్ణం

**న్యూఢిల్లీ:** ఆసియా అక్వాటిక్స్ ఛాంపియన్‌షిప్ చివరి రోజున చైనా డబుల్ స్వర్ణ పతకాన్ని పూర్తి చేసింది. టోర్నమెంట్ చివరి రోజున పురుషుల, మహిళల వాటర్ పోలో ఈవెంట్లలో చైనా బంగారు పతకాలు సాధించి తన ఆధిపత్యాన్ని చాటుకుంది. మిర్తా పూల్స్ కొత్తగా నిర్మించిన ఈ ఫెసిలిటీలో జాంగ్ కిషువో ఏడు గోల్స్ చేయడంతో, చైనా మహిళల జట్టు అత్యధిక స్కోరింగ్‌తో కూడిన ఫైనల్‌లో జపాన్‌ను




22-17తో ఓడించింది. మ్యాచ్ అంతటా చైనా నియంత్రణను కొనసాగించడంతో వాంగ్ జువాన్, లి లినున్ కీలకమైన స్ట్రైక్‌లను జోడించారు. పురుషుల ఫైనల్లో, నిర్ణీత సమయం ముగిసిన తర్వాత ఉత్కంఠభరితమైన పెనాల్టీ షూటౌట్‌లో (5-4) చైనా 16-15తో ఇరాన్‌ను ఓడించింది. చైనా తరపున కెప్టెన్ చెన్ యిమిన్, చు చెంఘావో రెండుసార్లు గోల్స్ చేయగా, ఇరాన్‌కు చెందిన షామ్స్ అర్మాన్ ఐదు గోల్స్ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. కజకిస్తాన్ రెండు కాంస్యాలను గెలుచుకుంది. మహిళల జట్టు థాయిలాండ్‌ను 9-8తో ఉత్కంఠభరితమైన షూటౌట్‌లో (3-2) ఓడించింది, పురుషుల జట్టు జపాన్‌ను 16-14తో ఓడించింది, హాంకాంగ్‌తో 11-18 తేడాతో ఓడిపోయిన తర్వాత భారత్ ఎనిమిదో స్థానంలో నిలిచి, 2026 ఆసియా క్రీడలకు అర్హతను నిర్ధారించింది.

## సుల్తాన్ ఆఫ్ జోహోర్ కప్..
# అజేయంగా భారత్

**న్యూఢిల్లీ:** సుల్తాన్ ఆఫ్ జోహోర్ కప్-2025లో న్యూజిలాండ్‌పై భారత్ సునాయాసంగా విజయం సాధించింది. మలేషియాలో ఆదివారం న్యూజిలాండ్‌తో జరిగిన రెండవ మ్యాచ్‌లో 4-2 తేడాతో గెలుపొంది ఇండియా కోల్ట్స్ అజేయంగా నిలిచింది. విజేత జట్టు తరపున అర్ష్‌దీప్ సింగ్ (2వ నిముషం), పిబి సునీల్ (15), అరైజీత్ సింగ్ హుందాల్ (26), రోమన్ కుమార్ (47) గోల్స్ చేయగా, న్యూజిలాండ్ తరపున గుస్ నెల్సన్ (41), ఐడాన్ మార్క్స్ (52) గోల్స్ చేశారు. భారత్ జట్టుకు తొలి గోల్ మొదటి క్వార్టర్ ప్రారంభమైన రెండో నిమిషంలోనే వచ్చింది.



న్యూజిలాండ్ సర్కిల్‌లో పేలవమైన డిఫెండింగ్ తర్వాత అర్ష్‌దీప్ సింగ్ లూజ్ బాల్ ద్వారా గోల్ చేశాడు. క్వార్టర్ చివరి నిమిషంలో సునీల్ పిబి గోల్ చేయడంతో ఇండియా కోల్ట్స్ తమ ఆధిక్యాన్ని రెట్టింపు చేసుకుంది. మూడో క్వార్టర్‌లో న్యూజిలాండ్ ప్లేయర్ గుస్ నెల్సన్ 41వ నిమిషంలో గోల్ చేయడంతో భారత్ ఆధిక్యం 3-1కి తగ్గింది. అయితే, 47వ నిమిషంలో రోసన్ కుమర్ పిసి ద్వారా గోల్ చేయడంతో చివరి క్వార్టర్‌లో భారత్ 4-1 ఆధిక్యంలో నిలిచింది. 52వ నిమిషంలో న్యూజిలాండ్ తరపున బిడెన్ మార్క్స్ ఒక గోల్ చేయడంతో స్కోరు 4-2కు చేరి భారత్ గెలుపొందింది.



# ఐపిఎల్ మినీ వేలం..
## కాస్ట్లీ ప్లేయర్స్ ఔట్
### రూ.100 కోట్లకు ఫ్రాంచైజీల చెక్

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2026 సీజన్ దగ్గర పడుతోంది. దీంతో ఫ్రాంచైజీలు కొత్త సీజన్ ప్లేయర్ల వేలం కోసం సిద్ధమవుతున్నాయి. ఈ మినీ వేలం డిసెంబర్ 15 నుంచి 17 మధ్య జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీనికి సంబంధించి ప్లేయర్ల రిటైన్ జాబితాను విడుదల చేసేందుకు నవంబర్ 15 చివరి తేదీ. దీంతో పలు ఫ్రాంచైజీలు విడుదల చేసే వారిలో కాస్ట్లీ ప్లేయర్లను బయటకు పంపే ఆలోచన చేస్తున్నాయి. ఈ విధంగా కనీసం రూ.97.35 కోట్లు (సుమారు 1.7బిలియన్) విలువైన ఆటగాళ్ల విడుదలస్పష్టంగా కనిపిస్తుంది. ఐదుసార్లు ఛాంపియన్లుగా నిలిచిన చెన్నై సూపర్‌కింగ్స్ కనీసం ఐదుగురు ప్రధాన ఆటగాళ్లను విడుదల చేసే అవకాశం ఉంది. వీరిలో డెవాన్ కాన్వే (రూ.6.25 కోట్లు), దీపక్ హుడా (రూ.1.70 కోట్లు), విజయ్ శంకర్ (రూ.1.20 కోట్లు), రాహుల్ త్రిపాఠి (రూ.3.40 కోట్లు), సామ్ కుర్రాన్ (రూ.2.40 కోట్లు) వంటి ప్రముఖ పేర్లు ఉన్నాయి. గత మెగా వేలంలో అత్యంత ఖరీదైన ఆటగాళ్లలో ఒకరైన వెంకటేష్ అయ్యర్‌ను కూడావిడుదల చేసే వీలుంది. కోల్‌కతా నైట్ రైడర్స్ అతన్ని రూ.23.75 కోట్లకు కొనుగోలు చేసింది. లీగ్ చరిత్రలో మూడవ అత్యంత ఖరీదైన ఆటగాడిగా నిలిచాడు. అయితే, అతని ప్రదర్శన పేలవంగా ఉంది. ఇక రిషబ్ పంత్ నేతృత్వంలోని లక్నో సూపర్ జెయింట్స్ కూడా కొంత మంది అధిక ధరల ఆటగాళ్లను విడుదల చేయనుంది. ఆకాష్ దీప్ (రూ.8 కోట్లు), డేవిడ్ మిల్లర్ (రూ.7.50కోట్లు) వంటి కాస్ట్లీపేర్లు కూడాఉన్నాయి. ఫాస్ట్ బౌలింగ్‌తో సంచలనం సృష్టించిన మయాంక్ యాదవ్ (రూ.11 కోట్లు) కూడా విడుదల కానున్నారు. కాగా ఢిల్లీ క్యాపిటల్స్ కొన్ని కీలక నిర్ణయాలు తీసుకొని తమ ఇద్దరు బౌలర్లను విడుదల చేయనుంది. ఇందుకోసం రూ.22 కోట్లకు పైగా ఖర్చు చేశారు. వారిలో వెటరన్ ఆస్ట్రేలియన్ ఫాస్ట్‌బౌలర్ మిచెల్‌స్టార్క్ (రూ.11.75 కోట్లు) కీలక ఆటగాడు, ఎడమచేతి వాటం భారత పేసర్ టి నటరాజన్ (రూ.10.75 కోట్లు)కూడా విడుదల కావొచ్చు. రాజస్థాన్‌రాయల్స్ కెప్టెన్ సంజు శాంసన్ పరిస్థితి ఇంకా అస్పష్టంగానే ఉంది. అయితే, శ్రీలంకస్పిన్ ఆల్‌రౌండర్ వానిందు హసరంగా (రూ.5.25 కోట్లు), శ్రీలంక స్పిన్నర్ మహీష్ తీక్షణ (రూ.4.40 కోట్లు) విడుదల చేసేందుకు ఫ్రాంచైజీలు సిద్ధమవుతున్నాయి.

# ఫాలోఆన్‌లో వెస్టిండీస్ పోరాటం
## భారత్ 97 పరుగుల ఆధిక్యం





**న్యూఢిల్లీ:** ఇండియాతో జరుగుతున్న రెండో టెస్టులో వెస్టిండీస్ పోరాడుతోంది. మూడోరోజు ఆదివారం ఆట ముగిసే సమయానికి 97 పరుగుల ఆధిక్యంలో భారత్ ఉంది. 270 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన విండీస్, ఆట ముగిసే సరికి 49 ఓవర్లలో 2 వికెట్లకు 173 పరుగులు చేసింది. ఓపెనర్ క్యాంబెల్ సూపర్బ్ ఫిఫ్టీ (145 బంతుల్లో 87 బ్యాటింగ్, 9 ఫోర్లు, 2 సిక్సర్లు)తో టాప్ స్కోరర్ గా నిలిచి, కెరీర్ బెస్ట్ స్కోరును నమోదు చేశాడు. క్రీజులో అతనితో పాటు, షాయ్ హోప్ (103 బంతుల్లో 66 బ్యాటింగ్, 8 ఫోర్లు, 2 సిక్సర్లు) ఉన్నాడు. బౌలర్లలో వాషింగ్టన్ సుందర్, మహ్మద్ సిరాజ్ కు తలో వికెట్ దక్కింది. ఇంకా 97 పరుగుల దూరంలో విండీస్ నిలిచింది. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌ను భారత్ 5 వికెట్లకు 518 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. కాగా వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్ లో 248 పరుగులకు ఆలౌట్ అయింది. అహ్మదాబాద్‌లో జరిగిన తొలి టెస్టును ఇన్నింగ్స్ 140 పరుగుల తేడాతో గెలిచిన భారత్ రెండుటెస్టుల సిరీస్ లో 1-0తో ఆధిక్యంలో ఉంది. అంతకుముందు 270 పరుగుల లోటుతో ఫాలో ఆన్ ఆడిన వెస్టిండీస్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగి లింది. ఓపెనర్ త్యాగనారాయణ్ చందర్ పాల్ (10) ర్యాష్ షాట్ ఆడి, మరోసారి విఫలమయ్యాడు. సిరాజ్ బౌలింగ్‌లో పుల్ షాట్ కు ప్రయత్నించి, కెప్టెన్ శుభమాన్ గిల్ సూపర్బ్ క్యాచ్ పట్టడంతో ఔటయ్యాడు. ఆ తరవాత తొలి ఇన్నింగ్స్ టాప్ స్కోరర్ అతనాజ్ (7)ను వాషింగ్టన్ సుందర్ బౌల్డ్ చేశాడు. దీంతో 35 పరుగులకే రెండు వికెట్లకు కోల్పోయింది. మ్యాచ్‌కు ముందు 68 పరుగుల వ్యక్తిగత స్కోరు ఉన్న క్యాంబెల్ ఈ మ్యాచ్‌లో భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొని 69 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. మరో ఎండ్ లో హోప్ కూడా 80 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. వీరిద్దరూ అబేధ్యమైన మూడో వికెట్‌కు 138 పరుగులను జత చేశారు. ఈక్రమంలో మూడో సెషన్ మొత్తం మీద ఒక వికెట్ పడకుండా విండీస్ రోజును ముగించింది. అంతకుముందు ఆదివారం మూడోరోజు 140-4తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన విండీస 81.5 ఓవర్లలో 248 పరుగులకు ఆలౌటైంది. వన్ డౌన్ బ్యాటర్ అలిక్ అతనాజ్ (41) టాప్ స్కోరర్. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్ కు ఐదు వికెట్లు దక్కాయి. దీంతో భారత్ కు 270 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కింది.

# 9వేల సర్క్యులర్ల స్థానంలో 238!
## ఆర్బీఐలో కాలం చెల్లిన సర్క్యులర్లకు చెల్లుచీటీ!




**ముంబయి, అక్టోబరు 12:** భారతీయ రిజర్వుబ్యాంకు బ్యాకింగ్ నియంత్రణ చట్టాలు, గతంలో జారీచేసిన సర్క్యులర్లను పునఃపరిశీలించి వాటిని మొత్తం 238 కీలక మార్గదర్శకాలు లేదా సర్క్యులర్లుగా మార్చేందుకు కార్యాచరణ ప్రారంభించింది. ఇప్పటివరకూ ఆర్బీఐ తొమ్మిదివేలకుపైగా సర్క్యులర్లు బ్యాంకులకు జారీచేసింది. అంతేకాకుండా వీటిపర్యవేక్షణ బాధ్యతలు కూడా భారం అవుతున్నాయి, అంతేకాకుండా నిర్వహణ వ్యయం కూడా పెరుగుతుండటంతో మొత్తం 9వేల సర్క్యులర్ల స్థానంలో 238 మాస్టర్ డైరెక్షన్లు లేదా సర్క్యులర్లను కొనసాగించేందుకు నిర్ణయించింది. ప్రస్తుతం చేపట్టిన ఈకార్యాచరణవల్ల మరింత పారదర్శకత పెరుగుతుందని, కాలంచెల్లిన సర్క్యులర్లను తొలగించి బ్యాంకు నియంత్రణ సామర్థ్యం మరింత పెంచేటట్లుచేస్తుందని అధికారులు చెపుతున్నారు. ప్రస్తుతం ఉన్న 9వేల సర్క్యులర్లను 238 మాస్టర్ డైరెక్షన్లుగా విలీనంచేస్తోంది. మొత్తం 30 ఏరియాల్లో 11 రకాల ప్రభుత్వ నియంత్రిత సంస్థలు వీటికి రూపకల్పనచేస్తున్నాయి. మొత్తం 9 వేల సర్క్యులర్లను రద్దుచేసి వాటిస్థానంలో 238 మాస్టర్ డైరెక్షన్లు అంటే మార్గదర్శకాలను ప్రవేశపెట్టనున్నది. 11 నియంత్రిత సంస్థల్లో వాణిజ్య బ్యాంకులు, చిన్నఫైనాన్స్ బ్యాంకులు, పేమెంట్ బ్యాంకులు, స్థానిక ప్రాంత బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకులు, గ్రామీణ సహకార బ్యాంకులు, అఖిలభారత ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్లు, నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు, అసెట్ రికన్‌స్ట్రక్షన్ కంపెనీలు, క్రెడిట్ ఇన్ఫర్మేషన్ కంపెనీలు కూడా ఉంటాయి.

రిజర్వుబ్యాంకుల్లోని డిపార్టుమెంట్ ఆఫ్ రెగ్యులేషన్ ఈ విలీనం కొత్తసర్క్యులర్ల జారీ ఏర్పాట్లు పర్యవేక్షిస్తుంది. అంతేకాకుండా ఈ విభాగంలో కొత్తగా రెగ్యులేషన్స్ రివ్యూఅథారిటీనికూడా ఏర్పాటుచేసి చట్టాలు, నియమనిబంధనలు, సర్క్యులర్లు, రిపోర్టింగ్ వ్యవస్థలు వంటివి పర్యవేక్షణచేసేవిధంగా ఆర్బీఐ చర్యలు చేపట్టింది. అథారిటీ ఇప్పటివరకూ 714 సర్క్యులర్లు విత్‌డ్రాచేయవచ్చని సూచించింది. ప్రస్తుతం ఈవ్యవస్థపై సంబంధిత వ్యవస్థలు, అనుబంధ సంఘాలు అన్నివర్గాలనుంచి అభిప్రాయ సేకరణ జరుపు తోంది. ఇందుకు నవంబరు పదవ తేదీ తుదిగడువుగా నిర్ణయించింది.

# చక్కెర సీజన్‌లో 7.75 లక్షల టన్నుల ఎగుమతులు!



**న్యూఢిల్లీ, అక్టోబరు 12:** ప్రస్తుత చక్కెర సీజన్‌లో భారత్ 7.75 లక్షల టన్నుల చక్కెరను ఎగుమతి చేయవచ్చని ట్రేడర్లు అంచనావేసారు. చక్కెర తయారీ, ట్రేడర్ల సంఘం ఇస్టా ఎగుమతులపై సర్వేలుచేస్తూ 7.75 లక్షల టన్నుల చక్కెర ఎగుమతి అవుతుందని తెలిపింది. చక్కెర మార్కెటింగ్ సీజన్ అక్టోబరునుంచి సెప్టెంబరువరకూ నడుస్తుంది. చక్కెరెగుమతులు 2024-25 మార్కెటింగ్ సీజన్‌లో ఎగుమతులకు అనుమతులు ఇస్తారు. జనవరి 20 నుంచి అనుమతులిస్తారు. మొత్తం పదిలక్షల టన్నులవరకూ ఎగుమతులుచేసుకునేందుకు కేంద్రం అనుమతిస్తుంది. అఖిలభారత చక్కెర ట్రేడ్ అసోసియేషన్ అంచనాలప్రకారం మిల్లులు ఇప్పటికే 7.75 లక్షల టన్నులు ఎగుమతులు చేసాయని, ఫిబ్రవరి, సెప్టెంబరు మధ్యకాలంలోనే ఈ ఎగుమతులు జరిగినట్లు చెపుతున్నారు. ఈ మొత్తంలో తెల్లచక్కెర ఎగుమతులు 6.13 లక్షల టన్నులు, శుద్ధిచేసిన చక్కెర 1.04 లక్షల టన్నులు, ముడిచక్కెర 33,338 టన్నులు వరకూ ఉందని ఇస్టా వెల్లడించింది. 21 వేల టన్నుల ముడిచక్కెర శుద్ధిచేసేందుకు సెజ్‌లలోకి వెల్లింది. ఈ మొత్తం కూడా ఎగుమతులకోసమేనని సంఘం చెపుతోంది. మొత్తం ఎగుమతులు డిజిబౌటికి 1.46 లక్షలటన్నులు వెళ్లాయి. సోమాలియాకు 1.35 లక్షల టన్నులు, శ్రీలంకకు 1.34 లక్షలు, ఆఫ్ఘనిస్తాన్‌కు 75,333 టన్నులు వెళ్లాయి. ఇస్టా అంచనాల ప్రకారంచక్కెర ఎగుమతులు 2024-25కు 8 లక్షల టన్నులుగా ఉంది. వాస్తవ ఎగుమతులు ఇప్పటివరకూ 7.75 లక్షలటన్నులు అయిందని ఇస్టా వెల్లడించింది. ట్రేడర్ల సంఘం ఇదే ఎగుమతి కోటాను ఈ ఏడాది సీజన్‌కు కూడా అనుమతించాలని అదే కోటా కొనసాగించాలనికేంద్రాన్ని కోరుతోంది. అయితే కేంద్రం దీనిపై సానుకూలంగానే స్పందిస్తుందన్న అంచనాలు కూడా లేకపోలేదు.

# రెండోత్రైమాసికంలో సిమెంట్ కంపెనీల్లో భారీ వృద్ధి!



**న్యూఢిల్లీ, అక్టోబరు 12:** భారత్‌లోని టాప్ ఐదు సిమెంట్ కంపెనీలు ఈసారి రెండోత్రైమాసికంలో పటిష్టమైన ఆర్థికఫలితాలు సాధించే అవకాశం ఉంది. వార్షిక పద్దతిలోచూసినా, పన్నులు, వడ్డీ, తరుగుదల వంటివి తగ్గించకుండా చూసినా టన్నువారీగా రికార్డుస్థాయి రాబడులు రావచ్చని అంచనా. సుమారు 40నుంచి 70శాతంగా ఉంటుందని అంచనావేస్తున్నారు. వార్షికపద్దతిలోచూస్తే ఐదుశాతం పెరిగి బస్తాకు 350 నుంచి 365గా ఉండవచ్చన్న అంచనాలున్నాయి. త్రైమాసికం వారీగాచూస్తే రాబడులు డిమాండ్ క్షీణించడంతో కొంతమేర తగ్గవచ్చన్న అంచనాలు కూడా లేకపోలేదు. సిమెంట్‌దరలు ఈసారి రెండుశాతం క్షీణించినట్లు ఎలారా క్యాపిటల్ వెల్లడించింది. సిమెంట్ రంగం పరంగా జెఎం ఫైనాన్షియల్స్ నాలుగునుంచి ఐదుశాతం వృద్ధినమోదుచేస్తుందని అంచనావేసింది. అల్ట్రాటెక్ సిమెంట్, ఇండియా సిమెంట్స్, కేశోరామ్ సిమెంట్స్ అంబుజా సిమెంట్స్ వంటివి వృద్ధికి ఆస్కారం ఉన్న కంపెనీలుగా చెపుతున్నారు. జిఎస్టీ రేట్‌కట్‌కూడా సిమెంట్ ధరలకు కంపెనీల పటిష్టతకు మరింత దోహదంచేస్తుందని అంచనా. 28 శాతంనుంచి 18శాతం శ్లాబులో సిమెంట్‌ను చేర్చారు. అల్ట్రాటెక్‌సిమెంట్ 3276.70 కోట్లు, అంబుజా సిమెంట్స్ 1609.70 కోట్లు, శ్రీసిమెంట్ 982.3 కోట్లు, దాల్మిఆ భారత్ 715.2కోట్లు, జెకెసిమెంట్ 471 కోట్లుగా రావచ్చన్న అంచనాలున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో నిర్మాణరంగం వేగం పుంజుకుంటే కొంతమేర సిమెంట్ కంపెనీలకు వృద్ధికలుగుతుంది. సిమెంట్ గిరాకీకూడా పెరగవచ్చన్న అంచనాలున్నాయి.




# రూ.28 వేల కోట్ల సమీకరణకు ప్రభుత్వ సెక్యూరిటీల వేలం!

**ముంబయి, అక్టోబరు 12:** కేంద్ర ప్రభుత్వం రెండుసార్లు నిర్దిష్టమైనతేదీల్లో బాండ్లను విక్రయించడంద్వారా రూ.28 వేలకోట్లు నిధులు సమీకరించనున్నది. ప్రభుత్వ సెక్యూరిటీలు 2040 నాటికి రెడింప్షన్ అయ్యేవిధంగా 6.68శాతం కూపన్‌రేట్‌తో ఈ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపింది. భారతీయ రిజర్వుబ్యాంకు ఈ సెక్యూరిటీలు వారం వారం వేలం కింద నిర్వహిస్తుంది. 2065 నాటికి రిడింప్షన్ అయ్యే సెక్యూరిటీలకు 6.90శాతం వడ్డీరేటు అందిస్తోంది. 2040 నాటికి 6.68శాతం కూపన్‌రేటు ఇచ్చే మొత్తం రూ.16 వేలు కోట్లుగా ఉంటుంది. కటాఫ్ ప్రైస్ 98.68గా నిర్ణయించింది. దీనివల్ల 6.82శాతం రాబడులు ఉంటాయని అంచనావేసింది. ఇప్పటికే 6,46,598 కోట్లవిలువైన బిడ్లు అందాయి. వాటిలో 15,986 కోట్లకు ఆమోదం తెలిపినట్లు స్పష్టం అయింది. సగటు రాబడులు 6.82 శాతంగా ఉంటాయని అంచనా. ఇక 2065 నాటికి విముకినత పొందే ప్రభుత్వ సెక్యూరిటీలకు 6.90శాతం వడ్డీరేటుగా ఉంటుంది. 11,984 కోట్లవిలువైన బిడ్లను ప్రభుత్వం ఆమోదించింది. మొత్తం 39,166 కోట్లమేర బిడ్లు రాగా కటాఫ్ ధరను 96.53గా నిర్ణయించింది. అంటే పరోక్షంగా 7.17శాతం రాబడులు ఉంటాయని అంచనా. సగటు మొత్తంగా 7.16శాతం ఉంటుందని ఆర్బీఐ అంచనావేసింది.

# బీర్ తయారీ రంగంలో అల్యూమినియం క్యాన్ల కొరత!

**న్యూఢిల్లీ, అక్టోబరు 12:** అల్యూమినియం క్యాన్‌ల సరఫరాలో కొరతవల్ల దేశీయంగా బీర్ తయారీ పరిశ్రమ కొరతను ఎదుర్కొంటున్నది. దీనితో క్వాలిటీ కంట్రోల్ నిబంధనలను కొంతమేర సడలించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తిచేస్తోంది. బీర్ తయారీ పరిశ్రమ సాలీనా 12నుంచి 13 కోట్ల యూనిట్ల కొరతను ఎదుర్కొంటున్నది. 500 ఎంఎల్ క్యాన్‌లు సరఫరాకోసం టెండర్లు వేసినా ఇప్పటికీ అందుకోనిపరిస్థితి నెలకొంది. మొత్తం బీర్‌సేల్స్‌లో అల్యూమినియమ్ క్యాన్‌ల్లో సరఫరా 20శాతం వాటా ఉంది. అంతేకాకుండా ఈ కొరత ఇలాగే కొనసాగితే 1300 కోట్ల రూపాయలు ప్రభుత్వ రాబడుల్లో తగ్గుదల ఉంటుందని బ్రూవర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. బిఐఎస్ నిబంధనలకు



అనుగుణంగా ఏప్రిల్ ఒకటవ తేదీ జారీచేసిన క్వాలిటీ కంట్రోల్ ఆర్డరు కారణంగానే సరఫరాలో స్వల్పకాలిక సమస్యలు వచ్చాయని, దీనివల్ల బేవరేజ్ ప్యాకేజింగ్ ఇండస్ట్రీ దేశంలో అల్యూమినియం కొరతను ఎదుర్కొంటున్నట్లు తేలింది. అల్యూమినియం కాన్ సప్లయిర్లలో బాల్ బేవరేజ్ ప్యాకేజింగ్ ఇండియా, కాన్ ప్యాక్ ఇండియా సంస్థలు ఇప్పటికే తమ కోటా పరిమితికి అనుగుణంగా సరఫరాచేసేసామని చెపుతున్నాయి. మరింతగా సరఫరాచేయలేమని చెప్పాయి. మరో ఏడాది పూర్తయితేకానీ సరఫనరాను పెంచలేమని కొత్త ఉత్పత్తి యూనిట్లుప్రారంభం కావాల్సిఉందని చెప్పాయి. క్వాలిటీ కంట్రోల్ ఆర్డరుతోపాటు బీర్ పరిశ్రమ విదేశీ వెండార్లనుంచి క్యాన్‌లను తెచ్చుకోడానికి వీలులేదు. బిఐఎస్ సర్టిఫికేషన్ కొన్ని నెలలు పడుతోంది దీనివల్ల సరఫఞాలో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నట్లు ఉత్పత్తి సంస్థలు చెపుతున్నాయి. ఇటీవలే ఈ కేన్ల కొరతపై యుబి సంస్థ ఎండి సిఇఒ కూడా ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. అంతేకా కుండా పరిశ్రమల ప్రోత్సాహక మండలి దీపమ్‌కు కూడా లేఖలురాసారు. బ్రూవరీస్ అసోసి యేషన్ ఆఫ్ ఇండియా బాయ్ డైరెక్టర్ జనరల్ వినోద్ గిరి మాట్లాడుతూ ప్రస్తుతం 55 బ్రూవరీలున్నాయని, వీటిలో 25 వేల కోట్ల వరకూ పెట్టుబడులుఉంటే 27 వేల మందికిపైగా ఉపాధిపొందు తున్నా రని, సరఫరా కొరత ఉంటే తాత్కాలికగా ఉత్పత్తినిలిపి వేయాల్సి ఉంటుందని, పరోక్షంగా రైతులు, అను బంధ యూనిట్లపైనా పడుతుందని చెప్పారు. అల్యూమినియమ్ కేన్ల తయారీ విస్తరణ కనీసం ఏడాదిపడుతుందని ఈలోపు విదేశీ కేన్లను దిగుమతిచేసు కునేందుకు కేంద్రం అనుమతించాలని చెపుతున్నారు. ఇదేతీరుకొనసాగితే కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలకు సుమారు రూ.1200నుంచి రూ.1300కోట్లు పన్నులరూపంలో గండిపడుతుందని గుర్తుచేసారు. వ్యవసాయం, ప్యాకేజింగ్, లాజిస్టిక్స్, రిటైల్ రంగాల పైనా ఈకొరత ప్రభావం ఉంటుందని అందువల్ల ప్రభుత్వం సత్వరమే స్పందించి చర్యలు తీసుకోవాలని వారుకోరుతున్నారు.



# వచ్చే ఐదేళ్లకాలానికి ఎస్‌బిఐ కార్యాచరణ

**న్యూఢిల్లీ, అక్టోబరు 12:** ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం భారతీయ స్టేట్‌బ్యాంకు తన ఉద్యోగుల్లో కనీసం 30శాతం వరకూ మహిళా ఉద్యోగులు ఉండేటట్లు చర్యలు తీసుకుంటున్నది. వచ్చే ఐదేళ్లలో మహిళా వర్క్‌ఫోర్స్ కనీసం 30శాతానికి తగ్గకుండా చూడాలని చూస్తోంది. ఫ్రంట్‌లైన్ స్టాఫ్ పరంగా 33శాతం వరకూ ఉన్నారు. అదే మొత్తంగాచూస్తే 27శాతం మాత్రమే ఉంది. అందువల్లనే లింగసమానత్వం సాధించేదిశగా బ్యాంకుపరంగా వచ్చే ఐదేళ్లలో 30శాతం మంది మహిళా ఉద్యోగులుండేటట్లు చర్యలు తీసుకుంటున్నట్లు డిప్యూటి ఎండి కిశోర్‌కుమార్ పోలుదాసు వెల్లడించారు. బ్యాంకు మధ్యంతర లక్ష్యంగా 30శాతం వర్క్‌ఫోర్స్ మహిళలు ఉండాలన్న లక్ష్యంతో ఉన్నట్లు చెప్పారు. ఎస్‌బిఐలో ఇప్పటివరకూ మొత్తం 2.4 లక్షలమంది ఉద్యోగులుపనిచేస్తున్నారు. ప్రభుత్వబ్యాంకింగ్ రంగంలో అత్యధిక సంఖ్యలోపనిచేస్తున్నది ఎస్‌బిఐలోనే అని చెప్పవచ్చు. అన్ని స్థాయిల్లోను కూడా మహిళా వర్క్‌ఫోర్స్ ఉండేటట్లు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. బ్యాంకు ఇప్పటికే వర్కింగ్ తల్లులకోసం క్రెచ్ అలవెన్స్‌కూడా ఇస్తోందని, ఫ్యామిలీ కనెక్ట్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళా ఉద్యోగులకు సాయం అందించేందుకు శిక్షణకూడా కొనసాగుతోందని చెప్పారు. బ్రెస్ట్ క్యాన్సర్; సర్వికల్ కేన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాలు పూర్తిచేసామని, న్యూట్రిషన్ అలవెన్సు కూడా ఇస్తున్నట్లు తెలిపారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.